




తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM


హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-2-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 13 పేజీలు: 10+4 వెల: 6.50


రంగంలోకి కొత్త రాఫెల్ విమానాలు

ట్రంప్ - నెతన్యాహు కీలక సమావేశం 5





గురువారం రామాయంపేటలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

# గెలుపెవరిది?

## మున్సిపల్ ఓట్ల లెక్కింపు నేడే

### 12వేల పోలీస్ బలగాలతో బందోబస్తు

### కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత: డిజిపి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి12:** రాష్ట్రంలో మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన ఓటర్ల తీర్పు శుక్రవారం వెల్లడి కానుంది. ఉదయం 8 గంటల 123 కేంద్రాల్లో లెక్కింపు జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాల్టీల్లో 28 లక్షల 4వేల 274 ఓట్లు 7 కార్పొరేషన్లలో లక్ష 5 వేల 132ఓట్లు లెక్కించాల్సి ఉంది. స్ట్రాంగ్ రూముల్లో 16 వేల 31 బ్యాలెట్ బాక్సుల్లో ఓట్లను భద్రపరిచారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియ, ఫలితాల వెల్లడికి సంబంధించిన >>2

# నేనే రాజు.. నేనే మంత్రి!

## పదిన్నరేళ్లు సిఎం పదవిలోనే



**2029 ఏప్రిల్‌లో జమిలి.. అప్పుడే అసెంబ్లీ ఎన్నికలు**

**కిషన్‌రెడ్డి లేఖ రాస్తే ఫోన్ ట్యాపింగ్ కేసు సిబిఐకి**

**ఫార్ములా కేసులో కెటిఆర్‌ను ఇడి ఎందుకు విచారించదు?**

**ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి**

**హైదరాబాద్‌ను బుల్లెట్ రైలు హబ్‌గా మారుస్తాం..**

**ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి చిట్‌చాట్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి12:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీ టూర్ బిజీబిజీగా కొనసాగుతోంది. గురువారం ఉదయం నుంచి ఆయన ముగ్గురు కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, రామ్మోహన్‌నాయుడుతో పాటు అశ్వినీ వైష్ణవ్‌లను కలిశారు. సాయంత్రం పార్టీ జనరల్ సెక్రటరీ కేసి వేణుగోపాల్‌తో పాటు రాహుల్‌గాంధీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమావేశం ముగిసిన అనంతరం బయటకు వచ్చిన సిఎం రేవంత్‌రెడ్డి మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు జరుగుతాయి. జమిలి ఎన్నికల్లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని >>2



గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో సిఎం రేవంత్ 7

## 'మూసీ'కి 100 ఎకరాలివ్వండి

'గాంధీ సరోవర్' శంకుస్థాపనకు రండి

**రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌ను కోరిన సిఎం రేవంత్**

**కేంద్ర నిధులతో కృష్ణా-వికారాబాద్ రైలు మార్గం**

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరిన సిఎం

**అంతర్జాతీయ ప్రమాణాలతో మామునూరు ఎయిర్‌పోర్ట్: కేంద్ర మంత్రి రామ్మోహాన్ నాయుడుకు వినతి**

## 10, 954 గ్రామ పాలనా అధికారి పోస్టులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** గ్రామ పరిపాలనను మరింత బలోపేతం చేసే దిశగా రెవెన్యూ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ గ్రామ పాలన అధికారి (జీపీవో)సబార్డినేట్ సర్వీస్ రూల్స్-2025 పేరుతో కొత్త నిబంధనలను ఖరారు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పరిపాలనను పటిష్టం చేసేందుకు 10,954 గ్రామ పాలన అధికారి పోస్టులను ప్రభుత్వం >>2



## కార్మిక సమ్మె ప్రశాంతం

### నిలిచిన ఉత్పత్తిరంగ కార్యకలాపాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్‌లు, ఇండో అమెరికా ట్రేడ్‌డీల్‌తో వ్యవసాయ రంగానికి తీరనినష్టం వాటిల్లుతోందని, ఎన్డీయే ప్రభుత్వం కార్పొరేట్‌శక్తులకే అనుకూలంగా వ్యవహరిస్తోందని పేర్కొంటూ దేశవ్యాప్తంగా 13 ట్రేడ్‌యూనియన్లు ఇచ్చిన నిరసన పిలుపు మేరకు ప్రశాంతంగా ముగిసింది. సుమారు 30 కోట్లమందికిపైగా రైతులు, కార్మికులు, ట్రేడ్‌యూనియన్ కార్యకర్తలు పాల్గొన్న ఈ సమ్మె ప్రశాంతంగానే ముగిసింది. ఇండో అమెరికా ట్రేడ్‌డీల్‌లో రైతులు, చిన్న వ్యాపారాలు, కార్మికుల హక్కులు, శ్రేయస్సును కాలరాచేదిగా ఉందని నాయకులు ఆరోపించారు. పార్లమెంటులో కూడా ప్రజాప్రతినిధులు, విపక్ష ఎంపిలు ప్రభుత్వం వెంటనే ఈ డీల్‌ను రద్దుచేసి ప్రధాని నరేంద్రమోడీ ట్రంప్‌నకు లొంగిపోయారంటూ >>2

## ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు

# కొత్త ఆరోగ్య పథకం

### రెండు వారాల్లో ప్రారంభం

### రూ.1056 కోట్లతో ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు



**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 12:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మరో 15 రోజుల్లో నూతన ఆరోగ్య పథకాన్ని ప్రారంభించనుంది. ఇందుకు సంబంధించి ఉద్యోగులు, ప్రభుత్వం కలిసి రూ. 1056 కోట్లతో ఎంప్లాయిస్ హెల్త్‌కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఉద్యోగుల బేసిక్ పే నుంచి ఏడాదికి రూ. 528 కోట్లను సేకరించనుండగా.. ప్రభుత్వం మరో రూ. 528 కోట్లను ఇవ్వనుంది. ఈ మొత్తంలో ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ట్రస్ట్‌లో ఉద్యోగ సంఘాల నుంచి ఆరుగురు, పెన్షనర్ల నుంచి ఇద్దరు సభ్యులుగా కొనసాగనుండగా.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నుంచఇ ఒకరిని సీఈవోగా నియమిసానతరు. గురువారం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలతో సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెరామకృష్ణారావు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకంపై చర్చించారు. ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి మార్గదర్శకాలను త్వరలోనే రూపొందించనున్నారు. మరో పదిహేను రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సమక్షంలో ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకాన్ని ప్రారంభించాలని సచివాలయంలో జరిగిన ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ సమావేశం నిర్ణయించింది. సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వీ ఆనంద్, మహేశ్ దత్ ఎక్కా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోగ్తులతోపాటు పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగ సంఘాల నాయకులు హాజరయ్యారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ ఉద్యోగుల నూతన హెల్త్ స్కీమ్‌కు ఉద్యోగుల తరపున తమ బేసిక్ సాలరీలో 1.5 శాతం మొత్తాన్ని ఇవ్వనుండగా.. ప్రభుత్వం తరపున కూడా 1.5 శాతం కేటాయించాలన్న ప్రతిపాదనను సమావేశంలో అంగీకరించారు. హెల్త్ స్కీమ్ కు సంబంధించిన మార్గదర్శకాలను మరికొద్ది రోజుల్లో ఖరారు చేసి, ఈ పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులచే ప్రకటింపచేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు ఉద్యోగ సంఘాల నాయకులకు సూచించారు. రాష్ట్రంలో లక్షా 44 వేల మంది పెన్షనర్లు, రెగ్యులర్ ఉద్యోగులు ఉండగా, 12.84 లక్షల మంది డిపెండెంట్లు ఉన్నారని ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లలో నాలుగవ తరగతి ఉద్యోగులు, నాన్ గెజిటెడ్, గెజిటెడ్, పెన్షనర్లు తమ బేసిక్‌పేలో 1.5శాతం మొత్తాన్ని చెల్లిస్తే >>2



## జోరుజోరుగా క్యాంపు రాజకీయం

### పార్టీ అభ్యర్థులను కాపాడుకునే పనిలో నేతలు

### ఆదిలాబాద్, నిర్మల్ మునిసిపల్ పరిధిలో అభ్యర్థుల తరలింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి12:** రాష్ట్రంలో మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు పూర్తయ్యాయి. ఇక అభ్యర్థుల ఫలితాలు వెలువడటమే మిగిలింది. ఈ నేపథ్యంలో తమ అభ్యర్థులు చేజారిపోకుండా అన్ని పార్టీలు అప్రమత్తమయ్యారు. ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో పలుచోట్ల క్యాంపు రాజకీయాలు జోరందుకున్నాయి. ఫలితాల వెల్లడి అనంతరం అభ్యర్థులు చేజారిపోకుండా ఉండేందుకు అభ్యర్థులతో ఆయా పార్టీల కీలక నేతలు సమావేశాలను నిర్వహిస్తున్నారు. వారికి పలు కీలక సూచనలు చేస్తున్నారు. ఆయా పార్టీల నేతలు క్యాంపు రాజకీయాల్లో తలమునకలై ఉన్నారు.ఆదిలాబాద్, నిర్మల్ మున్సిపల్ పరిధిలో క్యాంపు రాజకీయాలకు తెర లేచింది. బీజేపీ,కాంగ్రెస్ నాయకులు బరిలో నిల్చున్న అభ్యర్థులను దూర ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తన క్యాంపు కార్యాలయానికి అభ్యర్థులను పిలిపించి ప్రత్యేక బస్సుల్లో వారిని తరలించే ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో పట్టణ శివారులోని ఫంక్షన్‌హాల్‌లో అభ్యర్థుల తో సమావేశమయ్యారు. వారిని ఎక్కడికి తరలించాలో సమాలోచన చేస్తున్నారు.బిఆర్ఎస్ అభ్యర్థులను మాజీ మంత్రి జోగు రామన్నసైతం క్యాంపునకు పంపించే ఆలోచనలో ఉండటంతో శుక్రవారం వెలువడే ఫలితాలు ఆసక్తిని రేపుతున్నాయి. అటు నిర్మల్‌లో బీజేపీ మహేశ్వర్‌రెడ్డి నివాసంలో 42 మంది అభ్యర్థులతో సమావేశం నిర్వహించి వారిని క్యాంపునకు తరలించారు.మరోవైపు సూర్యాపేటలో >>2



ఢాకాలో ఓటువేస్తున్న యూనస్

## బంగ్లా ఎన్నికలు హింసాత్మకం

### ఢాకాలో ఓటువేసిన మహ్మద్ యూనస్

**ఢాకా, ఫిబ్రవరి 12:** ఏడాదిన్నర నుంచి తీవ్ర రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్‌లో గురువారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ హింసాత్మక సంఘటనల మధ్య జరిగింది. ఈ 13వ సార్వత్రిక ఎన్నికల్లో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ముఖ్య సలహాదారు మహ్మద్ యూనస్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. దేశ రాజధాని ఢాకాలో ఆయన ఓటు వేశారు.ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకుంటున్నారు. 2024 ఆగస్టులో విద్యార్థుల ఉద్యమంతో అవామీ లీగ్ నేతృత్వంలోని హసీనా ప్రభుత్వం పడిపోయింది. అప్పటి నుంచి బంగ్లాదేశ్ పాలనను మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పర్యవేక్షిస్తూ >>2

**బంగ్లా ఎన్నికల్లో బిఎన్పీ కూటమి క్లీన్‌స్వీప్!** 5

**స్పీకర్ చాంబర్‌లోకి వెళ్లి బెదరించారు.. ఇదిగో ఆధారం!**

విపక్ష ఎంపీలపై కేంద్ర మంత్రి రిజిజు ఆరోపణలు 3

**విడాకుల తర్వాత భర్త ఇంట్లోకి వెళ్లే హక్కు భార్యకు లేదు!**

ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు 3

దిగుబడి ఆశచూపి.. ఎరువులు, పురుగు మందులు అంటగడుతున్న వైనం

వాటికే ఎకరాకు రూ.20వేలకు పైగా పెట్టుబడి

**రసాయన మందుల మితిమీరిన వినియోగంతో నేల నిస్సారం, విషతుల్యం**

**అవగాహన కల్పించాల్సిన ఎఓలు, ఎఇఓలు అందుబాటులో లేని పరిస్థితి**




# 'ఫెర్టిలైజర్' మాయాజాలం!

## రానురాను గిట్టుబాటు కాని వరిసాగు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** రైతులపై ఫర్టిలైజర్ కంపెనీలు కుట్రలకు తెరలేపాయి. పశువులు, కోళ్ల ఎరువులు వినియోగిస్తే పంట దిగుబడి తక్కువ వస్తుందని, తాము తయారు చేసిన బయోచార్, ఆర్గానిక్ మ్యాటర్, జింక్, ఫెర్రస్ లాంటి ఫర్టిలైజర్లు వాడితే రెండింతలు కాపు వస్తుందని రైతులను మభ్యపెడుతూ అవసరం లేని రసాయన ఎరువులు, పురుగుమందులను అంటకడుతూ అందినకాడికి దోచుకుంటున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో సాగునీటి వసతులు పెరగడంతోపాటు గడిచిన దాదాపు పదేళ్లుగా వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండడంతో వరి, పత్తితోపాటు ఇతర పంటల సాగు గణనీయంగా పెరిగింది. ఏటికేడు రాష్ట్రంలో సాగుభూమి విస్తీర్ణం >>2

## టర్కీ పార్లమెంటులో ఫైటింగ్

కొట్టుకున్న అధికార, విపక్ష ఎంపీలు 5

**ఎటిఎంలో డబ్బు నింపే వాహనంతో డ్రైవర్ పరార్**

రూ. 57 లక్షలతో ఉడాయింపు 7



న్యూఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం 'భారత్ బోధన్ ఎఐ కాన్‌క్లేవ్- 2026' సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

# హింసాత్మకం

>> వస్తున్నది. ఇప్పుడు ఈ ఎన్నికలతో ఢాకాలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. మొత్తం 299 పార్లమెంటు స్థానాలకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో వివిధ పార్టీలకు చెందిన 1,981 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. దాదాపు 12.7 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌పై ప్రభుత్వం నిషేధం విధించడంతో ఈసారి ప్రధాన పోటీ బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ), షఫీకుర్ రెహమాన్ నేతృత్వంలోని జమాత్‌ఎఇస్లామీ కూటమి మధ్యే ఉంది. విద్యార్థుల ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన నేషనల్ సిటిజన్ పార్టీ కూడా జమాతే కూటమిలో ఉంది. ఈ ఎన్నికలతోపాటు కీలక రాజ్యాంగ సంస్కరణలపైనా రిఫరెండం జరగనుంది. హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీ లేకుండా ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. హసీనా ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత బంగ్లాదేశ్‌లో హిందువులు లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. ఈ సార్వత్రిక ఎన్నికల్లో మతతత్వ పార్టీ జమాత్‌ఎఇస్లామీ నేతృత్వంలోని కూటమి అధికారంలోకి వస్తే మైనారిటీలపై దాడులు మరింతగా పెరిగే అవకాశం ఉందని హిందువులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాగా పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ హింసాత్మకంగా మారింది. దేశవ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, ఖుల్నా జిల్లాలో జరిగిన ఘర్షణలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నేత మొహిబుజ్జమాన్ కోచీ మరణించారు. ఈ ఘటనలతో దేశంలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది.

# నేనే రాజు.. నేనే మంత్రి!

>> పేర్కొన్నారు. నియోజకవార్గల పునర్విభజన జరుగుతుందని ఆయన వెల్లడించారు. ఒక ప్రశ్నకు సమాధానంగా తెలంగాణకు నేనే రాజు... నేనే మంత్రి, తనకు ఎవరూ పోటీ లేరని. మరో పద్నిరేళ్ల పాటు తానే సిఎంగా ఉంటానని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు తుది అంకానికి చేరిందని, అన్ని కేసుల్లో దర్యాప్తు ఆధారంగానే ముందుకెళ్తామని పేర్కొన్నారు. తమకు కెసిఆర్‌పై కక్ష సాధింపు లేదని, ఒకవేళ కెసిఆర్‌ను జైల్లో వేయాలనుకుంటే నిబంధనల ప్రకారమే వెళ్తామని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఎవరి ఫోన్ ట్యాప్ చేయడం లేదని, తన ప్రభుత్వంలో నూటికి నూరుశాతం ఫోన్ ట్యాపింగ్ లేదని రేవంత్ రెడ్డి అన్నారు. తాను ప్రజల అభిప్రాయాన్ని మాత్రమే తెలుసుకుంటానని ఆయన తెలిపారు. ఎస్ఐబి ఫిర్యాదుతోనే కేసు దర్యాప్తు జరుగుతోందని వివరించారు. ఎస్ఐబీలో పరికరాల మాయంతోనే కేసు బయటపడిందన్నారు. కిషన్‌రెడ్డి లేఖ రాస్తే ఫోన్ ట్యాపింగ్ కేసు కూడా సీబీఐకి ఇస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. ట్యాపింగ్ చేసి సంభాషణలు వింటే ఆయుష్షు తగ్గుతుందని చమత్కారంగా పేర్కొన్నారు. ట్యాపింగ్ కాల్స్ వినడం ఓ మానసిక రోగమని పేర్కొన్నారు. జడ్జీలు, జర్నలిస్టులు, రాజకీయ నేతల ఫోన్లు సైతం ట్యాప్ చేశారంటూ బిఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కారకుడు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు 20 నెలల పాటు విదేశాలకు పారిపోయారని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలోనే ప్రభాకర్‌రావును స్వదేశానికి తీసుకొచ్చామని వివరించారు. ప్రభాకర్‌రావు విచారణ తర్వాతే ఒక్కొక్కరికీ సిట్ నోటీసులు జారీ చేస్తోందన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఎస్ఐబిలో కంప్యూటర్లు, హార్ట్ డిస్కులు ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును తెలంగాణ హైకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేస్తోందని సిఎం రేవంత్ ఈ సందర్భంగతా గుర్తు చేశారు. కాళేశ్వరంపై సిబిఐ విచారణ జరపాలని కేంద్రాన్ని కోరామని, కానీ ఈ అంశాన్ని కేంద్రం పెండింగ్‌లో పెట్టిందని తెలిపారు. ఈ అంశంలో సిబిఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. కెసిఆర్, హరీశ్‌రావు కోరినట్లుగా ప్రభుత్వం నడువదని రేవంత్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం అక్రమాలు, ఫార్ములా ఈకార్ రేసుపై కేంద్ర ప్రభుత్వం చర్యలు ఎక్కడా అని ప్రశ్నించారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను విచారించిన ఈడీ, కెటిఆర్‌ను ఎందుకు విచారించడం లేదో చెప్పాలన్నారు. విద్యుత్ కొనుగోలు వ్యవహారం కేసును త్వరలోనే సీబీఐకి ఇస్తామని ఆయన వెల్లడించారు. 2018లో తెచ్చిన నిబంధనల ప్రకారమే సింగరేణిలో టెండర్లు జరిగాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సింగరేణి టెండర్లపై ప్రతి డాక్యుమెంట్‌ను అసెంబ్లీలో పెడతానన్నారు. ఆరోపణలు తప్పని తేలితే కిషన్‌రెడ్డి క్షమాపణలు చెబుతారా అని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. సింగరేణి సంస్థ అప్పులు తమ హయాంలో పెరగలేదన్నారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. సింగరేణి విషయంలో కేసీఆర్‌ను కిషన్‌రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదన్నారు. కేంద్ర బడ్జెట్‌తో తెలంగాణకు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు వచ్చిందని, హైదరాబాద్ నగరాన్ని బుల్లెట్ ట్రైన్ హబ్‌గా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఆ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రమంత్రికి ఇచ్చామన్నారు. ఫ్యూచర్ సిటీ, ఎయిర్ పోర్టుకు సమీపంలో బుల్లెట్ ట్రైన్ హబ్ కోసం 500-700 ఎకరాలు ఇవ్వాలనుకుంటున్నామని వెల్లడించారు. అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహం పెట్టితీరుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్టీఆర్ తెలుగు జాతి ఆస్తి అని... ఆయన ఎవరి సొత్తు కాదని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విశ్వవిఖ్యాత నట సార్వభౌముడికి భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఎట్టింది కాంగ్రెస్ పార్టీనే అని గుర్తు చేశారు. మార్చి 31లోపు హైదరాబాద్ మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసే ప్రక్రియ పూర్తి చేస్తామని అన్నారు. జూన్ 2న ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రాలయకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ ఎందుకు అభ్యంతరం చెబుతుందో అర్థం కావడం లేదన్నారు. కృష్ణ-గోదావరి బేసిన్‌లో తెలంగాణకు రావాల్సిన నీటి వాటా ఇచ్చి ఆ రాష్ట్రం ప్రాజెక్టులు కట్టుకుంటే తప్పులేదన్నారు. కృష్ణా జలలాలపై తాము అడిగినవన్నీ ఇస్తే ఎపికిసైతం సహకరిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కవిత పార్టీ గురించి తమకు తెలియదన్నారు.

**మనుషులను చంపేవాళ్లం కాదు**

కాంగ్రెస్‌కు రాజకీయ ప్రత్యర్థులే తప్ప శత్రువులు లేరని రేవంత్ రెడ్డి చెప్పారు. మహబూబ్‌నగర్‌లో ఓ కౌన్సిలర్ కోసం హత్యా రాజకీయాలు చేయాల్సిన అవసరం తమకు లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా అన్నారు. ఈ విషయంలో ఏమైనా అనుమానాలు ఉంటే బిజెపి... సిబిఐతో విచారణ జరుపుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కాగా, అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో కేబినెట్ విస్తరణ ప్రస్తావన రాలేదని సిఎం రేవంత్‌రెడ్డి క్లారిటీ ఇచ్చారు.

# సమ్మె ప్రశాంతం

>> నినాదాలుచేసారు. ఒకరోజు సమ్మెకార ణంగా ఉత్పత్తిరంగ కార్యకలాపాలు కుంటుప డ్డాయి. మోదీ చేపట్టిన సంస్కరణల అజెం డాను కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ఏడాదిలో జరిగే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఎన్డీయే సర్కారు పనిచేస్తోందని ఆరోపించారు. రైతు నేత హన్స్ మొల్లామాట్లా డుతూ ఇటీవల ట్రేడ్ ఒప్పందాలు న్యూజి లాండ్, యూరోప్, అమెరికాలతో జరిగిన ఒప్పందాలు భారత్‌లోని వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తుందని, స్థానిక మార్కెట్లలోకి అమెరి కా ఉత్పత్తులు ఇకపై వెల్లువలా వచ్చిపడతా యని, దీనివల్ల దేశీయ ఉత్పత్తులకు గండం ఏర్పడుతుందని ఆరోపించారు. అమెరికాతో జరిగిన ఒప్పందం వల్ల భారత్‌లోనిసన్నచిన్న కారు రైతుల జీవనోపాధి దెబ్బతింటుందని పేర్కొన్నారు. అమెరికా కారుచౌక వ్యవసాయ ఉత్పత్తుల భారత్‌లోకి డంప్‌చేస్తారని, వీటివల్ల చిన్న వ్యాపారాలు, చిరువ్యాపారులకు తీరనినష్టటం ఏర్పడుతుందని ఆలిండియా ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ నేత అమర్‌జీత్‌కౌర్ విమర్శించారు. దేశవ్యాప్తంగా కూడా కీలక రాష్ట్రాల్లో ఈసమ్మె కొనసాగింది. ఆటోకార్మికులు కూడా రోడ్లపైకి వచ్చి క్యాబ్‌లు, ఆటోలను నిలిపివేసారు. కొన్ని చోట్లప్రభుత్వ పరిధిలోని ఆర్టీసీ సర్వీసులు మధ్యాహ్నం వరకూ నిలిచిపోయాయి. తదనంతరం తగు మాత్రంలోనే సర్వీసులను నడపాల్సి వచ్చింది. దేశవ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.

**భారత్ బంద్‌తో స్తంభించిన సింగరేణి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** భారత్ బంద్‌లో భాగంగా సింగరేణి కార్మికులు స్వచ్ఛందంగా విధులను బహిష్కరించారు. కార్మిక చట్టాలను రద్దు చేయాలని, బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బంద్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్‌లను నిరసిస్తూ తెలంగాణలోని రామ గుండం, గోదావరిఖని, ఇతర ప్రాంతాల్లోని భూగర్భ, ఓపెన్‌కాస్ట్ గనులలో సింగరేణి కార్మి కులు విధులను బహిష్కరించారు. బీఎంఎస్ మినహా, కాంట్రాక్ట్, పర్మనెంట్ కార్మికులు ఈ సమ్మెలో పాల్గొని నిరసనలు, ర్యాలీలు నిర్వహించారు. దీంతో బొగ్గు వెలికితీత తది తర పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ఫలితంగా సుమారు 70,000 టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. రామగుండం ఏరియాలోని ఆర్జీ1, ఆర్జీ2, ఆర్జీ3 గనుల ప్రాంతాల్లో సమ్మె ప్రభావం ఎక్కువగా ఉంది. ఆర్జీ3, అర్జీ2, ఏపీఏ ప్రాంతాల్లో పర్మనెంట్, కాంట్రాక్ట్ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. గోదావరిఖని 2వ బొగ్గు గని ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు నిరసన చేపట్టారు. నాలుగు లేబర్ కోడ్ ల వల్ల కార్మికుల హక్కులను హరించి వేస్తుందని నాయకులు ఆరోపించారు.

## వారం - వర్జ్యం

13-02-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
ఏకాదశి మ.2.23
మూల సా.4.09
వర్జ్యం : రా.2.35-4.19
దు.ఉ.8.54-9.40
2) మ.12.45-1.31
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:**కుటుంబ విషయములో ఇతరుల జోక్యము అధికమౌతుంది. పోటీ పరీక్షలలో పాల్గొంటారు.ప్రతిష్టను నిలబెట్టుకుంటారు.

**వృషభం:** ఓర్పు బాగా అవసరము. విదేశీ వస్తువులు ఆకర్షణల నుండి బయట పడుటకు జాగ్రత్తను వహించండి.

**మిథునం:**చికాకులు ఉన్నప్పటికీ బాధ్యతలు సక్రమంగా నిర్వహించగలుగుతారు. ఋణయత్నము ఫలిస్తుంది. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:**అస్తవ్యస్తంగా ఉన్న చాలా వ్యవహారాలను మీ ప్రతిభతో అనుకూలంగా మలచుకుంటారు. వస్త్రలాభం.

**సింహం:**విలువైన పత్రములు డాక్యు మెంట్స్ మొదలైన వాటితో జాగ్రత్త అవసరం.విదేశీయానయత్నాలు ఫలిస్తాయి.

**కన్య :**విలువైన వస్తువుల కొనుగోలు విషయాలలో తగిన శ్రద్ధ చూపడం చెప్పదగినది. శుభవార్తలు అందుకుంటారు.

**తుల :** మిమ్మలను మోసం చేసే ప్రయత్నాలు ఫలించవు, సంఘసేవా కార్య క్రమాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** నేర్పుతో ముఖ్యులవద్ద గుర్తింపు పొందుతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. వస్తు కొనుగోలు.

**ధనుస్సు:** కొంతమేర జాగ్రత్తలు అవసరం. భాగస్వామ్య వ్యాపారాలలో జాగ్రత్తలు అవసరం. సోదరుల కలయిక.

**మకరం:**పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది. కోర్టు కేసుల నుండి బయటపడతారు. స్థలాలు కొనుగోలు.

**కుంభం:** ఆత్మీయవర్గానికి ధన సహాయం చేస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**మీనం:** విధి నిర్వహణలో పై అధికారుల ప్రశంసలు అందుకుంటారు. వాహనాల విషయంలో జాగ్రత్త అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'ఫెర్టిలైజర్' మాయాజాలం!

>> గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం దాదాపు కోటి 30లక్షల ఎకరాలకు సాగు విస్తరించినట్టు వ్యవసాయశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రధానంగా వరి సాగు గడిచిన పదేళ్లుగా గణనీయంగా పెరుగుతూ వస్తోంది. ఖరీఫ్, రబీ ఇలా ప్రతీ సీజన్‌లో రాష్ట్రంలో దాదాపు 50లక్షల నుండి 60లక్షల ఎకరాల మధ్య వరి సాగువుతోంది.

అయితే రైతులు మేలైన వరి విత్తనాల కోసం ప్రయివేటు ఫర్టిలైజర్ షాపులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా తమకు ఎక్కువ కమిషన్ ముట్టజెప్పే కంపెనీల వరి విత్తనాలను రైతులకు విక్రయించడంతోపాటు పనిలోపనిగా దిగుబడి ఎక్కువగా వస్తుందని ఆశచూపి అవసరం లేని రసాయన పురుగు, అడుగు మందులను రైతులకు అంటగడుతున్నారని ఫర్టిలైజర్ షాపుల యాజమాన్యాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో వరి సాగు చేసే రైతులు.. పశువుల పేడతోపాటు యూరియా, డీఏపీతోపాటు గుళికలు చల్లే వారు. ఇటీవలి కాలంలో కోడిపెంట వినియోగం కూడా వరిసాగులో పెరుగుతోంది. అయితే ఇటీవలి కాలంలో ఫర్టిలైజర్ల కంపెనీలు ఎరువుల దుకాణాల యాజమాన్యాలతో కుమ్మక్కై పాత పద్ధతికి స్వస్తి పలికి, తాము సూచించిన ఎరువులు వాడితే గతంలోకన్నా ఎకరాకు పది క్వింటాళ్లు అధికంగా పండుతాయని ప్రచారం మొదలు పెట్టాయి. ఒక పక్కన వ్యవసాయశాఖ, రాష్ట్ర ప్రభుత్వం అధిక ఎరువుల వినియోగంతో భూమి సారం కోల్పోయి విషతుల్యం అవుతుందని హెచ్చరిస్తుంటే ఆయా కంపెనీలు మాత్రం మధ్య దళారులను నియమించుకుని తక్కువ ధరలకే ఫర్టిలైజర్‌లు అంటూ భూమిని విషతుల్యం చేసే హానికర ఎరువులు, పురుగు మందులను రైతులకు అంటగడుతున్నాయి. మొత్తంగా నకిలీ విత్తనాలతో ఇప్పటికే నిండా మునుగుతున్న రైతులకు నాణ్యత లేని, అవసరం లేని ఫర్టిలైజర్లు సమస్యగా మారుతున్నాయి. ప్రస్తుతం వరిలో తాము సూచించిన రసాయన ఎరువులు, మందులు వాడితే అధికంగా పిలకలు వస్తాయని నాలుగైదు రకాల రసాయన మందులు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. అదే సమయంలో యూరియా, డీఏపీతోపాటు 20:20 అని, పోటాష్ వేస్తే గింజ తాలు పోదని ఇలా పలురకాలుగా మభ్యపెడుతూ రైతులకు ఫర్టిలైజర్ షాపులు ఎరువులు, పురుగుమందులను అంటగడుతుండడంతో ఎకరా వరిసాగు అనేది రైతులకు తలకుమించిన ఆర్థికభారంగా మారింది. ఎకరా వరి సాగుకు దున్నకం, కలుపు, నాటు ఖర్చులు కాకుండా ఎరువులు, పురుగుమందులకే రూ.20వేలదాకా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొనడంతో అన్నదాతలు అప్పులు తెచ్చి వరి సాగు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే వరిలో ఏ సమయంలో ఏయే ఎరువులు వాడాలో, ఏ మోతాదులో చల్లాలో/పిచికారి చేయాలో అవగాహన కల్పించాల్సిన వ్యవసాయశాఖ అధికారులు, విస్తరణాధికారులు రైతులకు అందుబాటులో లేకపోవడంతో ఫర్టిలైజర్‌షాపులు, ఎరువుల, పురుగు మందుల కంపెనీల వ్యాపారాలు అడ్డుఅదుపు లేకుండా సాగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వరిసాగు గిట్టుబాటుకాని పరిస్థితులు నెలకొన్నాయి. అదేవిధంగా వరితోపాటు ఇటీవలి కాలంలో రాష్ట్రంలో విస్తరిస్తున్న ఆయిల్ ఫామ్ సాగులోనూ అవసరంలేని రసాయ ఎరువులు, పురుగు మందుల వాడకం విపరీతంగా పెరిగిపోతోంది. దేశీయ పామాయిల్ ఉత్పత్తిలో 98శాతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 73 వేల మంది రైతులు సుమారుగా 2.72 లక్షల ఎకరాల్లో పంటను సాగు చేశారు. ప్రభుత్వం 31 జిల్లాల్లో సాగు విస్తరణ చేపట్టేందుకు 14 కంపెనీలకు అనుమతులు ఇచ్చింది. మరోవైపు మొక్కలు పెంచడం కోసం రాష్ట్రవ్యాప్తంగా 44 నర్సరీలు ఏర్పాటు చేశారు. గతంలో మామిడి లాంటి దీర్ఘకాలిక ఫలసాయం ఇచ్చే పంటకు కల్తార్ లాంటి గ్రోత్ ప్రమోటర్స్ వాడటంతో దాని నియంత్రణ కోసం విపరీతంగా పురుగు, తెగుళ్ల మందులు వాడి చివరికి పంటను తగ్గించే పరిస్థితి వచ్చింది. ఆయిల్ పామ్‌కు పశువుల, కోళ్ల ఎరువులతోపాటు వాటి మట్టలు ఎప్పటికప్పుడు తొలగిస్తే ప్రతి ఎకరంలో ప్రతి సంవత్సరం కనీసం 5 టన్నుల ఆర్గానిక్ మ్యాటర్ భూమిలో కలుస్తుంది. వీటితోపాటు శాస్త్రవేత్తలు సూచించిన ఫర్టిలైజర్లు పంటకు సరిపోతాయని, అవి గత 30 ఏళ్లుగా సాగు చేస్తున్న రైతులు తమ అనుభవం ద్వారా కొత్త రైతులకు సూచిస్తున్నారు. ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సారవంతమైన భూములు, నీటి వసతి ఉన్నభూములు ఉండటంతో అక్కడ అధికంగా ఫర్టిలైజర్ వాడవద్దని కోరుతున్నారు. కంపెనీలు వాళ్ల లాభాల కోసం తప్ప రైతుల మేలు కోసం ఏనాడూ పనిచేయవని చెబుతున్నారు. మొక్కలకు తెగులు వస్తే స్థానిక ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి వారి సలహాలు పాటించాలని స్పష్టం చేస్తున్నారు.




ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సమ్మె సందర్భంగా గురువారం ఒడిశాలోని బాలాసోర్‌లో రైల్వే ట్రాక్‌పై నినాదాలు చేస్తున్న కేంద్ర కార్మిక సంఘాల నాయకులు




భారత్-యుఎస్ మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై నిరసనగా గురువారం పార్లమెంటు ఆవరణలో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ఎంపీలు కెసి వేణుగోపాల్, ప్రశాంత్ పడోలే తదితరులు

# ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కొత్త ఆరోగ్య పథకం

>> సంవత్సరానికి రూ. 528 కోట్లు జమ అవుతాయని, అంతే మొత్తాన్ని ప్రభుత్వం తన వాటాగా ఇస్తుందని పేర్కొన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌లో ఉద్యోగ సంఘాల నుండి ఆరుగురు ప్రతినిధులు, పెన్షనర్ల నుండి ఇద్దరు సభ్యులుంటారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులనుండి ఒకరిని ట్రస్టు సీఈవోగా నియమిస్తారు. ఉద్యోగులకు ఉత్తమమైన వైద్య సదుపాయాలను అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని, ప్రస్తుతం ప్రతిపాదించిన నూతన హెల్త్ స్కీమ్ ఒక ముందడుగు అని సీఎస్ తెలిపారు. రానున్న కాలంలో ఈ పథకంలో మార్పులు, చేర్పులపై ట్రస్ట్ సమావేశంలో నిర్ణయిస్తారని తెలిపారు.

ఈ సమావేశంలో టిఎన్‌జివో సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, టిజివో సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు, తెలంగాణ సెక్రెటేరియేట్ అసోసియేషన్ అధ్యక్షులు జి. శ్రీనివాస రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రేమ్ దేవేందర్, పీఆర్‌టీయూ టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ రెడ్డి, తెలంగాణా యూటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు వంగా రవీందర్ రెడ్డి, తెలంగాణ రిటైర్డ్ అధికారుల సంఘం జేఏసీ అధ్యక్షులు లక్ష్మయ్య, మహిళా అధ్యక్షురాలు ఉమాదేవి, తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘానికి చెందిన నాగాంబ, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దాస్య నాయక్, ప్రధాన కార్యదర్శి సాయి కుమార్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు మోహన్ నారాయణ, కార్యదర్శి నర్స రాజు పాల్గొన్నారు.

# గెలుపెవరిది?

>> మార్గదర్శకాలపై అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభంకానుంది. ఆ తర్వాత బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లు లెక్కిస్తారు. పోలింగ్ కేంద్రం వారీగా 25 బ్యాలెట్ పత్రాలని ఒక బండిల్‌గా చేసి లెక్కింపు చేపట్టనున్నారు. ఒక్కో రౌండ్‌కు 40 కట్టలు అంటే వెయ్యి ఓట్లను కౌంటింగ్ టేబుల్‌కు పంపిస్తారు. ఓట్లను ఏజెంట్లకు చూపించి అభ్యర్థుల వారీగా ట్రేలో వేస్తారు. అభ్యర్థులకు వచ్చిన ఓట్లను 100 చొప్పున బండిల్ చేస్తారు. రౌండ్లు, టేబుళ్ల వారీగా అభ్యర్థులు నోటా, చెల్లని ఓట్ల వివరాలు నమోదు చేసి చివరకి ఫలితాలు ప్రకటించనున్నారు. ఓట్ల లెక్కింపు కోసం సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లని రాష్ట్ర ఎన్నికల సంఘం శిక్షణ ఇచ్చింది. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో 163 సెక్షన్ అమల్లో ఉంటుంది. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, అభ్యర్థులు, వారి ఏజెంట్లకు మాత్రమే ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని ఎస్ఈసీ స్పష్టంచేసింది. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తులకు కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదని తెలిపింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎస్ఈసీ, డీజీపీ, కలెక్టర్ల కార్యాలయాల్లో ఉన్నతాధికారులు పరిశీలించనున్నారు.

11న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పట్టణాలు, నగరాలన్నీ కలిపి 73.01 శాతం పోలింగ్ నమోదైంది. మున్సిపాలిటీల్లో 75.88, కార్పొరేషన్లలో 66.05 శాతం మంది ఓట్లు వేశారు. మున్సిపాలిటీల్లో అత్యధికంగా చౌటుప్పల్‌లో 91.91 శాతం, అతి తక్కువగా నందికొండలో 59.68 శాతం పోలింగ్ నమోదైంది. చౌటుప్పల్‌తో పాటు చండూరు, జిన్నారం, పోచంపల్లి మున్సిపాలిటీల్లో 90 శాతానికిపైగా ఓటర్లు ఓటు వేశారు. 46 మున్సిపాలిటీల్లో 80 శాతం, 51 మున్సిపాలిటీల్లో 70 శాతం, 15 మున్సిపాలిటీల్లో 60 శాతం దాటింది. రెండు కార్పొరేషన్లలో పోలింగ్ 70 శాతానికి పైగా, నాలుగింటిలో 60 శాతానికి పైగా నమోదైంది. కార్పొరేషన్లలో నల్గొండలో 77.36 శాతం, కొత్తగూడంలో 74.52, రామగుండంలో 69.32, మహబూబ్‌నగర్‌లో 67.73, మంచిర్యాలలో 64.90, కరీంనగర్‌లో 62.98, నిజామాబాద్‌లో 59.12 శాతం పోలింగ్ జరిగింది. పట్టణాలు, నగరాల్లో పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నింటిలో కలిపి పురుషులు 72.63 శాతం ఓట్లేయగా, మహిళలు 73.39 శాతం మంది ఓటు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీల్లోని 2 వేల 582 వార్డుల్లో 13 లక్షల 61 వేల 285 మంది పురుషులు, 14 లక్షల 42 వేల 751 మంది మహిళలు, 238 మంది ట్రాన్స్‌జెండర్లు ఓట్లు వేశారు. ఏడు కార్పొరేషన్లలో 4 లక్షల 90 వేల 544 మంది పురుషులు, 5 లక్షల 14 వేల 475 మంది మహిళలు, 113 మంది ట్రాన్స్‌జెండర్లు ఓట్లు వేశారు. పోలింగ్ సరళిని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ఎస్ఈసీ రాణికుముదిని, సీడీఎంఏ కార్యాలయంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి టీకే శ్రీదేవి నిరంతరం పర్యవేక్షించి, క్షేత్రస్థాయిలో అవసరమైన విషయాలను ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు మరియు ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి జరుగుతున్న ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 123 కౌంటింగ్ స్టేషన్లను సిద్ధం చేశామని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భద్రతను ఏర్పాటు చేసినట్లు డిజిపి పేర్కొన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణ కోసం 12 వేల మంది పోలీసు బలగాలతో పాటు సాయుధ బలగాలు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ నిరంతరం పహారా కాస్తాయని, అదనపు భద్రత కోసం ప్రతి కౌంటింగ్ కేంద్రాన్ని సీసీటీవీ కెమెరాల నిఘాలో ఉంచామని, వెబ్ కాస్టింగ్ విధానం ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితులను తన కార్యాలయ కమాండ్ కంట్రోల్ నుండి పర్యవేక్షి స్తామని వివరించారు. లెక్కింపు కేంద్రాలకు వచ్చే మార్గాలను కఠినంగా నియంత్రిస్తున్నామని, పాస్‌లు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఏదైనా అల్లర్లు లేదా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో సంబంధిత చట్టాల ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు డిజిపి తెలిపారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతిస్తామని, జన సమూహాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, పోలీసు అధికారులు అప్రమత్తతతో వ్యవహరిస్తూ కౌంటింగ్ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు. బిఎన్ఎస్ఎస్ 163 ప్రకారంగా.... కౌంటింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఎక్కువ మంది గుమికూడటం, ఆయుధాలు ధరించడం వంటి చర్యలపై నిషేధం అమలులో ఉంటుందన్నారు. ఉత్తర్వులను ఉల్లంఘించినట్లయితే తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చామని డిజిపి పేర్కొన్నారు. ఈ మొత్తం ప్రక్రియ విజయవంతంగా ముగిసేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మరియు ప్రజలు పోలీసు యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరించాలని డిజిపి బి.శివధర్‌రెడ్డి సూచించారు.

# క్యాంపు రాజకీయం

>> క్యాంపు రాజకీయాలు జోరందుకున్నాయి. శుక్రవారం ఎన్నికల ఫలితాల దృష్ట్యా బీఆర్ఎస్ అప్రమత్తమైంది. 48 వార్డులకు చెందిన ఆపార్టీ అభ్యర్థులను మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి క్యాంపునకు తరలించారు. పార్టీ ఫిరాయింపులను అడ్డుకునే వ్యూహంలోనే ముందస్తు చర్యలు చేపట్టినట్లుగా తెలుస్తోంది. ఈ సందర్భంగా అభ్యర్థులకు పలు కీలక సూచనలు చేసినట్లు సమాచారం. కాగా, మరోవైపు బీఆర్ఎస్ నేతలతో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో బాగా పనిచేశారని నేతలు, శ్రేణులను ఆయన అభినందించారు. ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేసిన కేటీఆర్ కొన్ని మున్సిపాల్టీలను సొంతంగా గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మరికొన్ని చోట్ల క్రియాశీలకంగా ఉంటామన్నారు. పార్టీ అభ్యర్థులతో క్యాంపులను నిర్వహించి నేతలకు కేటీఆర్ పలు కీలక సూచనలు చేశారు. విప్ జారీ సహా అన్ని అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. పలు అంశాలపై పార్టీ నేతలతో మాట్లాడారు. ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 73.01 శాతం పోలింగ్ నమోదైంది. పురుషులకంటే అధికంగా మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏ పార్టీ ఎన్నిస్థానాల్లో గెలుపొందుతుందనే దానిపై రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఈ ఎన్నికలను అన్ని పార్టీల నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. మరోసారి అధికస్థానాల్లో గెలుపొందేది తామేనన్న ధీమాలో కాంగ్రెస్ పార్టీ ఉండగా, ఈసారి తమ పార్టీ ఎక్కువ స్థానాల్లో గెలుపొందుతుందని బీఆర్ఎస్ పార్టీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. తాము కూడా ఎక్కువ స్థానాల్లో గెలుపొందుతామని బీజేపీ పార్టీ నేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. మరి ఏ పార్టీకి ప్రజలు పురపోరులో పట్టం కడతారు అనేది తెలుసుకోవాలంటే కొన్ని గంటలు వేచి చూడాల్సిందే. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని తమ అభ్యర్థులు పార్టీ ఫిరాయించకుండా ఉండేందుకు అన్ని రాజకీయపార్టీలు చర్యలు చేపట్టాయి. ఈ నేపథ్యంలోనే వారిలో కీలక నేతలు మంతనాలు సాగిస్తున్నారు. కొన్నిచోట్ల అభ్యర్థులను క్యాంపులకు తరలిస్తున్నారు. ఫలితాలు వెలువడనున్న వేళ రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

## గ్రామ పాలనాధికారి పోస్టులు

>> కేటాయించింది. గతంలో పనిచేసిన వీఆర్వోలు, జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్ క్యాడర్లలో క్రమబద్ధీకరించిన వీఆర్ఏలను ఈ పోస్టుల్లో నియమించనున్నారు. వీటితోపాటు నేరుగా నియామకం ద్వారా కూడా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. జీపీవో పోస్టులకుగాను నేరుగా నియామకమయ్యే అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. బదిలీ ద్వారా వచ్చే మాజీ వీఆర్వో, వీఆర్ఏ అభ్యర్థులు డిగ్రీ లేదా ఇంటర్మీడియట్‌తోపాటు కనీసం అయిదేళ్ల సర్వీసు కలిగి ఉండాలనే నిబంధన పెట్టారు. అభ్యర్థుల వయస్సు 18 నుండి 34 ఏళ్ల మధ్య ఉండాలని పేర్కొన్నారు. అయితే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 ఏళ్ల వయోసడలింపు ఉంటుందని సర్వీస్ రూల్స్‌లో స్పష్టం చేశారు. ఎంపికైన అభ్యర్థులకు విధులకు సంబంధించిన ప్రత్యేక శిక్షణ ఉంటుంది. నేరుగా నియామకమైన వారు విధుల్లో చేరిన రెండేళ్లలోపు నిర్దేశిత పరీక్షలైన పవర్స్ అండ్ డ్యూటీస్ ఆఫ్ జీపీవో, విలేజ్ మాన్యువల్ అఫ్ అకౌంట్స్, సర్వే ఎగ్జామ్స్ పాస్ అవ్వాల్సి ఉంటుంది. శిక్షణ పూర్తి చేసిన తర్వాత కనీసం మూడేళ్ల పాటు ప్రభుత్వానికి సేవలు అందిస్తామని బాండ్ సమర్పించాల్సి ఉంటుంది. జీపీవో కేడర్‌లో పనిచేస్తున్న వారికి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందే అవకాశం కల్పించారు. ఇందుకోసం 60:40 నిష్పత్తిని అమలు చేయనున్నారు. ఈ పోస్టులకు కలెక్టర్ నియామక, క్రమశిక్షణా అధికారిగా వ్యవహరిస్తారు. జిల్లాను ఓ యూనిట్‌గా పరిగణించి నియామకాలు, బదిలీలుచేపడతారు. ఈ నిబంధనల అమలుకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ ను ప్రభుత్వం ఆదేశించింది.

# కాంగ్రెస్ అభ్యర్థిని అవమానించినందుకే సిఐని దుర్భాషలాడాల్సి వచ్చింది

## పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** బుధవారం సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో ఒక పోలింగ్ బూత్ దగ్గర అడ్డూ అనే కాంగ్రెస్ పార్టీ నాయకుడిని ఒక సీఐ గల్లా పట్టి ఈడ్చుకొచ్చి, కొట్టినందుకు నా పార్టీ నాయకుడుని నేను రక్షించుకోవాలి కాబట్టి.. బూత్ కి వెళ్లి సీఐని తిట్టాల్సి వచ్చిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆ బూత్ లో అపోజిషన్ అభ్యర్థికి మద్దతుగా ఆ సీఐ మా పార్టీ నాయకుడిని అవమానించడంతో నేను ఆ బూత్ దగ్గరికి వెళ్లాను అని అన్నారు.ఇది నేను పోలీస్ ఉన్నతాధికారులకు కంప్లైంట్ ఇవ్వొచ్చు. కానీ పది మందిలో మా పార్టీ నాయకుడికి ఆ సీఐ చేసిన అవమానం పోదు కదా? అందుకే నేను బూత్ దగ్గరకు పోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు.ఎన్నికల నిబంధనలను ఆ సీఐ అయినా, నేనయినా ఉల్లంఘిస్తే అధికారులు దాని ప్రకారం చర్యలు తీసుకుంటారు. అది అందరం స్వాగతించాల్సిందే. న్యాయ స్థానంలో ఎవరిది తప్పు? ఎవరిది ఒప్పు అనేది తేలుతుందని అన్నారు.నిన్న సంగారెడ్డిలో జరిగిన ఈ సంఘటనని కేటీఆర్, హరీష్ రావు, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో.. జగ్గారెడ్డి అధికారుల మీద దాడి చేస్తున్నారని పదే పదే ప్రచారం చేస్తున్నారు.మరి నా గురించి ఇట్లా? గతంలో కేటీఆర్ ఒక పోలీసు అధికారిని బూతులు తిట్టిండు.హరీష్ రావు పోలీసులను తన్నిండు. తిట్టిండు. బూతు మాటలు అన్నడు. తెలంగాణ పోలీసులను పట్టుకొని ఆంధ్రోళ్లకు పుట్టారా అంటూ దూషించిండు అవి మర్చిపోయారా అని గుర్తు చేశారు.బీఆర్ఎస్ సోషల్ మీడియా ముందుగా.. కేటీఆర్, హరీష్ రావు తిట్టిన వాటికి సమాధానం చెప్పి, అప్పుడు నా గురించి మాట్లాడండి అంటూ ప్రకటనలో సవాల్ విసిరారు.



# పెద్దపల్లి బాలసదన్‌లో ఫుడ్ పాయిజనింగ్

## 32 మంది చిన్నారులకు అస్వస్థత

## పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు

## చికిత్స పొందుతున్న ఆరుగురు విద్యార్థినులు

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బాలసదన్‌లో బుధవారం రాత్రి తీవ్ర కలకలం రేగింది. రాత్రి భోజనం ముగించుకున్న తర్వాత చిన్నారులు ఒక్కొక్కరుగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. రాత్రి సుమారు 10:30 గంటల ప్రాంతంలో సదన్‌లో ఉన్న 32 మంది చిన్నారులకు వరుసగా వాంతులు ప్రారంభం కావడంతో నిర్వాహకులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన జిల్లా ప్రొటెక్షన్ ఆఫీసర్ నిర్మల, సిబ్బంది చిన్నారులందరినీ చికిత్స నిమిత్తం పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డీసీహెచ్ఎస్ వెంటనే స్పందించి, ఆసుపత్రి సూపరింటెండెంట్ కే.శ్రీధర్ ఆధ్వర్యంలో వైద్యులతో అత్యవసర చికిత్స అందించారు. అయితే ఇందులో 26 మంది సురక్షితంగా ఉండగా, వారికి పిడియాట్రిక్ డాక్టర్ వాసు దేవ రెడ్డి వారికి ప్రాథమిక చికిత్స చేసి, మందులు అందించారు. ప్రస్తుతం 6 గురు విద్యార్థులు చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న వారిలో సంద్ర శ్రావణి, తుమ్మల అంజలి, కల్వల అమూల్య, మన్యం శ్రీలక్ష్మి, మన్యం కృష్ణకుమారితోపాటు మరో విద్యార్థినీ ఉన్నారు. అయితే చిన్నారులు తీసుకున్న ఆహారంలో లోపం ఉందా లేక వారు తాగిన నీరు ఏమైనా కలుషితం అయ్యిందా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం విద్యార్థులందరూ క్షేమంగానే ఉన్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ కే.శ్రీధర్ తెలిపారు.

# పంచాయతీలకు కేంద్రం రూ.387 కోట్లు విడుదల

## పెండింగ్ మొత్తాలను వెంటనే విడుదల చేయాలి : మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం కింద కేంద్ర ప్రభుత్వం తాజాగా రూ.387 కోట్లు విడుదల చేసింది. ఇదివరకే మొదటి విడతగా రూ. 259.36 కోట్లు విడుదల చేసిన కేంద్రం, తాజా విడతతో కలిపి ఇప్పటివరకు మొత్తం రూ. 646.36 కోట్లు తెలంగాణ రాష్ట్రానికి అందించినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ తెలిపింది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు విజయవంతంగా పూర్తిచేసి, కేంద్ర ప్రభుత్వం కోరిన అన్ని విధాల సమాచారం, నిధుల విని యోగ వివరాలను సమర్పిం చిన అనంతరం నిబంధ నలకు అనుగుణంగా ఈ నిధులు విడుదలైనట్లు అధికారులు పేర్కొన్నారు. గ్రామాల్లో మౌళిక వసతుల అభివృద్ధి, పారి శుధ్యం, తాగునీటి సదుపాయాలు, గ్రామీణ రహదారుల మెరుగుదల వంటి పనులకు ఈ నిధులను వెచ్చించనున్నారు. అయితే 15వ ఆర్థిక సంఘం కింద తెలంగాణకు మొత్తం సుమారు రూ. 3,000 కోట్ల వరకు నిధులు రావాల్సి ఉండగా, ఇప్పటికీ సుమారు రూ. 2,400 కోట్ల వరకు నిధులు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. గ్రామాల సమగ్రాభివృద్ధి, స్థానిక సంస్థల ఆర్థిక బలోపేతం దృష్ట్యా పెండింగ్ నిధులను ఆలస్యం చేయకుండా వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి డా. దానసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వేగవంతం కావాలంటే కేంద్ర రాష్ట్రాల మధ్య సమన్వయం అత్యంత అవసరమని, గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని ఆమె తెలిపారు.

కాగా.. ఇందిరా మహిళా శక్తి జీవనోపాధుల కింద ప్రభుత్వ సహకారంతో మహిళలు రాణిస్తున్నారని మంత్రి సీతక్క తెలిపారు. ఇందుకు ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం, పాలంపేట గ్రామంలోని గాయత్రీ జువీ పరిధిలోని సరస్వతి స్వయంసహాయక సంఘం సభ్యురాలు వకులాభరణం అపర్ణ స్వయం ఉపాధి దిశగా రుచి రెస్టారెంట్ యూనిట్‌ను స్థాపించారని, ఈ యూనిట్ మొత్తం వ్యయం రూ.8,50,000 అని వివరించారు.

# స్పీకర్ చాంబర్‌లోకి వెళ్లి బెదరించారు.. ఇదిగో ఆధారం!

## విపక్ష ఎంపీలపై కేంద్రమంత్రి రిజిజు ఆరోపణలు

## స్పీకర్ చాంబర్‌లో ఘటనపై వీడియో విడుదల

## ఆరోపణలు ఖండించిన ప్రియాంకగాంధీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** లోక్‌సభ స్పీకర్ చాంబర్‌లోకి దూసుకెళ్లి విపక్ష ఎంపీలు దుర్భాషలాడారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. స్పీకర్ ఛాంబర్ లోపల అనేక మంది మహిళా కాంగ్రెస్ ఎంపీలు బిజెపి మంత్రులతో తీవ్ర వాగ్వాదానికి దిగిన దృశ్యాలను ఈ ఫుటేజ్‌లో కనిపిస్తుంది.

ఫిబ్రవరి 4న జరిగిన పార్లమెంటరీ ప్రతిష్టంభన సమయంలో కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ ఓం బిర్లాపై దూషణలు చేసి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీని లక్ష్యంగా చేసుకుని బెదిరింపులు జారీ చేశారని ఆరోపించారు. 20-25 మంది కాంగ్రెస్ ఎంపీలు లోక్ సభ స్పీకర్‌ను దుర్భాషలాడి, ప్రధానిని బెదిరించారని ఆరోపించారు. బిజెపి, ఎన్డీఏ ఎంపీలకు 'పూర్తి స్వేచ్ఛ' ఇచ్చి ఉంటే పరిస్థితి గందరగోళంగా మారేదని, కానీ అధికార కూటమి అసహ్యకరమైన దృశ్యాన్ని నివారించడానికి సంయమనం పాటించిందని అన్నారు. 'దాదాపు 20-25 మంది ఎంపీలు స్పీకర్ ఛాంబర్‌లోకి బలవంతంగా ప్రవేశించారు. అప్పుడు ఏమి జరిగిందో, వారు ఎలాంటి దుర్వినియోగం చేస్తున్నారో చూడటానికి తాను పరిగెత్తాను. వారు దుర్భాషలాడుతున్నారు. ప్రియాంక గాంధీ కూడా అక్కడే ఉన్నారు. వారు స్పీకర్, ప్రధాన మంత్రిని ఆమె ముందు దుర్భాషలాడారు' అని రిజిజు అన్నారు. కాంగ్రెస్ నాయకులు కె.సి. వేణుగోపాల్, ప్రియాంక గాంధీ వాద్రా ఎవరినీ దుర్భాషలాడలేదని, అయితే అనేక మంది కాంగ్రెస్ ఎంపీలు వారి సమక్షంలో అభ్యంతరకర వ్యాఖ్యలతో దూషించారని ఆయన ఆరోపించారు.

**అవన్నీ అబద్ధాలు: ప్రియాంకగాంధీ**

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చేసిన ఆరోపణలన్నీ 'అబద్ధం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపి ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. 'తాము ఎవరినీ దుర్భాషలాడలేదు. పరుష పదజాలం ఉపయోగించలేదు. ఒకరు లేదా ఇద్దరు ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రోత్స హించాన నడం శుద్ధ అబద్ధం. తాను మౌనంగా కూర్చున్నా. చివరికి, తాను స్పీకర్‌కు శాంతియుతంగా కొన్ని విషయాలు చెప్పాను.' అని ప్రియాంక గాంధీ వివరించారు.

# రూ.2,200 కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా

## 11 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్

## మొండికుంట చెరువు చుట్టూ ఆక్రమణల తొలగింపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** మాదాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెం టర్‌కు చేరువలో హైడ్రా భారీ ఆపరేషన్‌ను గురువారం నిర్వహించింది. వందలాది తాత్కాలిక షెడ్డులను, పదుల సంఖ్యలో ఉన్న షాపులను, మొండి కుంట ఆక్రమణలను తొలగించి హైడ్రా ఫెన్సి ంగ్ వేసింది. చెరువుతో పాటు.. పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణలు తొలగించి 11 ఎకరాల భూమిని కాపాడింది. దీని విలువ సుమారు రూ. 2200ల కోట్ల విలువ ఉంటుందనిఅంచనా. రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలో గురువారం ఈ మేజర్ ఆపరేషన్ హైడ్రా చేసింది. సర్వే నంబరు 53లోని మొండికుంటతో పాటు.. సర్వే నంబరు 55లోని ప్రభుత్వ భూమి ఎకరాలకొద్దీ ఆక్రమణలకు గురి అవుతోందని అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలమేరకు రెవెన్యూ, జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా క్షేత్ర స్థాయిలో విచారించింది. దాదాపు 11 ఎకరాలు కబ్జాకు గురైనట్టు అధికారులు గుర్తించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆలయాన్ని హద్దుగా చూపించి కబ్జాదారులు ఆక్రమణలకు పాల్పడినట్టు అధికారులు నిర్ధారించారు. ఆలయం హద్దుగా పలు షాపులు, మెకానిక్ షెడ్డులు, ఐరన్ స్టీల్ షాపు ఇలా పలు రకాల షెడ్డులు వేసి వ్యాపారాలు చేస్తున్నట్టు గుర్తించారు. 30కి పైగా ఉన్న షాపుల ద్వారా నెలకు రూ. లక్షల్లో అద్దెలు వసూలు చేస్తున్నారు. మొండికుంటతో పాటు అక్కడ ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణలపై జనవరి 31న హైడ్రా విచారణ కూడా చేపట్టింది. రెవెన్యూ అధికారులతో పాటు.. కబ్జాలకు పాల్పడిన వారు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. వారి సమక్షంలోనే ఆక్రమణలు జరిగినట్టు రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. అలాగే ఎన్ఆర్ఎస్‌సీ శాటిలైట్ చిత్రాలను పరిశీలించి ఆక్రమణలు జరిగినట్టు నిర్ధారించారు. ఇదే విషయాన్ని కబ్జాదారులకు తెలియజేశారు. వారికి కొంత సమయాన్ని ఇచ్చి గురువారం ఆక్రమణలను తొలగించే పనిని చేపట్టిం ది. వందల సంఖ్యలో ఉన్న తాత్కాలిక షెడ్డు లను భారీ బందోబస్తు మధ్య హైడ్రా తొలగిం చింది. ఈ ఆక్రమణలు తొలగించిన సందర్భంలో అక్కడ స్థానికులు పెద్దమొత్తంలో వచ్చి హైడ్రా చర్యలను అభినం దించారు.



మొండికుంట చెరువును కాపాడినందుకు అక్కడ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమ ణలు తొలగిం చిన చోట పార్కులను అభివృద్ధి చేయాలని స్థాని కులు ఈ సందర్భంగా హైడ్రా అధికారులను కోరారు. అలాగే చెరువును కూడా అభివృద్ధి చేసి సుందరీ కరించాలని అభ్యర్థించారు.

# కుల బహిష్కరణ విషయంలో కేసు నమోదు

**బీర్‌పూర్, ప్రభాతవార్త:** జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం కందనకుంటలో కుల బహిష్కరణ కేసు జగిత్యాల జిల్లాలో సంచలనగా మారింది. కందన కుంటకు చెందిన ఏదుల రాజేశం (45) మరణించగా అంతిమ సంస్కారాల విషయంలో జరిగిన తీరుపై గ్రామ పరిపాలన అధికారి ఎస్కె రఫీ అహ్మద్ ఫిర్యాదు మేరకు కులబహిష్కరణ విధించిన వారిపై కేసు నమోదు చేయబడిందని ఏస్. ఐ రాజు తెలిపారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు కందన కుంట గ్రామ పరిపాలన అధికారి కథనం మేరకు కందన కుంట గ్రామానికి చెందిన కోమిరే పోశయ్య కుటుంబ వ్యవహారాల విషయంలో కుల బహిష్కరణ విధించడం జరిగింద న్నారు. కుల బహిష్కరణకు గురైన వ్యక్తి అంతిమ సంస్కరణలో పాల్గొను టకు రాగా సంఘ కులస్తులు అందరూ అంతిమ సంస్కారాలు దూరంగా ఉన్నారని కుల బహిష్కరణకు కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్న గ్రామ పరిపాలన అధికారి ఫిర్యాదు మేరకు బీర్‌పూర్ ఎస్.ఐ రాజు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.


**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**
ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్
(CIN:L36911RJ1996PLC011381)
నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001

**అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన**

ఇది ఇలా ఉండగా, క్రింది సంతకందారుడు, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయినందున "సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం 2002" క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002తో చదువబడే సెక్షన్ 13 క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ రిఫరెన్స్ నం.: CB/SAR/13-2/AGR/Nov-2025/11 ప్రకారం 17/11/2025 తేదీ డిమాండ్ నోటీస్‌ను ఋణఖాతా నం.లు 2221261245188414 మరియు 9001231631102611 సంబంధించిన ఋణగ్రహీత/ హామీదారుడు/ తనఖాదారులు M/s KRS గ్రూప్ దాని భాగస్వాములు ద్వారా శ్రీ శ్రీనివాస హర్ష జమ్ము మరియు శ్రీ రవి కిరణ్ క్రొవ్విడి (ఋణగ్రహీత/ తనాఖాదారుడు) శ్రీ శ్రీనివాస హర్ష జమ్ము S/o శ్రీ దుర్గా రవీంద్రనాథ్ జమ్ము (హామీదారుడు) శ్రీరవి కిరణ్ క్రొవ్విడి S/o శ్రీ రామమోహన్ క్రొవ్విడి (హామీదారుడు) శ్రీమతి జమ్ము సుజాత W/o శ్రీ దుర్గా రవీంద్రనాథ్ జమ్ము (హామీదారుడు/తనఖాదారుడు వారికి ఋణ ఖాతా నం. 2221261245188414 కొరకు నోటీస్‌లో పేర్కొన్న సొమ్ము రూ.3,67,25,471/- (రూపాయలు మూడు కోట్ల అరవై ఏడు లక్షల ఇరవై అయిదు వేల నాలుగు వందల డెబ్బై ఒకటి మాత్రమే) మరియు 9001231631102611 కొరకు రూ.17,40,287/- (రూపాయలు పది హేడు లక్షల నలభై వేల రెండు వందల ఎనభై ఏడు మాత్రమే) ఏకంగా మొత్తం సొమ్ము రూ.3,84,65,758/- (రూపాయలు మూడు కోట్ల ఎనభై నాలుగు లక్షల అరవై అయిదు వేల ఏడువందల యాభై ఎనిమిది మాత్రమే) 15/11/2025 నాటికి మొత్తంగా కలిపి మొత్తం బకాయి (ప్రిన్సిపల్ వడ్డీ, పెనాల్టీలు మరియు అన్ని ఇతర ఛార్జీలు) తదుపరి వడ్డీతో మరియు ఛార్జీలు పూర్తి చెల్లింపు వరకు సదరు నోటీస్ స్వీకరణ యొక్క తేదీ/నోటీస్ యొక్క తేదీ నుండి 60 రోజులలో తిరిగి చెల్లించవలసినదిగా 17/11/2025 తేదీ గల డిమాండ్ నోటీస్ జారీ చేసారు.

ఋణగ్రహీత/తనఖాదారుడు సొమ్ము తిరిగి చెల్లించటంలో విఫలమైనందున 2026 సంవత్సరం యొక్క ఫిబ్రవరి యొక్క ఈ 09వ రోజున సదరు నిబంధనలు యొక్క నిబంధన 8తో చదువబడు సదరు చట్టం యొక్క 13(4) సెక్షన్ క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఇక్కడ క్రింద వివరించబడిన ఆస్తి దిగువ సంతకందారుడు స్వాధీనం చేసుకొన్నట్లు ఋణగ్రహీత/తనఖాదారునకు, సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించడమైనది.

"సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందటానికి లభ్యమయ్యే సమయానికి సంబంధించి చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (8) యొక్క ఏర్పాట్లు గురించి ఋణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది.

ఋణగ్రహీత/హామీదారుడు/తనఖాదారుడు ప్రత్యేకంగాను, సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపరాదు. మరియు ఆస్తితో ఏమైనా లావాదేవీలు జరిపినట్లయితే ఋణఖాతా నం. 2221261245188414 కొరకు రూ.3,88,27,274/- (రూపాయలు మూడు కోట్ల ఎనభై ఎనిమిది లక్షల, ఇరవై ఏడు వేల, మరియు రెండు వందల డెబ్బై నాలుగు మాత్రమే) మరియు ఋణఖాతా నం. 9001231631102611 రూ.18,46,378/- (రూపాయలు పద్దెనిమిది లక్షల నలభై ఆరు వేల మూడు వందల డెబ్బై ఎనిమిది మాత్రమే) ఏకమొత్తంగా మొత్తం సొమ్ము రూ.4,06,73,652/- (రూపాయలు నాలుగు కోట్ల, ఆరు లక్షల, డెబ్బై మూడువేల ఆరువందల యాభై రెండు మాత్రమే) 31-01-2026 నాటికి మరియు తదుపరి వడ్డీ మరియు దానిపై ఖర్చులు పూర్తి చెల్లింపు వరకు AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఛార్జ్‌కు లోబడి వుండునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

**స్థిరాస్తుల యొక్క వివరణ**

M/s KRS గ్రూప్ చే స్వంత యాజమాన్యంగా తెలంగాణ, రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం, అన్నారం గ్రామ పంచాయత్, ఆదిత్య ఫర్టిలైజర్ ప్రక్కన అన్నారం గ్రామం వద్ద వున్న సర్వే నం. 182/ఏలో, 4840చ.గ. కొలత పారిశ్రామిక స్థలం, పారిశ్రామిక ఆస్తి యొక్క ప్రస్తుత మరియు భవిష్యత్ స్ట్రక్చర్‌లతో సహా మొత్తం అదంతా.

సరిహద్దులు ఈ క్రింది విధంగా : తూర్పు: సర్వే నం. 180, పడమర: రామేశ్వరం నుండి కిషన్‌నగర్‌కు రోడ్. ఉత్తరం: సర్వే నం.182 మరియు చంద్రశేఖరరెడ్డి యొక్క భూమి. దక్షిణం: సర్వే నం.182లో విక్రేత భూమి

తేదీ: 09.02.2026 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : రంగారెడ్డి జిల్లా, తెలంగాణ AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్


# విడాకుల తర్వాత భర్త ఇంట్లోకి వెళ్లే హక్కు భార్యకు లేదు!

## ఢిల్లీ హైకోర్టు స్పష్టమైన తీర్పు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** గృహహింస నిరోధక చట్టం కింద మహిళలకు కల్పించిన హక్కులపై ఢిల్లీ హైకోర్టు స్పష్టమైనవివరణ ఇచ్చింది. ఒక మహిళ భర్తతో విడాకులు తీసుకుని స్వచ్ఛందంగా అత్తారింటిన విడిచి పెట్టి ఆ తర్వాత తిరిగి అతడి ఇంట్లోకి ప్రవేశం కల్పించాలని కోరే హక్కు ఉండదని స్పష్టం చేసింది. అలాగే నివసించడానికి ప్రత్యామ్నాయ వసతి ఉన్నప్పుడు అత్తారింటిపై పట్టుబట్టడం చట్ట విరుద్ధమని కూడా కోర్టు పేర్కొంది. ముఖ్యంగా 81 ఏళ్ల వయసు కల్గిన ఓ వృద్ధురాలు మాజీ భర్త ఇంట్లో ఉండడానికి అవకాశం కల్పించాలంటూ వేసిన పిటిషన్‌ను నిర్మొహమాటంగా కొట్టేసింది. 81 ఏళ్ల వయసున్న ఒక మహిళ గతంలోనే తన భర్తతో విడాకులు తీసుకుంది. అయినప్పటికీ అతడి ఇంట్లోనే ఉంటూ వచ్చింది. అతడికి వేరే ఇళ్లు ఉండగా అతనక్కడికి వెళ్లిపోయాడు. అయితే దాదాపు 60 ఏళ్లుగా ఆ ఇంట్లోనే ఉన్న వృద్ధురాలు 2023 ఏప్రిల్‌లో కేవలం వైద్య చికిత్స కోసం తన కుమార్తె ఇంటికి వెళ్లింది. మళ్లీ ఇప్పుడు తిరిగి తన ఇంటికి రాగా భర్త లోపలికి రానివ్వకుండా అడ్డుకున్నాడు. దీనివల్ల తాను ఆశ్రయం లేనిదాన్ని అయ్యానని చెబుతూ ఆమె ట్రయల్ కోర్టుకు వెళ్లారు. విచారణ జరిపిన సదరు న్యాయస్థానం ఆమె అభ్యర్థనను తిరస్కరించింది. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఈక్రమంలోనే విచారణ జరిపిన న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. సదరు మహిళ తన ఇష్ట పూర్వకంగానే ఏప్రిల్ 2023లో రెండో ఇంటికి మారారని కోర్టు గుర్తించింది. ఇంటి బయట ఆమె పేరుతో ఉన్న నేమ్ ప్లేట్ కూడా ఉందని, ఇది తాత్కాలిక మార్పు కాదని, శాశ్వత నివాసమేనని కోర్టు ధృవీకరించింది. అయితే ఇప్పుడు ఆమె వెళ్లాలనుకుంటున్న ఇంటికి భర్త రానివ్వకపోవడం వల్ల ఆమె ఏమీ రోడ్డున పడలేదని చెప్పింది. మొన్నటి వరకు కుమార్తెతో కలిసి ఉన్న ఇళ్లు కూడా ఆమె భర్తదే అని గుర్తించింది. అక్కడితో ఆగకుండా న్యాయస్థానం.. ఈ పిటిషన్ వెనుక ఆస్తి వివాదం దాగి ఉందని చెప్పింది.

కుమార్తెకు ఆస్తిలో వాటా ఇప్పించడానికే వృద్ధురాలు ఈ చట్టాన్ని వాడుకుంటున్నట్లు భర్త తరపు లాయర్ చేసిన వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఒకసారి స్వచ్ఛందంగా నివాసం మార్చిన తర్వాత ప్రస్తుతం ఆ ఇంట్లో ఉంటున్న వారిని ఇబ్బంది పెడుతూ రీఎంట్రీ ఇవ్వడం చట్టం పరిధి దాటడమే అవుతుందని స్పష్టం చేసింది.

అలాగే గృహహింస చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం ఒక మహిళ నిరాశ్రయురాలు కాకుండా చూడటమే మెజిస్ట్రేట్ బాధ్యత అని తేల్చి చెప్పింది. ఇది విచక్షణాధికారం మీద ఆధారపడి ఉంటుందని బాధితురాలికి సమాన స్థాయి కలిగిన ప్రత్యామ్నాయ వసతి ఉన్నప్పుడు, ఒక నిర్దిష్ట ఆస్తిలోనే ఉండాలని కోరే హక్కు ఆమెకు ఉండదని జస్టిస్ దుదేజా స్పష్టం చేశారు. గృహహింస చట్టం అనేది నిజమైన బాధితుల కోస మాత్రమే అని.. దుర్వినియోగం చేసే వారి కోసం కాదని స్పష్టం చేసింది. ముఖ్యంగా ట్రయల్ కోర్టు, అప్పీలేట్ కోర్టులు ఇచ్చిన తీర్పుల్లో ఎటువంటి పొరపాట్లు లేవని భావిస్తూ.. హైకోర్టు ఈ పిటిషన్‌ను కొట్టివేసింది.

# నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేదాకా పోరాడుదాం



ధర్నాచౌక్‌లో ప్రసంగిస్తున్న పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

## వివిధ కార్మిక సంఘాల నేతల పిలుపు

## లౌకికవాద పార్టీలన్నీ ఏకమై మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

## సార్వత్రిక సమ్మెకు మద్దతు తెలిపిన పిసిసి చీఫ్ మహేష్‌కుమార్, విహెచ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** కార్మిక హక్కులను కాలరాస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసేవరకు పోరాడుదామని వివిధ కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. గురువారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వీఎస్టీ నుంచి ఇందిరాపార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సీఐటియూ, ఏఐటియూసీ, ఐఎన్‌టియూసీ, తెలంగాణ రైతు సంఘం, హెచ్ఎంఎస్, టియూసీఐ, ఐఎఫ్‌టియూ, బీఆర్‌టియూ, టీఎన్‌టియూసీ, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆల్‌ఇండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్, కేంద్ర, రాష్ట్ర ఉద్యోగుల ఫెడరేషన్లు, అసోసియేషన్ల నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావులు హాజరై సమ్మెకు మద్దతు తెలపగా, ఈ సభలో సీఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతుసంఘం నాయకురాలు పశ్యపద్మ, ఐఎఫ్‌టియూ నేత ఎస్.ఎల్.పద్మ, ఐద్వా నాయకురాలు మల్లు లక్ష్మి, బీఆర్‌టియూ నేత మారన్న, తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్, ఏఐటియూసీ నాయకులు ఎస్.బాలరాజ్, భరత్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రెబ్బ రామారావు, ఏఐకెయూసీ నాయకులు ప్రభాకర్, ఐఎన్‌టియూసీ నేత మొగుళ్ల రాజిరెడ్డి, బీఆర్‌టియూ నాయకులు రాంబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పెట్టుబడిదారుల పెట్టుబడితో, మతాన్ని రెచ్చగొట్టి, 2014లో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నాడని విమర్శించారు. వామపక్షాల మద్దతుతో ఆనాడు కాంగ్రెస్ పార్టీ, కార్మికులకు హక్కులు కల్పిస్తూ చట్టాలను తీసుకువస్తే, నేడు పాశ్చాత్య దేశాల వత్తిడిలో పాలన సాగిస్తున్న మోదీ 44 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు కోడ్‌లు తీసుకువచ్చి, పరిపూర్ణ స్వేచ్ఛ కార్పోరేట్ సెక్టార్‌కు అందిస్తున్నారని ఆరోపించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ, ఆదానీ, అంబానీలకు హక్కులు కల్పిస్తూ, మోదీ బ్రిటీష్ పాలనను తలపిస్తున్నారని అన్నారు. మోడీ, అమిత్‌షా వంటి నాయకులను నిలదీస్తున్న ఏకైక నాయకుడు రాహుల్‌గాంధీ అని, అటువంటి రాహుల్‌గాంధీకి వామపక్షాలు మద్దతు ఇస్తున్నారని అన్నారు. రహుల్‌గాంధీ, ఖర్గేల పిలుపుమేరకు, ఈరోజు సమ్మెలో కాంగ్రెస్ నేతలు సైతం పాల్గొంటున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్మికుల శ్రేయస్సు కోసం పనిచేస్తుందని, వారికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. లౌకికవాద పార్టీలన్నీ దేశంలో బలపడాలని, లౌకికవాద పార్టీలన్నీ ఏకమై, మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. అధికారం కోసం ఎంత దూరమైనా వెళ్లే మోదీ కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నాడని, అటువంటి మోదీని వచ్చే ఎన్నికలలో ఓడించాలని కోరారు. ఆనాడు మోడీ ప్రభుత్వం, రైతుల పోరాటంతో తోకముడిచి, రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కు తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, జీహెచ్ఎంసీ కార్మికులు, సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు, ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున హాజరయ్యారు.


**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**
AU SMALL FINANCE BANK
A SCHEDULED COMMERCIAL BANK
(ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)
నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001, రాజస్థాన్, (ఇండియా)
(CIN:L36911RJ1996PLC011381)

**2002 యొక్క, సెక్యూరిటైషన్ చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీస్**

ఋణఖాతా నిరర్థక ఆస్తి అయినందున, పట్టికలో ఇచ్చిన విధంగా ఋణగ్రహీతలు/సహ ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులు (అందరూ ఏక మొత్తంగా ఋణగ్రహీతలుగా రిఫర్ చేయబడతారు)కు, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం 2002" యొక్క సెక్షన్ 13(2) క్రింద అందువలన అధీకృత అధికారి 60 రోజుల డిమాండ్ నోటీస్ జారీ చేసారు. ఆ నోటీస్ ప్రకారం ఋణగ్రహీతలు 60 రోజులలో మొత్తం సొమ్ము డిపాజిట్ చేయకపోతే, క్రింద పేర్కొన్న తనఖా ఆస్తులు/సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వేలం నుండి సొమ్ము రికవరీ చేయబడుతుంది. అందువలన మీరు ఋణగ్రహీతలు డిమాండ్ నోటీస్ యొక్క తేదీ నుండి 60 రోజులలోపుగా ఋణ బకాయి మొత్తం అంతా భవిష్యత్ వడ్డీ మరియు ఖర్చులతో సహా డిపాజిట్ చేయవలసినదిగా తెలియజేయడమైనది. లేని పక్షంలో సదరు చట్టం యొక్క 13(4) మరియు 14 ఏర్పాట్లు అనుసరించి, అధీకృత అధికారి క్రింద ఇవ్వబడిన తనఖా ఆస్తులు/సెక్యూర్డ్ ఆస్తులు యొక్క విక్రయం కొరకు తన స్వాధీనంలోకి తీసుకొనే స్వేచ్ఛ కలిగి ఉన్నారు.
ఋణగ్రహీలు గమనించవలసినదిగా, ఈ నోటీస్ స్వీకరించిన తర్వాత 2002 చట్టం యొక్క సెక్షన్ 13(13) నిబంధనల ప్రకారం మీరు ఏవైనా సెక్యూర్డ్ ఆస్తులకు అమ్మకం, లీజు లేదా ఇతరత్రా, సెక్యూర్డ్ క్రెడిటార్ రాతపూర్వ ముందస్తు అనుమతిలేకుండా బదిలీ చేయడం నిషేధం మరియు నిలుపుదల చేయబడినారు.
ది సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 చట్టం యొక్క సెక్షన్ 13(8) r/w నిబంధన 3(5) వైపు ఋణగ్రహీతల దృష్టికి ఆకర్షించడమైనది.
ఋణగ్రహీతల పూర్తి ఋణబకాయి మొత్తాలను క్రింద పేర్కొన్న విధంగా వేలం ప్రకటన యొక్క ప్రచురణకు ముందే చెల్లించినట్లయితే సెక్యూర్డ్ ఆస్తి తిరిగి పొందే హక్కు కలిగి ఉంటారు. ఆపై దాని ఉనికి ఉండదు. ఆగిపోతుంది.

| ఋణగ్రహీత/సహ-ఋణగ్రహీత/తనఖాదారు/ హామీదారు యొక్క పేరు/ఋణ ఖాతా నం. | 13(2) సెక్షన్ క్రింద డిమాండ్ నోటీస్ యొక్క తేదీ మరియు సొమ్ము |
|---|---|
| (Loan Ac.No.) 2406261261150696, M/s. హరి శ్రీ కంప్యూటర్స్ దాని భాగస్వాములు శ్రీ PVSS బ్రహ్మం & శ్రీ కాకాని గోపాలకృష్ణ (ఋణగ్రహీత) శ్రీ PVSS బ్రహ్మం S/o శ్రీ VB వమిడి మూర్తుల (హామీదారుడు) శ్రీ కాకాని గోపాల కృష్ణ S/o శ్రీ జయరామయ్య గోపాల (హామీదారుడు/తనఖాదారుడు) | 30/01/2026 రూ.3,07,72,292/- (రూపాయలు మూడు కోట్ల ఏడు లక్షల డెబ్బై రెండు వేల రెండు వందల తొంభై రెండు మాత్రమే) 29/01/2026 నాటికి |

**తనఖా ఆస్తి యొక్క వివరణ**
తాకట్టు యొక్క షెడ్యూల్
ప్రథమ మరియు ప్రత్యేక ఛార్జ్, ఇతర ప్రస్తుత అసెట్స్, బుక్‌డెట్, ఇన్వెంటరీ, మరియు చరస్థిరాస్తులు ప్రస్తుత మరియు భవిష్యత్ రెండింటి వాటిపై తాకట్టు ద్వారా
తనఖాపెట్టబడిన స్థిరాస్తుల యొక్క షెడ్యూల్:-
1. శ్రీ కాకాని గోపాలకృష్ణచే స్వంతమైన తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ముదుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామం వద్ద ఉన్న (పాత సర్వే నం.130/00) సర్వే నం.210/ఏలో 1163 చ.గ లేదా 898.13 చ.మీ. ఏరియా కొలత కలిగి ఉన్న బహిరంగ ప్లాట్, వ్యవసాయేతర ఆస్తి యొక్క ప్రస్తుత మరియు భవిష్యత్ స్ట్రక్చర్స్‌తోసహా మొత్తం అదంతా. సరిహద్దులు: క్రింది విధంగా:
తూర్పు: సర్వే నం.210/ఏ యొక్క పార్ట్, పడమర: రోడ్, ఉత్తరం: మెదక్ జిల్లా బోర్డర్ కరకపట్ల గ్రామం, దక్షిణం: డిజైర్ ఎస్టేట్ ప్లాట్స్
2. శ్రీ కాకాని గోపాలకృష్ణచే స్వంతం. తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, ముదుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామం వద్ద ఉన్న (పాత సర్వే నం.130/00) సర్వే నం.210/ఏలో 750 చ.గ లేదా 627.09 చ.మీ. ఏరియా కొలత ఏరియా కలిగి ఉన్న బహిరంగ ప్లాట్, వ్యవసాయేతర ఆస్తి యొక్క ప్రస్తుత మరియు భవిష్యత్ స్ట్రక్చర్స్‌తోసహా మొత్తం అదంతా. సరిహద్దులు: క్రింది విధంగా:
తూర్పు: రోడ్, పడమర: శ్రీ బింగి రాజయ్య యొక్క భూమిచే మరియు సర్వే నం.203, ఉత్తరం: మెదక్ జిల్లా బోర్డర్ కరకపట్ల గ్రామం, దక్షిణం: డిజైర్ ఎస్టేట్ ప్లాట్స్

తేది : 12.02.2026 ప్రదేశం: హైదరాబాద్ అధీకృత అధికారి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

ఒక వ్యక్తి గుణగణాలు పరిశీలించి చూడాలంటే అతనికి అధికారం ఇచ్చి చూడాలి.

-అబ్రహాం లింకన్

# అవినీతిపై అదుపేది?

ఆయా ప్రపంచ దేశాల అవినీతిని లెక్కగట్టిప్రచురించే ఏకైక సంస్థ ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ ఈ ఏడాది కూడా తన నివేదికను విడుదల చేసింది. అందులో మన దేశానికి 91వ స్థానం వచ్చింది. కానీ తాజా లెక్కల్లో 91ర్యాంకులో ఉన్నాం. గత ఏడాది నివేదికతో పోల్చి చూసుకుంటే ఈసారి కాస్త మెరుగైన పరిస్థితి కనపడుతోంది. 2025 సంవత్సరానికి గాను భారత మార్కులను, మొరాకో, ట్యునీషియాతో సమాన స్థాయిలో 39 స్కోరుతో 91వ స్థానానికి ఎదిగింది. గత ఏడాదితో పోలిస్తే 1పాయింట్ మెరుగు పడిందన్నమాట.ప్రపంచవ్యాప్తంగా వీటిపరిస్థితి చూస్తే ఆందోళనకరమే. అవినీతి సంబంధించిన ప్రపంచ దేశాల సగటు స్కోరు దశాబ్ద కాలంలో 42కి పడిపోయింది. మూడింట రెండు వంతుల స్కోర్ 50లోపలే ఉంది. ఇదే మరింత ఆందోళనకర పరిస్థితులను సూచిస్తోంది. లంచాలు తీసుకోవడం, అంతే నేరమైన విషయాన్నిభారత దేశ చట్టాలు ఎంత చెప్పినా ప్రభుత్వాధికారులు ఎవరూ పట్టించుకోక పోవడమే భారత దేశ దౌర్భాగ్యం. ఇటీవల కాలంలో వారికి భయం, భక్తి లోపించింది. ఉద్యోగంలో చేరిన వెంటనే బల్లకింద చేతులు పెట్టేస్తున్నారు. ప్రభుత్వాధికారుల తమకు వీలైన పనులు చేయించుకోవడానికి వారికి ఇచ్చేది లంచం.మరో మంచి మాట చెప్పలేము. అధికారిని ఏ విధంగా లోబరచుకొని తమ ప్రయోజనాలుపొందుకువాలనుకున్నా, లంచం ఆశ చూపేవారు,అవినీతిని తప్పు పట్టే వారున్నా,అవినీతి నిరోధక శాఖ అవినీతిపరులను రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నా సరే వారి గమనంమారదు. ఎప్పటికప్పుడే అనే ధోరణిలో మార్పు చెందలేకపోతున్నారు. దులిపేసుకుని మళ్లీ కొత్తప్రయత్నం. కోట్లాది రూపాయలు సంపాదించినా ఇంకా ఇంకా కావాలనే తాపత్రయ పడతారు. సాధారణంగా రెవెన్యూ శాఖను అతి అవినీతి మయమైన శాఖగా భావిస్తుంటారు.కానీ దాదాపుప్రభుత్వ శాఖలు అన్నిటిలోనూ లంచావతారులున్నారనే అభిప్రాయ ఉందనే ఉంది. ఆసియా పసిఫిక్ ప్రాంతాల్లో అవినీతి పెచ్చుపెరిగిపోయింది. వాటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలు లేవు. జీరో పాయింట్లునుంచే అత్యధిక అవినీతి ఉన్నట్లు లెక్క. ప్రభుత్వ పాలనలోఅవినీతి, బంధు ప్రీతి బాగా పాతుకుపోయిందనేది అందరికీ తెలిసిందే. పలు దేశాల్లో పెచ్చుమీరిన అవినీతిపై యువత ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయా ప్రభుత్వాల మీద ఎదురు తిరిగిన సందర్భాలు మనకు విదితమే. ఇదే జాబితాలో 89 స్కోరుతో డెన్మార్క్ అతి తక్కువ అవినీతి ఉన్న దేశంగా నిలిచింది. ఫిన్లాండ్, సింగపూర్, న్యూజిలాండ్, నార్వే,స్వీడన్, స్విట్జర్లాండ్, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, జర్మనీతో మొదటి టెన్లోఉన్నాయి. అవినీతి సమస్య వల్ల అనేక దేశాలు రాజకీయ ఆర్థిక సంక్షోభాలు బారిన పడ్డాయి. అవినీతి అక్రమార్జనలకు సంబంధించిన వివిధ దేశాలు అప్పట్లో పనామాపత్రాలు బయటిపెట్టి సంచలనం సృష్టించాయి. అక్రమ మార్గంలో కూడపెట్టిన లక్షలాది కోట్ల ధనాన్ని ఇతర దేశాలకు తరలించిన తీరు మనకు తెలిసిందే. అవినీతి మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొనేందుకు అమెరికా, ఫ్రాన్స్ దేశాలు ఒక ప్రణాళికతో ముందుకు నడుస్తున్నాయి. కాగా అవినీతి వ్యతిరేకంగా దేశాల్ని కలిసికట్టుగా పోరాడాలనే స్ఫూర్తి ఎక్కడా లేకపోయింది. భారత దేశం విషయానికి వస్తే ప్రభుత్వవిభాగాల్లోఊడలు పెంచుకున్న అవినీతికి అడ్డుకట్ట వేయడం చాలా కష్టం అవుతుంది. ప్రభుత్వ విభాగాల్లో అధికారులు ఎన్ని విధాలుగా అవినీతి కార్యక్రమాలకు పాల్పడుతున్నారో తేటతెల్లమే. అలాంటి అవినీతిపరులు సస్పెన్షన్ అవుతారు. ఆ తర్వాత మళ్లీ రాజకీయ ప్రాబల్యంతో తిరుగుతారు. ఇవన్నీఎక్కడికి దారితీస్తాయి?అవినీతిని నిరోధించే మూల సూత్రాలు కూడా పక్కనపెట్టి వారిని అందలం ఎక్కిస్తున్నారు. అదే వ్యవస్థలోని లోపం. ప్రజాధనాన్ని సొంత ఆస్తిగా మెక్కేసే అధికారులకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. అందుకు బాధ్యులైన వారు కూడా గతంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించేవారు. భయపడేవారు. ఇప్పుడు భయపడే పరిస్థితి ఏమి లేదు. స్వాతంత్ర్యం వచ్చిన వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు ప్రధానమైన కుంభకోణాల్లో దాదాపు 100లక్షల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టినట్లు ఒక అంచనా. ప్రధానంగా రాజకీయ పదవుల్లో ఉన్నవారే అవినీతికి పాల్పడుతుంటే వారు శాసనాలు ఏమి చేయగలరు, వాటిని అమలుపరిచే విషయంలో ఏ విధంగా సహాయ పడగలరు అన్న విషయాలన్నీ తెరమీద అందరికీ తెలిసిన విషయమే ఇలాంటి పరిస్థితులు అవినీతిని ఎండగట్టే స్థితిలోఉండవు. అవినీతిపరులను కఠినంగా శిక్షించే చట్టాలు లేకపోవడం ఒక వెనుకబాటు. అవినీతి అవగాహన సూచిక 2025ప్రకారం, ప్రపంచంలోని ప్రతి ప్రాంతంలోనూ అవినీతి తీవ్రమైన ముప్పుగా ఉంది. ప్రభుత్వరంగ అవినీతి స్థాయిల ఆధారంగా ప్రపంచ వ్యాప్తంగా 182 దేశాలను ర్యాంక్ చేస్తుంది. ఫలితాలు '0' అత్యంత అవినీతి,నుండి 100 రాంక్ అనగానే అవినీతి రహితమని ఇక్కడ అర్థం.2012 నుండి 31దేశాలు తమ అవినీతి స్థాయిలను గణనీయంగా తగ్గించుకున్నప్పటికీ, మిగిలినవి సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్నాయి. ప్రపంచ సగటు 42కొత్త కనిష్ట స్థాయికి పడిపోయింది. అయితే మూడింట రెండువంతుల కంటే ఎక్కువ దేశాలు 50 కంటే తక్కువ స్కోరు సాధించాయి. ప్రజాప్రతినిధులు కూడా సుపరిపాలన అందించడంకన్నా తమ సొంత ప్రయోజనాలు కాపాడేందుకే కాలంవెచ్చిస్తున్నారని అనిపిస్తోంది.అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వాలు కంకణం కట్టుకున్ననాడే దేశం సుభిక్షంగాఉంటుంది. ప్రధానంగా ఈదేశాన్ని పట్టిపీడిస్తున్న అవినీతి ముందుగారాజకీయ అవినీతిని నిర్మూలించగలిగితేనే సాధ్యమౌతుంది.

ఒకే భాషను శాస్త్రీయంగా అభ్యసిస్తే మిగతా భాషలు సులభతరం అవుతాయి.



మహాత్మాగాంధీ

జీవితం ఒక పాఠశాల వంటిది. ఇక్కడ ప్రతి బాధ, ప్రతి హృదయం విదారకత మనకు అమూల్యమైన పాఠాన్ని నేర్పుతుంది.



స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



### ప్రతిపక్షాల మధ్య సమన్వయం

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో పార్లమెంటు అత్యున్నతమైన శాసనసభ. ప్రజల సమస్యలను చర్చించి, పరిష్కారమార్గాలను అన్వేషించాల్సిన ఈ వేదిక నేడు నిరంతర అంతరాయాలకు నిలయంగా మారుతోంది.అధికార,ప్రతిపక్షాల మధ్య సమన్వయం లోపించడం వల్ల పార్లమెంటు విలువైన సమయం వృథా అవుతోంది. దీనివల్ల దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే అనేక కీలకబిల్లులు ఆమోదం పొందకుండా పెండింగ్లో ఉండిపోతున్నాయి.సభలో నిరసనలు తెలపడం ప్రతిపక్షాల హక్కు అయినప్పటికీ, అది సభా సమయాన్ని పూర్తిగా హరించేలా ఉండకూడదు. ప్రతి నిమిషం పార్లమెంటునిర్వహణకు ప్రజాధనంభారీగా వెచ్చించబడుతోంది.అధికార పక్షంప్రతిపక్షాల విమర్శలనుఓర్పుతో వినాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రాఫెల్ కొనుగోళ్లు

ఫ్రాన్స్ నుండి రాఫెల్ యుద్ధవిమానాలు కొనుగోలు చేయడంకోసం3లక్షల కోట్లవిలువైన ఒప్పందం జరగడం గొప్ప పరిణామం అయితే ఇందులో ప్రత్యేకత ఏమిటి? స్వదేశీయంగానాగపూర్లోను, హైదరాబాద్లో రాఫెల్ విమానాలా భాగాలు తయారు అవుతున్నాయి. ఇది స్వదేశీయంగా తయారు కావడమే కదా చారిత్రక నేపథ్యాల నుండి చుస్తే భారత రాజ్యాంగంలో స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వంలాంటి గుణాలను మనంఫ్రాన్స్ నుండే తీసుకున్నాం. ఇప్పుడు భారత రక్షణ వ్యవస్థకు ఆయువు పట్టు లాంటి రాఫెల్ విమానాన్ని అందించడం అందులో 18 ఫ్రాన్స్లో 96స్వదేశీయంగా తయారు కావడం ఆహ్వానించదగిన విషయం.

- భారత అవినాష్, జనగామ

### హామీలను నెరవేర్చాలి

ఎన్నికల సమయంలో వివిధ పార్టీలు మానిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వచ్చాక తప్పకనెరవేర్చాలి. ఎన్నికల సమయంలో మానిఫెస్టోనుఎన్నికల సంఘం నిర్ధారించాలి.హామీలు నెరవేర్చేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి. హామీలు నెరవేర్చని ప్రభుత్వం పార్టీ గుర్తింపును రద్దు చేయాలి. అలాగే ప్రభుత్వం ఏర్పడ్డాక బడ్జెట్నిధులను ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం పారదర్శకంగా పని చేయాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

### మనిషికి సాటిరాని కృత్రిమ మేధస్సు

డిజిటల్ యుగం వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో కృత్రిమ మేధస్సు సమాజాన్ని కొత్తదిశల్లో నడుపుతోంది. భాష, గణితం, డేటా విశ్లేషణ ఇలాంటి అనేకరంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుత వేగంతో ముందుకు సాగుతున్నప్పటికీ, అది మనిషి సహజ మేధస్సును భర్తీ చేయగలదనే అపోహ మరింత ప్రమాదకరం. ఎందుకంటే యంత్రాలు వేగాన్ని, ఖచ్చితత్వాన్ని అందించగలిగినా, భావోద్వేగం,నైతికత,సానుభూతి, సృజనాత్మకత ఇలాంటి మానవ విలువలను అవి పునరుత్పత్తి చేయలేవు. కృత్రిమమేధస్సు అతిపెద్దశక్తి దాని విశ్లేషణ సామర్థ్యం. వైద్యం నుంచి రవాణా వరకు, పంటల ఆరోగ్యం నుంచి వాతావరణ అంచనాలవరకు అన్ని రంగాల్లో ఇది సమర్థతను పెంచుతోంది. వ్యాధులను ప్రారంభ దశలో గుర్తించడం, ట్రాఫిక్ నియంత్రణ, లాజిస్టిక్స్లో వృథా తగ్గించడం వంటి అభివృద్ధులు ప్రజలకు స్పష్టమైన ప్రయోజనాలను అందిస్తున్నాయి.

-కె.రామారావు, నల్గొండ జిల్లా

### నిబంధనలను పాటించాలి

వైద్యుల ప్రిస్క్రిప్షన్ చీటీలేకుండా మందులు కొనడం, అమ్మడం రెండూ నేరమేకానీ,తెలంగాణలో అన్నిజిల్లాల్లో మెడికల్ షాప్స్ ఈ నిబంధనలను యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగాప్రజలఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. వైద్యుడి ప్రిస్క్రిప్షన్లేకుండానే మందులు అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు. ఒక్కొక్క మందుల షాప్లో ఫార్మాసిస్ట్ లేడు. పర్యవేక్షణ లేదు. నిబంధనల ప్రకారం ప్రతి మందుల దుకాణంలో అర్హత పొందిన ఫార్మాసిస్ట్ తప్పనిసరిగా ఉండాలి. జీఎస్టీ, కంప్యూటరైజ్డ్ బిల్లులు ఇవ్వకపోవడంవంటి ఉల్లంఘనలు సర్వసాధారణం. మెడికల్షాప్స్ వారు విధిగా నిబంధనలు పాటించాలి.

-పి. జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా

### అవినీతికి అంతం లేదా?

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి తారాస్థాయికి చేరింది. ప్రతిరోజు ఏదో ఒకప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారుతుంది. సుమారు 1000 మంది అధికారులు ఏసీబీకి చిక్కారు. లంచం లేనిదే కార్యాలయాల్లో ఫైలు కదలని పరిస్థితి ఉంది. ఏసీబీ అధికారులు ఎన్ని దాడులు చేసిన లంచగొండి అధికారుల ప్రవర్తనలో మార్పు రావడంలేదు.ఏసీబీ అధికారులు మరిన్ని దాడులు చేసి లంచగొండిల భరతం పట్టాలి.

-సి. సతీష్, భూపాలపల్లి జిల్లా

మనవి — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విద్యాభివృద్ధి లేని వికసిత్ భారత్ సాధ్యమేనా?

**దేశంలో ఉన్నత విద్యను అభివృద్ధి చేయకపోవడంతో విద్యా ర్థులు అమెరికా, ఆస్ట్రేలియా, జార్జియా, చైనా, యు.కె. లాంటి దేశాలు వలసలుపోతున్నారు. దీని గురించి కనీస ప్రస్తావన బడ్జెట్లో లేదు. విద్యావేత్తలు, మేధావులు గత అనేక సంవత్సరాలు నుండి కోరుతున్నట్లు జి.డి.పి.లో 6 శాతం నిధులు కేటాయింపు కూడా లేదు. సంకుచితమవుతు న్న ప్రభుత్వ పాఠశాలలు, ఒక్క ఉపాధ్యాయుడే ఉన్న తర గతులు, భారీ డ్రాప్ అవుట్లు, వాణిజ్యీకరించిన సంస్థలు, పెరుగుతున్న సామాజిక విభేదాలపై అభివృద్ధి చెందిన భారత్ నిర్మించలేం. వికసిత భారత్ నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా ఉండాలంటే, ప్రజా విద్యను మళ్లీ సార్వత్రిక హక్కుగా గుర్తించి జాతీయ ప్రాధాన్యతగా పెట్టాలి. లేకపోతే, భారత వృద్ధి విస్తృతంగా కనిపించినా పునాదులు బలహీనంగానే ఉంటాయి.**

టి. నాగరాజు

వికసిత్ భారత్ నినాదంతో యూనియన్ బడ్జెట్ 2026 మౌలిక సదుపాయాలు, డిజిటలైజేషన్, తయారీ రంగం, ప్రపంచ పోటీతత్వం వంటి పదాలతో ప్రజల నమ్మకాన్ని పొందే ప్రయత్నం చేస్తోంది. కానీ ప్రజా విద్యా కోణంలో పరిశీలిస్తే, ఈ బడ్జెట్లో విద్యకు తీవ్రమైన వ్యతిరేకత కనిపిస్తుంది. నేడు భారత్ అభివృద్ధి కథ ముందుకు సాగుతున్నప్పటికీ, విద్యను సామాజిక హక్కుగా లేదా మౌలిక ప్రజావసరుగా చూడడంలో విఫలమవుతోంది.భారత జిడిపి పెరుగుతోందని ప్రభుత్వం చెబుతున్నా, ఆ వృద్ధికి అనుగుణంగా విద్యపై ఖర్చుపెరగడం లేదు. విద్య వ్యయంపై నామమాత్రపు పెరుగుదలను ప్రభుత్వం చూపిస్తోంది. కానీ ద్రవ్యోల్బణం, నమోదు పెరుగుదల, వ్యవస్థాపక ఖర్చులు లెక్కలోకి తీసుకుంటే, ఈసంఖ్యలు తప్పుదారిపట్టించేవే. 2026-27 బడ్జెట్లో విద్య మంత్రిత్వ శాఖకు కేటాయింపు చేసినది రూ.1,39,289 కోట్లు కాగా, 2025-26లో ఇది రూ. 1,28,650 కోట్లు. నామమాత్రంగా పెరుగుదలఉన్నా, వాస్తవ (ద్రవ్యోల్బణ సర్దుబాటు చేసిన) వ్యయం స్థిరంగా ఉంది. మొత్తం జిడిపిలో విద్య ఖర్చు సుమారు 3-4శాతం మాత్రమే ఉంది. ఇది జాతీయ విద్యా విధానం (ఎనఈపి) సూచించిన 6శాతం లక్ష్యానికి చాలా తక్కువ. కేంద్ర ప్రభుత్వ కేటాయింపు కేవలం జిడిపిలో 0.3 శాతం మాత్రమే. మొత్తం అంచనా ఖర్చు రూ. 53.5 లక్షల కోట్లలో విద్య వాటా సుమారు 2.6 శాతం మాత్రమే. అనుపాతంగా చూస్తే, జిడిపి పెరుగుతున్నప్పటికీ విద్యకు ప్రాధాన్యం తగ్గుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే ఈ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. జపాన్, చైనా, యునైటెడ్ కింగ్డమ్ వంటి దేశాలు తమ జిడిపిలో 6 శాతం లేదా అంతకంటే ఎక్కువను విద్యపై ఖర్చుచేస్తున్నాయి. ఆర్థికబలం, ఆవిష్కరణలు, సామాజిక స్థిరత్వానికి ప్రజా పెట్టుబడి కీలకమని అవి గుర్తించాయి. కానీ భారతదేశం విద్యకు తగిన పెట్టుబడి లేకుండా ప్రపంచ శక్తిగా మారాలనే ఆశయం బలహీనమైన పునాదిపై నిలబడి ఉంది. ఈ నిర్లక్ష్యం ప్రభావం నేల మీద ఇప్పటికే కనిపిస్తోంది. 2014-15లో 11,07,101 ఉన్న ప్రభుత్వ పాఠశాలలు 2023-24 నాటికి 10,17,660కు తగ్గాయి. గత దశాబ్దంలో 89,441 ప్రభుత్వ పాఠశాలలు మూసివేయబడ్డాయి. 'సమర్థత' పేరుతో తీసుకున్న నిర్ణయాలు గ్రామీణ, గిరిజన, అంచున ఉన్నవర్గాలపై తీవ్ర ప్రభావం చూపాయి. పిల్లలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. చదువు మానేయాల్సి వస్తోంది. పాఠశాలల మూసివేత లేదా విలీనం అనే సంక్షోభంపై బడ్జెట్ 2026 మౌనం వహిస్తుంది.బడ్జెట్ 2026లో అత్యంత పెద్దలోపం, భారీ స్థాయిలో ఉపాధ్యాయ నియామకాల లేమి. ప్రపంచంలో అతిపెద్ద విద్యా వ్యవస్థలలో ఒకటైన భారత్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రమైంది. 33లక్షల మంది విద్యార్థులు ఒక్క ఉపాధ్యాయుడే ఉన్న పాఠశాలల్లో చదువు తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నేర్చుకునే నాణ్యత మెరుగ వుతుందని ఆశించడం వాస్తవాలకు విరుద్ధం. డిజిటల్ ప్లాట్ ఫామ్లు, పాఠ్యాంశాలలో మార్పులు లాంటి చర్యలు శిక్షణ పొందిన, భద్రతకల్గిన, తగిన వేతనం పొందే ఉపాధ్యాయులకు ఏమాత్రం ప్రత్యామ్నాయంకావు. ప్రభుత్వ విద్యాసంస్థలలో తగిన పెట్టుబడి లేకపోవడం వల్ల డ్రాప్ అవుట్లు పెరుగుతున్నాయి. ఇప్పటివరకు 65.7 లక్షల మంది పిల్లలు పాఠశాల వ్యవస్థ నుంచి బయటకువచ్చారు. వీరిలోదాదాపు సగం మంది బాలికలే. ఇది పేదరికం, పాఠశాల మూసివేతలు, మాధ్యమిక పాఠశాలల కొరత, అసురక్షిత ప్రయాణం, ప్రజా మద్దతు లేకపోవటం వంటి అంశాలతో సంబంధం కలిగి ఉన్నాయి. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు బడ్జెట్



2026లో పునర్నమోదు, వారిని స్థిరంగా చేయడం నిలుపుదల, సామాజిక మద్దతుకు సమగ్ర వ్యూహం ఈ బడ్జెట్లో లేదు. ఈ బడ్జెట్ ప్రభుత్వ విద్యా సంస్థలను బలపరచడం బదులు, ఎన్ఈపికి అనుసంధానమైన అంశాలపై ఎక్కువగా దృష్టి పెడుతోంది అకాడెమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఎబిసి), నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్వర్క్ (ఎన్సిఆర్ఎఫ్), అపార్, పరఖ్, పిఎమ్ శ్రీ, దీక్ష వంటి పథకాలు. అదేవిధంగా పబ్లిక్ప్రైవేట్ భాగస్వామ్య (పిపిపి)మోడల్ను విద్యలో ముందుకు తీసుకువస్తోంది. ఇది సామర్థ్యం, ఆవిష్కరణ పేరుతో ప్రభుత్వ విద్యాసంస్థలను వాణిజ్యపరంగా మార్చి,ఖర్చును విద్యార్థులు,వారి కుటుంబాలపై మోపి, ప్రభుత్వ విద్యను ప్రైవేట్ లాభాలకు తలుపులు బార్లా తెరుస్తోంది. ఉన్నత విద్యలో అంతర్జాతీయాకరణ, పరిశ్రమ విద్యాసంస్థల భాగస్వామ్యం, వికసిత భారత్ శిక్షా అధిష్టాన్ (విబిఎస్ఎ)బిల్లుతో తీవ్రమైన కేంద్రీకరణ ద్వారా నియంత్రణ వ్యవస్థ ప్రతిపాదన ఇవన్నీ అధిక కేంద్రీకరణను, మార్కెట్ దృక్పథాన్ని సూచిస్తున్నాయి. ప్రజా పెట్టుబడికి బదులు నియంత్రణ పునర్వ్యవస్థీకరణకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజాస్వామ్య నియంత్రణను, సంస్థాగత స్వతంత్రతను బలహీనపరుస్తున్నాయి. అంతిమంగా చూస్తే, ప్రస్తుత విధానాల కింద రూపొందుతున్న విద్యా వ్యవస్థ అత్యంత సాధనోపయోగంగా ఉంది. ఇది కొద్దిమంది అత్యంత నైపుణ్యం గల ఎలైట్వర్గాన్ని తయారు చేయడమే కాకుండా, అస్థిర కార్మిక మార్కెట్కు సరిపోయే అర్ధనైపుణ్యం గల పెద్ద సంఖ్యలో కార్మికులను సృష్టిస్తోంది. అదేసమయంలో, అర్ధశిక్షణ పొందిన డ్రాప్ అవుట్ల పెద్దసమూహం ఏర్పడుతోంది. ఇది యాదృచ్ఛికం కాదు. దీర్ఘకాలిక తక్కువ పెట్టుబడి ప్రైవేటీకరణ ఫలితం. ఈ బడ్జెట్ పూర్తిగా అభివృద్ధి రహితమైనది. మైనారిటీలు, చారిత్రాత్మకంగా అణగారిన వర్గాలపై ప్రత్యేక దృష్టిలేదు. ప్రవేశాలు నైపుణ్యం,నేర్చుకునే పద్ధతుల్లో ఉన్న అసమానతలను పట్టించుకోవడం లేదు. సామాజిక నిర్మాణాత్మక అసమానతలను పట్టించుకోకుండా జాతీయ విధానమని చెప్పుకోవడం ప్రజాస్వామ్యంగా చెప్పలేం. ఈ నిర్లక్ష్యం పాఠశాలలు, విశ్వవిద్యాలయాలకే పరిమితం కాదు. మధ్యాహ్న భోజన పథకం వంటి పునాది సంక్షేమ విద్యా వ్యవస్థలకూ విస్తరించింది. అంగన్వాడి పోషణ్ 2.0కు 2026-27లో కేటాయింపు రూ.23,100 కోట్లు మాత్రమే (గత సంవత్సరం రూ.21,960 కోట్లు). పోషకాహార ఖర్చు ప్రమాణాలు పెరుగుతాయని హామీ ఇచ్చినా, ఇది రోజుకు ఒక్కో పిల్లకు కేవలం 38 పైసల పెరుగుదల మాత్రమే.3.38 లక్షల అంగన్వాడీ కేంద్రాలకు తాగునీరు లేదు, 4.61 లక్షలకు మరుగుదొడ్లు లేవు. గత నాలుగేళ్లలో కేవలం 60,000 కేంద్రాలే అభివృద్ధి చేయబడ్డాయి. ఇది బాల్యవిద్య, పోషణ పునాదినే దెబ్బతీస్తోంది. మొత్తంగా చూస్తే,బడ్జెట్ 2026 విద్యను సామాజిక హక్కుగా కాకుండా మార్కెట్ ఆధారిత సేవగా మార్చుతోంది. నైపుణ్యాలు, క్రెడిట్లు, ఉద్యోగయోగ్యతకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజా పెట్టుబడి, ఉపాధ్యాయ నియామకాలు, సామాజిక రక్షణను పక్కన పెడుతోంది. ఇవన్నీ పేదరికం, ప్రాంతీయ అసమతుల్యత, లింగవివక్ష, రాష్ట్ర ఉపసంహారణ వల్ల ఏర్పడిన నిర్మాణాత్మక అసమానతలపై తాత్కాలికం మాత్రమే. దేశంలో ఉన్నత విద్యను అభివృద్ధి చేయకపోవడంతో విద్యార్థులు అమెరికా, ఆస్ట్రేలియా, జార్జియా, చైనా, యు.కె. లాంటి దేశాలు వలసలుపోతున్నారు. దీని గురించి కనీస ప్రస్తావన బడ్జెట్లో లేదు. విద్యావేత్తలు, మేధావులు గత అనేక సంవత్సరాలు నుండి కోరుతున్నట్లు జి.డి.పి.లో 6 శాతం నిధులు కేటాయింపు కూడా లేదు. సంకుచితమవుతున్న ప్రభుత్వ పాఠశాలలు, ఒక్క ఉపాధ్యాయుడే ఉన్న తరగతులు, భారీ డ్రాప్ అవుట్లు, వాణిజ్యీకరించిన సంస్థలు, పెరుగుతున్న సామాజిక విభేదాలపై అభివృద్ధి చెందిన భారత్ నిర్మించలేం. వికసిత భారత్ నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా ఉండాలంటే, ప్రజా విద్యను మళ్లీ సార్వత్రిక హక్కుగా గుర్తించి జాతీయ ప్రాధాన్యతగా పెట్టాలి. లేకపోతే, భారత వృద్ధి విస్తృతంగా కనిపించినా పునాదులు బలహీనంగానే ఉంటాయి. ●

# ఆహార దుర్వినియోగాన్ని నివారించాలి

డాక్టర్. వై. సంజీవ కుమార్

మనిషి మనుగడకు ప్రాణవాయువు ఎంత అవసరమో, ఆహారం అంతే అవసరం. అలాంటి ఆహారాన్ని నిర్లక్ష్యంగా వృథా చేయడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. నేడు ఆహారాన్ని వృథా చేసే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఒకవైపు ఆహారం చెత్తబుట్టల్లో పడిపోతుంటే, మరోవైపు ఒక్కపూట భోజనం కోసం ఆశగా ఎదురుచూస్తూ జీవిస్తున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు. ఆకలి బాధ తాళలేక మరణించిన వాళ్లు ఎందరో ఉన్నారు. ఆకలి కేవలం శరీరబాధనే కాదు అంతరాత్మను క్షోభపెట్టె బాధ. ఆకలితో జీవించడం అత్యంత దుర్భరమైన అనుభవం. ఆకలిబాధను అనుభవించినవారికే ఆ కష్టం విలువ తెలుస్తుంది. అవసరానికి మించి ఆహారం వండటం, ఫంక్షన్లకు వెళ్లి ఆకలి లేకున్నా ఎక్కువగా తీసుకుని పూర్తిగా తినకుండా వదిలేయడం వంటి చర్యలు చిన్న తప్పుగా భావించవచ్చు. కానీ బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తుంది. నేటి ఆధునిక పోకడల్లో మనిషి విలువలకన్నా ఆడంబరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాడు. స్తోమతకు మించి శుభకార్యాలు చేయడం ఒక ఫ్యాషన్లా మారిపోయింది. వాళ్లు ఇలా చేసారు.. వీళ్లు అలా చేసారు అనే పోలికలతో, పోటీ భావనతో, గ్రాండ్గా చేయకపోతే ఎవ్వరో ఏదో అనుకుంటారు అనే విపరీత ధోరణిలతో చిన్న శుభకార్యమా.. పెద్ద శుభకార్యమా అనే తేడా లేకుండా అనేక రకాల వంటకాలు సిద్ధం చేస్తున్నారు. పది మంది తినే కార్యక్రమానికి ఇరవై రకాల వంటకాలు, వంద మంది తినే కార్యక్రమానికి ముప్పై రకాల వంటకాలను, మరికొందరి మరిన్ని ఎక్కువ రకాల వంటలను చేయి




స్తున్నారు. ఒక్కో వంటకం రుచి చూడటానికి తీసుకుని సగం సగం తిని మిగతాదంతా చెత్తబుట్టలో వేయడం ఇప్పుడొక సాధారణ దృశ్యంగా మారిపోయింది. ఆహారాన్ని వృథా చేస్తున్నాము అనేది తప్పు అని ఎవ్వరికి అనిపించడం లేదు. కానీ ఆ చెత్తబుట్టలో పడుతున్న ప్రతి గింజ వెనుక ఒక రైతు చెమట ఉంది. శుభకార్యం చేసే కుటుంబం కష్టం ఉంది. ఒక ఆకలితో ఉన్న మనిషి ఆశ ఉంది. పోటీ పడాల్సింది ఆడంబరాల్లో కాదు, మంచి పనుల్లో పడాలి.ఎవరి శుభకార్యం ఎంత గొప్పగా జరిగిందోకాకుండా, ఎంత మంచిగా నిర్వహించామా, ఎంతమందికి ఉపయోగపడిందో అనేదే అసలైన గొప్పతనం. మంచి మార్పులను ఎప్పటికప్పుడు మనిషి అలవాటు చేసుకోవాలి, ఆచరణలో కొనసాగాలి, ఆహారాన్ని వృథా చేయకపోవడం కూడా ఒక గొప్ప సంపాదనే. శుభకార్యాలు, ఇతర వేడుకలు నిర్వహిస్తున్నప్పుడు సమీపంలోని ఆశ్రమాలు, అనాథాశ్రమాలు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆహ్వానించి వారికిఆహారం అందిస్తే, వారి ఆకలిని తీర్చడమే కాకుండా ఒకఅపూర్వమైన సంతృప్తి,ఆనందం లభిస్తుంది. ఆహారంపట్ల అందరూబాధ్యతగా ప్రవర్తించే అలవాట్లు చేసుకుంటే, నేటిచిన్నారులు ఆ అలవాట్లను అనుసరిస్తారు,బాధ్యతతో కూడిన నడవడికతో ఆహారాన్ని దుర్వినియోగం చేయకూడదనే మంచి అలవాట్లను నేర్చుకుంటారు,దాని ద్వారా భవిష్యత్తులో వారు ఆహారాన్ని గౌరవించే,వృథాచేయని బాధ్యతాయుతమైన పౌరులుగా మారుతారు. ఆహారాన్ని గౌరవిద్దాం,ఆకలిని తగ్గిద్దాం. ●

# ఎఐ పునాదులు బలపడితేనే దేశ భవిష్యత్తు!

ముద్దం నరసింహస్వామి

ప్రతి దేశంలో కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తూ జన జీవనాన్ని ప్రభావితం చేస్తోంది. జనరేటివ్ ఏఐ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్, ఆరోగ్య సంరక్షణ, వ్యాధి నిర్ధారణ, రిటైల్, ఫైనాన్స్, పరిశ్రమలు వంటి అనేక రంగాల్లో ఏఐ విప్లవాత్మక మార్పులకు దారితీస్తోంది. అయితే ఈ వేగంలో భారత్ క్రియాశీలంగా ఉన్నప్పటికీ, గ్లోబల్ పోటీలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేకపోతోంది. పెట్టుబడుల కొరత, మౌలిక వసతుల లేమి, నిపుణ మానవ వనరుల లోపం వంటి అంశాలు దేశీయ ఏఐ వృద్ధికి ప్రధాన అడ్డంకులుగా మారుతున్నాయి.స్టాన్ఫర్డ్ యూనివర్సిటీ విడుదల చేసిన తాజా ఏఐ నివేదిక ప్రకారం, 2013-2024 మధ్య కాలంలో కృత్రిమ మేధ రంగంలో అమెరికా సుమారు 47 వేల కోట్ల డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించగా, చైనా దాదాపు 12వేల కోట్ల డాలర్లు సమీకరించింది. అదే సమయంలో భారత్ కేవలం 1,100కోట్ల డాలర్ల పెట్టుబడులతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇది ప్రపంచంలో డేటా ఉత్పత్తిలో భారత్ వాటా సుమారు 20 శాతం ఉన్నప్పటికీ, డేటా నిల్వ సామర్థ్యం కేవలం 3శాతానికి పరిమితమవుతుండటం గమనార్హం. ఈ అసమతుల్యత ఏఐ ఆధారిత పరిశోధనలు, ఉత్పత్తుల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏఐ మోడళ్ల శిక్షణకు కీలకమైన జీపీయూల అందుబాటులో లేకపోవడం భారత్కు పెద్ద సమస్యగా మారింది. తాజా ఆర్థిక సర్వే కూడా ఇదే అంశంపై హెచ్చరించింది. జీపీయూల కొరత కారణంగా పరిశోధనల వేగం మందగించడం, ఖర్చులు పెరగడం జరుగుతోంది. మరోవైపు, సెమీ కండక్టర్ చిప్ల కోసం విదేశాలపై ఆధారపడటం దేశీయ ఏఐ ఎకోసిస్టమ్ను మరింత బలహీనపరుస్తోంది. దేశీయంగా నిధులు, మౌలిక వసతులు, మార్కెట్ యాక్సెస్ సరిగా లభించకపోవడంతో భారతీయ ఏఐ స్టార్టప్లు అమెరికా వైపు చూస్తున్నాయి. వందకు పైగా ఏఐ సంస్థలు ఇప్పటికే యూఎస్కు తరలివెళ్లడం లేదా అక్కడ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ప్రయత్నించడం భారత్కు హెచ్చరికగా భావించాలి. ఇది బ్రెయిన్ డ్రెయిన్ మాత్రమే కాదు, ఇన్నోవేషన్ డ్రెయిన్ కూడా. అంచనాల ప్రకారం, వచ్చే ఏడాదికల్లా భారత్లో ఏఐ రంగంలో 23 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు ఏర్పడే అవకాశం ఉంది. అయితే ఉన్నత విద్య వ్యవస్థను తక్షణమే సంస్కరించుకోకపోతే, దాదాపు 10 లక్షల ఏఐఉద్యోగాలు నిపుణుల లేమితో ఖాళీగానే మిగిలి కోర్సులు కొద్ది అగ్రశ్రేణి విద్యాసంస్థలకే పరిమితమయ్యాయి. అధిక శాతం ఇంజినీరింగ్, సైన్స్ కళాశాలల్లో ఏఐ విభాగాలు, ప్రాక్టికల్ ఓరియెంటెడ్ పాఠ్యప్రణాళికలు లేవు.ఈ పరిస్థితుల్లో దేశీయంగా ఆధునిక మౌలిక వసతులనువేగంగా అభివృద్ధి చేయడం అత్యవసరం. ఏఐ మిషన్ కింద భారీ స్థాయిలో జీపీయూలను అందుబాటులోకి తీసుకురావాలి. విశాఖపట్నంలో ఏఐ హబ్, డేటా సెంటర్, అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు వంటి ప్రణాళికలు మౌలిక




వసతుల పరంగా సానుకూల సంకేతాలే.అయితే ఇవి కేవలం ప్రారంభ దశకే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా విస్తరించాలి.తాజా అంతర్జాతీయ అధ్యయనాలు సూచిస్తున్న మరో కీలక అంశం స్వదేశీ ఏఐ మోడళ్ల అభివృద్ధి. విదేశీ మోడళ్లపై ఆధారపడటం డేటా భద్రత, వ్యయభారం, వ్యూహాత్మక స్వతంత్రతపై ప్రభావం చూపుతుంది. కాబట్టి ఇండియా తన భాషలు, అవసరాలు, సామాజిక వాస్తవాలకు అనుగుణంగా సొంత లాంగ్వేజ్ మోడళ్లు, అప్లికేషన్లు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కేవలం టెక్నాలజీ రంగానికే పరిమితం కాకుండా, దేశాల ఆర్థిక భద్రత, జాతీయ భద్రత, సామాజిక సమానత్వానికి కేంద్ర బిందువుగా మారుతోంది. అమెరికా, చైనా వంటి దేశాలు ఏఐని స్ట్రాటజిక్ నేషనల్ అసెట్గా పరిగణిస్తూ భారీ ప్రభుత్వ-ప్రైవేట్ పెట్టుబడులతో ముందుకెళ్తున్నాయి. భారత్ కూడా ఈమార్గంలో అడుగులు వేస్తున్నప్పటికీ, అవి ఇంకా చెల్లాచెదురుగా ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.స్టాన్ఫర్డ్ ఏఐ ఇండెక్స్ రిపోర్ట్ ప్రకారం, అమెరికాలో మొత్తం ఏఐ పెట్టుబడుల్లో ప్రభుత్వ వాటా 30 శాతం దాటింది. చైనాలో అయితే ఇది ఇంకా ఎక్కువ. భారత్లో మాత్రం ఏఐ పెట్టుబడులు ఎక్కువగా ప్రైవేట్ రంగానికే పరిమితమవుతున్నాయి. దీని ఫలితంగా దీర్ఘకాలిక పరిశోధనలు, ఫౌండేషన్ మోడళ్ల అభివృద్ధి వంటి ఖరీదైన కార్యక్రమాలకు అవసరమైన స్థిర నిధులు అందడం లేదు. ప్రభుత్వం ముందుగా తీసుకోవాల్సిన కీలక నిర్ణయం జాతీయ ఏఐ ఫండింగ్ మోడల్. రక్షణ, అంతరిక్ష రంగాల మాదిరిగానే ఏఐకూ ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలి. ఏఐ పరిశోధనల కోసం ఐఐటీలు, ఐఐఎస్సీ, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో నేషనల్ ఏఐ ల్యాబ్స్ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇవి కేవలం అకడమిక్ పరిశోధనకే కాకుండా, స్టార్టప్లకు ఓపెన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్గా పనిచేయాలి. మరో కీలక అంశం డేటా పాలసీ. ప్రపంచ డేటాలో ఐదవ వంతు భారత్నుంచి ఉత్పత్తి అవుతున్నప్పటికీ, ఆ డేటా ఆధారంగా విలువ సృష్టించుకుంటున్నవి ఎక్కువగా విదేశీ సంస్థలే. దేశీయంగా సురక్షితమైన డేటా షేరింగ్ ఫ్రేమ్వర్క్, పబ్లిక్ డేటా రిపోజిటరీలు ఏర్పాటు చేస్తే హెల్త్టెక్, అగ్రిటెక్, ఎడ్యుటెక్ రంగాల్లో దేశీయ ఏఐ మోడళ్ల అభివృద్ధికి ఊతంలభిస్తుంది. విద్యారంగంలో సంస్కరణలు మరింత అత్యవసరం. ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ను ఎలక్టివ్లుగా కాకుండా కోర్ సబ్జెక్టులుగా ప్రవేశపెట్టాలి. పరిశ్రమలతో కలిసి లైవ్ ప్రాజెక్ట్, అప్రెంటిస్షిప్స్ తప్పనిసరి చేస్తేనే నైపుణ్యలోపం తగ్గుతుంది. ప్రపంచ బ్యాంక్ అంచనాల ప్రకారం, సరైన స్కిల్ అప్గ్రేడేషన్ జరిగితే భారత్ ఏఐ ద్వారా జీడీపీకి అదనంగా 7-8 శాతం వృద్ధిని సాధించగలదు. చివరగా, ప్రవాస భారతీయ ఏఐ నిపుణులను తిరిగి రప్పించేలా ప్రత్యేక ప్రోత్సాహక విధానాలు అవసరం. పన్నురాయితీలు, రీసెర్చ్ గ్రాంట్లు, స్టార్టప్ ఫ్రీడమ్ కల్పిస్తే భారత్ బ్రెయిన్ డ్రెయిన్ను బ్రెయిన్ గైన్గా మార్చగలదు. ఏఐ యుగంలో వెనుకబడితే, అది కేవలం ఒక టెక్నాలజీ లోటు కాదు భవిష్యత్ అవకాశాల కోల్పోవడమే. కాబట్టి ఇప్పుడే సమగ్ర జాతీయ వ్యూహంతో ముందుకెళ్లాల్సిన సమయం వచ్చింది. ప్రణాళికాబద్ధమైన పెట్టుబడులు, బలమైన మౌలికవసతులు, సమగ్ర విద్యా సంస్కరణలు, పరిశోధనలకు ప్రోత్సాహం కలిసొస్తే ఏఐ పందెంలో అగ్రదేశాలకు దీటుగా భారత్ దూసుకుపోవడం అసాధ్యం కాదు. ఇప్పుడే పునాదులు బలపరచుకోకపోతే, రేపటి అవకాశాలు విదేశాలకే జారిపో తాయన్న సత్యాన్ని విధాన నిర్ణయకర్తలు గ్రహించాల్సిన సమయం ఇదే. ●

# రంగంలోకి కొత్త 'రాఫెల్' విమానాలు!

### రూ.3.25 లక్షల కోట్లతో 114 జెట్ ఫైటర్స్ కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

### 17న ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ రాక

### 8 డోర్నియర్ విమానాల కోసం హెచ్ఎఎల్‌తో ఎంఒయు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** భారత వైమానిక దళం కోసం ఫ్రాన్స్ నుంచి 114 రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలనే రూ.3.25 లక్షల కోట్ల ప్రతిపాదనకు రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన రక్షణ సముపార్జన మండలి (డిఎసి) రాఫెల్ జెట్ విమానాల కొనుగోలుకు అనుమతి ఇచ్చింది. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ రాబోయే ఢిల్లీ అధికారిక పర్యటనకు ముందు ఈ అనుమతి లభించింది. మెక్రాన్ ఈ నెల 17న భారత పర్యటనకు వస్తున్న విషయం తెలిసిందే. రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం పొందిన తర్వాత, ఈ ఒప్పందానికి చివరికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగే భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ నుండి అనుమతి అవసరం. ప్రతిపాదన ప్రకారం, భారత్, ఫ్రెంచ్ రక్షణ దిగ్గజం డసాల్ట్ ఏవియేషన్ నుండి 18 ఆఫ్‌దిషెల్ఫ్ రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేస్తుంది. మిగిలిన 96 యుద్ధ విమానాలు భారతదేశంలో తయారు చేయబడతాయి. ఇంకా, ఈ జెట్‌లలో కొన్ని శిక్షణ కోసం ఉపయోగించబడే జంటసీట్ల విమానాలు. ఈ ఒప్పందంలో అత్యాధునిక యుద్ధ జెట్ సాంకేతికతను బదిలీ చేయడం, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి పూరకంగా వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంటుంది. భారత వైమానిక దళం ఇప్పటికే రెండు స్క్వాడ్రన్‌లను కలిగి ఉన్న 36 రాఫెల్‌లను కలిగి ఉంది, 'సి' వేరియంట్ చివరి డెలివరీ డిసెంబర్ 2024లో జరిగింది. అయితే, 'ఎం' వెర్షన్ మరో 26 రాఫెల్ జెట్‌లను కూడా భారత నౌకాదళం కోసం రూ. 63,000 కోట్ల విలువైన ఒప్పందంలో ఆర్డర్ చేశారు. నావికా వేరియంట్‌లను విమాన వాహక నౌకలు ఐఎన్ఎస్ విక్రాంత్. ఐఎన్ఎస్ విక్రమాదిత్య నుండి నిర్వహిస్తారు. ఆ ఒప్పందంలో ఎంఆర్ఓ (నిర్వహణ, మరమ్మత్తు, సమగ్ర పరిశీలన) ఒప్పందం కింద విమానాల నిర్వహణ, లాజిస్టిక్స్ మద్దతు, సిబ్బంది శిక్షణను సులభతరం చేయనుంది.

**ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ జెట్‌ల వినియోగం**

మే 2025లో పహల్గామ్ ఉగ్రవాద దాడికి భారత్ సైనికచర్యలో భాగంగా పాకిస్తాన్‌లోని ఖచ్చితమైన లక్ష్యాలను ఛేదించడానికి ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ జెట్‌లను విజయవంతంగా ఉపయోగించారు. 250 కి.మీ కంటే ఎక్కువ దూరంలోని నిర్దేశిత లక్ష్యాలను అత్యంత ఖచ్చితత్వంతో ఛేదించగల ఎస్‌సిఎఎల్‌పి అనే వాయుప్రయోగ క్రూయిజ్ క్షి పణిని ప్రయోగించడానికి వీటిని ఉపయోగించారు. అత్యాధునిక యుద్ధ విమానం, రాఫెల్, మెటియోర్ లాంగ్‌రేంజ్ గగనతలం నుంచి గగనతలం క్షి పణులు, స్టాండ్‌ఆఫ్ స్ట్రైక్ ఆయుధం హామర్, అధునాతన ఇవార్‌ఫేర్ సూట్ అయిన స్పెక్ట్రా, అలాగే అధునాతన రాడార్, లక్ష్య వ్యవస్థలను కూడా మోసుకెళ్లగలదు.

**8 డోర్నియర్ 228 విమానాల కోసం కేంద్రం హెచ్ఎఎల్‌తో ఒప్పందం**

ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) కోసం ఎనిమిది డోర్నియర్ 228 విమానాలను, ఆపరేషనల్ రోల్ పరికరాలను రూ.2,312 కోట్లకు కొనుగోలు చేయడానికి హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఎఎల్)తో ఒప్పందంపై సంతకం చేసినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. ఈ ఆర్డర్ హెచ్ఎఎల్ ఉత్పత్తి పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడం, ఎంఎస్ఎంఇలు, అనుబంధ పరిశ్రమల విస్తృత నెట్‌వర్క్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా గణనీయమైన ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని సృష్టిస్తుందని భావిస్తున్నారు. ఇది నిర్వహణ, మరమ్మత్తు, ఓవర్‌హాల్, లైఫ్ సైకిల్ సాంకేతిక మద్దతులో స్థిరమైన అవకాశాలను కూడా సృష్టిస్తుందని అధికారిక ప్రకటన తెలిపింది. రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో బై (ఇండియన్) కేటగిరీ కింద ఒప్పందంపై సంతకం చేశారు.



## బంగ్లా ఎన్నికల్లో బిఎన్పీ కూటమి క్లీన్‌స్వీప్!

# ప్రధాని రేసులో తారిక్ రెహమాన్

**ఢాకా, ఫిబ్రవరి 12:** బంగ్లాదేశ్‌లో అత్యంత కీలక ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ దేశ దశ దిశను మార్చే ఎన్నికలుగా ఇవి ఉండబోతున్నాయి. షేక్ హసీనా 2024లో జరిగిన హింసాత్మక ఘర్షణల తర్వాత, తన ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు, తాత్కాలిక పాలకుడిగా వచ్చిన మహ్మద్ యూనస్ పచ్చి భారత వ్యతిరేక వైఖరిని అవలంబించాడు. భారత్‌ను వ్యతిరేకిస్తూ, పాకిస్తాన్‌తో సంబంధాలు మెరుగుపరుచుకున్నాడు. గతంలో ఎప్పుడూ లేని విధంగా బంగ్లా వ్యాప్తంగా ఇస్లామిస్టులు రాజ్యమేలుతున్నారు. మతోన్మాద దాడులు, హిందువులపై అకృత్యాలు నిత్యకృత్యంగా ఉన్నాయి. ఇలాంటి తరుణంలో జరుగుతున్న ఈ ఎన్నికలకు చాలా ప్రాధాన్యత ఏర్పడింది. ఈసారి ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ), జమాతే ఇస్లామీ కూటమికి మధ్య తీవ్ర పోటీ ఉంటుందని సర్వేలు చెబుతున్నాయి. ఇక షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్‌ను యూనస్ సర్కార్ నిషేధించింది. జమాత్ నేతృత్వంలో 11 పార్టీలు కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. 17 ఏళ్ల ప్రవాసం తర్వాత బంగ్లాదేశ్ వచ్చిన మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిక్ రెహ్మాన్ బంగ్లాదేశ్ ప్రధాని రేసులో ముందు వరసలో ఉన్నాడు. ఈసారి డబుల్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరగనున్నాయి. దీంట్లో ఒక ఓటు ఎంపీకి, మరో ఓటు జులై చార్టర్ రిఫరెండం కోసం. ఈ రిఫరెండం ద్వారా ప్రధాని అధికారాలపై ఆంక్షలు, జ్యుడీషియరీ స్వాతంత్రంపై ప్రజాభిప్రాయాన్ని కోరుతారు. బంగ్లాదేశ్‌లో 350 సీట్లు ఉండగా, ఇందులో 299 స్థానాలకు పోలింగ్ జరిగింది. 50 స్థానాలు మహిళలకు కేటాయించారు. వీటికి పరోక్షంగా ఎన్నికలు జరుగుతాయి. ఢాకా ట్రిబ్యూన్ రిపోర్ట్ ప్రకారం బీఎన్‌పీ అలయన్స్ 208 సీట్లు సాధించి, క్లీన్ స్వీప్ చేస్తుందని చెబుతోంది. జమాత్ అలయన్స్‌కు 46 సీట్లు, జాతియా పార్టీకి 3 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఓట్ షేర్ ప్రకారం చూస్తే బీఎన్‌పీకి 66.3 శాతం, జమాత్‌కు 11.9 శాతం ఓట్లు సాధించే ఛాన్స్ ఉందని చెప్పింది. ఎన్ఆర్‌సీ సర్వే ప్రకారం బీఎన్‌పీ 77 శాతం ఓట్ షేర్‌తో 220 సీట్లు గెలుస్తుందని, జమాత్ 57 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వస్తుందని వెల్లడించింది. ప్రోథోం ఆలో రిపోర్ట్ మాత్రం బీఎన్‌పీ, జమాత్ మధ్య తీవ్రమైన పోటీ ఉంటుందని చెప్పింది. జమాత్ అలయన్స్ 105 సీట్లు, బీఎన్‌పీ అలయన్స్ 101 సీట్లు గెలుస్తుందని చెప్పింది. ఓట్ షేర్ బీఎన్‌పీకి 44.1 శాతం, జమాత్ అలయన్స్ 43.9 శాతం వస్తుందని అంచనా వేసింది. 77 సీట్లలో ఇద్దరి మధ్య టఫ్ ఫైట్ ఉంటుందని చెప్పింది.



## టర్కీ పార్లమెంట్‌లో ఫైటింగ్..

# కొట్టుకున్న అధికార-విపక్ష ఎంపిలు

**అంకారా, ఫిబ్రవరి 12:** టర్కీ పార్లమెంట్ రణరంగంగా మారింది. ప్రజాప్రతినిధులు వీధి రౌడీల్లా కొట్టుకున్నారు. పిడిగుద్దులు గుద్దుకుంటూ.. తన్నుకుంటూ నానా రభస చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన విడియో వైరల్ అవుతోంది. ఇస్తాంబుల్ చీఫ్ ప్రాసిక్యూటర్ అకిన్ గుర్లెక్ పార్లమెంట్‌లో న్యాయ శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతుండగా ప్రతిపక్ష ఎంపీలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అధికార-ప్రతిపక్ష ఎంపీలు ఒకరినొకరు కొట్టుకోవడం.. తన్నుకుంటూ కనిపించారు. చాలాసేపు ముష్టి యుద్ధం జరిగింది. ఇస్తాంబుల్ చీఫ్ ప్రాసిక్యూటర్‌గా గుర్లెక్.. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన రిపబ్లికన్ పీపుల్స్ పార్టీకి చెందిన అనేకమంది సభ్యులపై ఉన్నతస్థాయి విచారణలకు అధ్యక్షు వహించారు. ప్రతిపక్షం చాలాకాలంగా ఈ విచారణలను రాజకీయంగా ప్రేరేపించబడ్డాయని విమర్శిస్తోంది. ఇప్పుడు టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్.. అకిన్ గుర్లెక్‌ను న్యాయమంత్రిగా నియమించింది. బుధవారం ఆయన ప్రమాణస్వీకారం చేస్తుండగా ప్రతిపక్షాలకు ఆగ్రహం తెప్పించింది. ప్రతిపక్ష రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ నియంత్రణలో ఉన్న మునిసిపాలిటీలకు చెందిన వందలాది మంది అధికారులను అవినీతి దర్యాప్తులో అరెస్టు చేశారు. వీరిలో ఇస్తాంబులక్ష మేయర్ ఎక్రెమ్ ఇమామోగ్లు కూడా ఉన్నారు. ఆయనను గత సంవత్సరం అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలకు కోపం తెప్పించింది.

# ట్రంప్-నెతన్యాహు కీలక భేటీ

## ఇరాన్ అణు ఒప్పందంపై రహస్య చర్చలు



**వాషింగ్టన్, ఫిబ్రవరి 12:** ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అగ్రరాజ్యంలో పర్యటన ఆసక్తి రేపుతోంది. బుధవారం వైట్‌హౌస్‌లో మూడు గంటలపాటు ట్రంప్- నెతన్యాహు రహస్యంగా సమావేశం అయ్యారు. పలు కీలక అంశాలపై చర్చించినట్లుగా తెలుస్తోంది. ఇక ఇద్దరి సమావేశం తర్వాత ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియాలో కీలక వ్యాఖ్యలు చేశారు. టెహ్రాన్‌తో చర్చలు జరుగు తున్నాయని.. దౌత్యం అనిశ్చితంగానే ఉందని తెలిపారు. చర్చలు విఫలమైతే సమన్వయం కొనసాగుతుందని సంకేతాలు ఇచ్చారు. ఇరాన్‌తో నిరంతర చర్చలకు ఒత్తిడి తెచ్చానని.. ఇప్పటికీ చర్చలకు తలుపులు తెరిచే ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తానికి వార్నింగ్‌ల దగ్గర నుంచి చర్చలకు ట్రంప్ తెరలేపారు. డిసెంబరు 28 నుంచి ఇరాన్‌లో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఖమేనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేశారు. పెద్ద ఎత్తున హింస చెలరేగింది. ఇక భద్రతా దళాల కాల్పుల్లో 30 వేల మంది చనిపోయారు. దీంతో ట్రంప్ రంగంలోకి దిగి.. నిరసన కారులను చంపితే సైనిక చర్యకు దిగుతామని హెచ్చరించారు. అన్నట్టుగానే యుఎస్ఎస్ అబ్రహం లింకన్ నౌక అరేబియా సముద్రానికి వచ్చి మోహరించింది. తక్షణమే అణు ఒప్పందం చేసుకోవాలని ఇరాన్‌పై ట్రంప్ తీవ్ర ఒత్తిడి చేశారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో ట్రంప్-నెతన్యాహు భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉంటే అమెరికా నేతృత్వంలో ఏర్పడిన బోర్డ్ ఆఫ్ పీస్‌లో ఇజ్రాయెల్ చేరింది. చాలా రోజుల తర్జన భర్జన తర్వాత నెతన్యాహు సంతకం చేశారు. ఈ ఫోరమ్‌లో పాశ్చాత్య భాగస్వాములతో పాటు టర్కీ, ఖతార్ కూడా ఉన్నాయి. గతంలో గాజాలో వారి పాత్రపై ఇజ్రాయెల్ విమర్శలు చేసింది. మొత్తానికి శాంతి మండలిలో ఇజ్రాయెల్ చేరింది.

# రాహుల్‌గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

## బిజెపి ఎంపి నిశికాంత్ దూబె




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బిజెపి ఎంపి నిషికాంత్ దూబె డిమాండ్ చేశారు. ఈ మేరకు అతని సభ్యత్వాన్ని రద్దు చేసే ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ నోటీసు ఇచ్చారు. ఇంకా ప్రచురితం కాని భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎంఎం నరవణె పుస్తకం సహా పలు వివాదాస్పద అంశాలపైనా రాహుల్‌గాంధీ, బిజెపి ఎంపిల మధ్య తీవ్ర వాగ్వాదం నడిచిన సంగతి తెలిసిందే. రాహుల్ గాంధీకి ఎవరు నిధులు ఇస్తున్నారు? ఆయన చేతికి ప్రచురితం కాని పుస్తకం ఎలా వచ్చింది? భారత వ్యతిరేక శక్తులతో ఆయన సంబంధాల గురించి ఆ నోటీసులో ప్రస్తావించారు. లోక్‌సభలో రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి అని దూబె అన్నారు. అయితే ఆయనపై సభా హక్కుల తీర్మానం తీసుకురావడం లేదని చెప్పారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రస్తావన తీసుకువచ్చారు. అదానీ, అనిల్ అంబానీ, హార్దీప్‌సింగ్ పురీ పేర్లను పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను అధికారపక్షం నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ పదాలను తొలగించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆయన చేసిన ఆరోపణలకు ఎలాంటి ధృవీకరణ లేదని పేర్కొన్నాయి.

# సేవాతీర్థ్ కాంప్లెక్స్‌కు మారుతున్న నార్త్,సౌత్ బ్లాక్‌లు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** దేశ రాజధాని ఢిల్లీలోని బ్రిటీష్ కాలం నాటి ఆఫీసు బిల్డింగ్‌లు ఉన్న నార్త్, సౌత్ బ్లాకులను శుక్రవారం పూర్తిగా ఖాళీ చేయనున్నారు. ప్రధానమంత్రి కార్యాలయం కూడా కొత్తగా నిర్మించిన సేవా తీర్థ్ కాంప్లెక్స్‌కు మారనున్నది. ఆఫీసును మార్చడానికి ముందు శుక్రవారం ప్రధాని మోదీ చివరిసారి క్యాబినెట్ భేటీ ఏర్పాటు చేయనున్నారు. రేపు సాయంత్రం 4 గంటలకు పాత ఆఫీసులో ఆ భేటీ ఉండనున్నది. ఢిల్లీలోని ల్యూటెన్స్ రైసినా హిల్స్‌లో ఉన్న సౌత్ బ్లాకులో చివరిసారి కేంద్ర క్యాబినెట్ భేటీ జరగనున్నది. నార్త్ బ్లాక్ నుంచి కేంద్ర హోంశాఖ కార్యాలయాన్ని పూర్తిగా షిఫ్ట్ చేశారు. కామన్ సెంట్రల్ సెక్రటేరియేట్‌లోని 347 రూమ్ కాంప్లెక్స్‌కు హోంశాఖను తరలించారు. ఒక్క పీఎంవో మినహా ఆ కాంప్లెక్స్‌లో అన్ని ప్రభుత్వ మంత్రులు, శాఖల ఆఫీసులు ఉన్నాయి. సెంట్రల్ ఢిల్లీలోని ప్రత్యేక కాంప్లెక్స్‌లో పీఎంవోను నిర్మించారు. పీఎంవోను ఇక నుంచి సేవాతీర్థ్ అని పిలవనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 13వ తేదీన జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ సేవాతీర్థ్, కర్తవ్యభవన్1,2లను ఆవిష్కరిస్తారని ప్రభుత్వం గురువారం ఓ ప్రకటన రిలీజ్ చేసింది. కొత్త ఆఫీసు బిల్డింగ్‌ను ప్రారంభించడంతో భారతీయ అధికార పరిపాలనా విభాగంలో కొత్త మైలురాయి చేరు కున్నట్లు అవుతుంది. ఆధునిక, పటిష్టమైన, సౌకర్యవంతమైన పరి పాలనా వ్యవస్థను అందిచే ఉద్దేశంతో కొత్త బిల్డింగ్ లను నిర్మించినట్లు అధి కారులు పేర్కొన్నారు. గతంలో దూరం దూరం గా ఉన్న వివిధ శాఖల ఆఫీసులను ఇప్పుడు ఒకే దగ్గరికి తీసుకువచ్చారు. పరిపాలనను మరింత సులభం చేయాలన్న ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సేవా తీర్థ్‌లో ప్రధానమంత్రి కార్యాలయం, నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్ సెక్రటేరియేట్, క్యాబినెట్ సెక్రటేరియేట్ ఉంటాయి. గతంలో ఇవన్నీ వేర్వేరు ప్రాంతాలను నుంచి ఆపరేట్ అయ్యేవి. ఇక కర్తవ్య భవన్ 1,2లో కీలక మంత్రిత్వశాఖల ఆఫీసులు ఉంటాయి. ఆర్థిక, రక్షణ, ఆరోగ్య, కార్పొరేట్ సర్వీసెస్, విద్య, సంస్కృతి, న్యాయ, సమాచార ప్రసార, వ్యవసాయ, రసాయనిక, గిరిజన శాఖ ఆఫీసులు ఉంటాయి. అన్ని ఆఫీసుల మధ్య డిజిటల్ ఇంటిగ్రేషన్ ఉంటుంది. ప్రస్తుత నార్త్, సౌత్ బ్లాకుల వద్ద ప్రపంచ స్థాయి మ్యూజియంను నిర్మించనున్నారు. యుగే యుగే భారత్ మ్యూజియంలో భారతీయ నాగరికత ప్రయాణాన్ని చిత్రీకరించనున్నారు. అయితే ఇప్పటికే నార్త్ బ్లాక్ వద్ద మ్యూజియం పనులు ప్రారంభమైనట్లు తెలుస్తున్నది.


## భూమి దిశగా దూసుకొచ్చిన స్విఫ్ట్ అబ్జర్వేటరీని ఆపిన నాసా



**వాషింగ్టన్, ఫిబ్రవరి 12:** నాసా టెలిస్కోప్ 'నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ' భూమి దిశగా దూసుకొచ్చింది. వాతావరణ రాపిడి వల్ల ఇది తన కక్ష్య నుంచి భూమి వైపు కదిలింది. 585 కిలోమీటర్ల ఎత్తు నుంచి ఇది 400 కి.మీ. కిందికి చేరింది. దీంతో అట్మాస్పెరిక్ డ్రాగ్ (స్పేస్‌క్రాఫ్ట్ శక్తిని కోల్పోయేలా చేస్తుంది)ను తగ్గించేందుకు తాత్కాలికంగా సైన్స్ ఆపరేషన్లను నిలిపివేశారు. అలాగే మళ్లీ దానిని యథాస్థితికి చేర్చేందుకు నాసా రీబూస్ట్ మిషన్‌ను చేపట్టింది. విశ్వంలో చోటుచేసుకునే గామా కిరణాల పేలుళ్లను గుర్తించి, అధ్యయనం చేసేందుకు నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీని నాసా 2004లో దీన్ని ప్రయోగించింది. సోలార్ యాక్టివిటీ వల్ల భూ ఎగువ వాతావరణం వేడెక్కి, ఈ అబ్జర్వేటరీ కక్ష్య నుంచి కిందికి రావడం ప్రారంభమైంది. దీనిని అలాగే వదిలేస్తే.. 2026 చివరి నాటికి భూవాతావరణంలోకి ప్రవేశించి కాలిపోయేది. దాని వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. అయితే దాని సేవల్ని సాధ్యమైనంత ఎక్కువకాలం కొనసాగించాలని నాసా భావిస్తోంది. రీబూస్ట్ మిషన్‌ను చేపట్టే వరకు ఆ టెలిస్కోప్‌ను 300 కి.మీ. ఎత్తులో ఉంచేందుకు.. అట్మాస్పెరిక్ డ్రాగ్‌ను తగ్గించేలా చర్యలు తీసుకుంటోంది. కాగా.. రీబూస్ట్ మిషన్ కోసం ఆరిజోనాకు చెందిన కాటలిస్ట్ స్పేస్ టెక్నాలజీస్‌తో నాసా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ జూన్‌లో 30 మిలియన్ డాలర్లతో రోబోటిక్ లింక్ స్పేస్‌క్రాఫ్ట్ (కక్ష్యలో సర్వీసింగ్ కోసం, ఉపగ్రహ మరమ్మతు, డాకింగ్ కోసం రూపొందించిన ఒక రోబో వ్యవస్థ)ను పంపించనుంది. ఇది స్విఫ్ట్‌ను 600 కి.మీ. ఎత్తులో స్థిరమైన కక్ష్యలోకి చేరుస్తుంది. దాంతో అది మళ్లీ మరో పదేళ్ల సేవలు అందించడానికి వీలు కలుగుతుంది. ఈ ప్రయత్నం విజయవంతమైతే.. ఇప్పటివరకు సంగ్రహించిన డేటాను కాపాడుకునే వీలు కలుగుతుంది.

# ఎర్రకోట దాడి వెనుక జైషే హాస్తం

## ఐక్యరాజ్యసమితి సంచలన నివేదిక




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపై ఐక్యరాజ్యసమితి కీలక నివేదిక ఇచ్చింది. ఈ పేలుడుకు పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తోన్న జైషే మహ్మద్ ఉగ్ర ముఠాతో సంబంధం ఉందని పేర్కొంది. ఆర్థిక ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిడి ఉన్నప్పటికీ జైషే సహా పలు ఉగ్ర ముఠాలు దక్షిణాసియాలో క్రియాశీలకంగా తమ నేర కార్యకలాపాలు సాగిస్తున్నాయని వెల్లడించింది. ఈ మేరకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి సమర్పించిన నివేదికలో ఈ విషయాలు ప్రస్తావించింది. ఆంక్షలు ఉన్నప్పటికీ జైషేముఠా పలు ఉగ్రదాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. అందులో ఒకటి 2025 నవంబరు 10న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన దాడి అని ఐక్య రాజ్యసమితి సభ్య దేశం ఒకటి ఆరోపించింది. ఇక అంతర్జాతీయ నిఘా నుంచి తప్పించుకునేందుకు జైషే కొత్త పన్నాగాలు పన్నుతోంది. గతేడాది జమాత్ ఉల్ ముమినత్ పేరుతో మహిళా వింగ్‌ను ఏర్పాటు చేసుకుంది. ఇలా చాలా ఆందోళనకర పరిణామం అని ఐక్యరాజ్య సమితి తమ నివేదికలో పేర్కొంది. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఘటనను కూడా ఐక్యరాజ్య సమితి తన నివేదికలో ప్రస్తావించింది. ఆ దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులు హతమైనట్లు తెలిపింది. జైషే, లష్కరే తోయిబా వంటి ఉగ్ర ముఠాలు ఉనికిలో లేవని గత కొంతకాలంగా పాకిస్తాన్ పదే పదే వాదిస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా ఐక్యరాజ్యసమితి ఇచ్చిన నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నివేదికతో దాయాది పాక్ వక్రబుద్ధి మరోసారి బయటపడినట్లయింది. ఎర్ర కోట వద్ద పేలుడు ఘటనపై ఎన్ఐఎ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులో వచ్చాయి.

# సైబర్ మాఫియా గుట్టురట్టు చేసిన కాంబోడియా

**నాంఫే, (కాంబోడియా), ఫిబ్రవరి12:** సినిమా తెరపై కనిపించే భయానక స్కామ్ జ్యాలను తలపించేలా కంబోడియా సరిహద్దుల్లో సాగుతున్న ఒక భారీ సైబర్ నేర సామ్రాజ్యాన్ని థాయ్‌లాండ్ పోలీసులు రట్టు చేశారు. కేజీఎఫ్ సినిమాలోని గనుల మాదిరిగా, వందల మంది యువతను బంధించి, ప్రైవేటు సైన్యంతో కాపలా పెట్టి, రోజుకు 18 గంటల పాటు బలవంతంగా పని చేయిస్తున్న తీరు అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది. ఓస్మాచ్ పట్టణంపై థాయ్ సైన్యం చేపట్టిన వ్యూహాత్మక దాడిలో ఆరు అంతస్తుల భారీ భవన సముదాయం బయటపడింది. బయటకు ఐటీ కంపెనీలా కనిపించే ఈ భవనం లోపల అసలు సిసలు సైబర్ మోసాల కర్మాగారం నడుస్తోందని అధికారులు గుర్తించారు. ఉద్యోగాల పేరుతో మానవ అక్రమ రవాణా ముఠాల ద్వారా వివిధ దేశాల యువతను అక్కడికి రప్పించి, వారి పాస్‌పోర్టులను లాక్కుని బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెంచేశారు. వారిని నిర్బంధించి డిజిటల్ అరెస్టులు, బ్యాంకు మోసాలు, ఫేక్ పోలీసు కాల్స్ వంటి ఆన్లైన్ స్కామ్‌లు చేయించేవారు. ఈ బందీల్లో భారతీయులు, ముఖ్యంగా తెలుగు వారు కూడా ఉన్నట్లు సమాచారం. నిర్దేశించిన టార్గెట్ పూర్తి చేయకపోతే తీవ్రమైన హింసకు గురిచేసేవారని, కనీసం సూర్యుడిని చూసే అవకాశం కూడా లేని గదుల్లో వారిని బంధించేవారని బాధితులు వాపోతున్నారు. ఆ భవనంలో భారత్, చైనా, ఆస్ట్రేలియా వంటి దేశాల పోలీస్ స్టేషన్లను తలపించే సెట్లు, ఆయా దేశాల పోలీసు దుస్తులు, జాతీయ జెండాలను ఏర్పాటు చేసి మరీ ఈ మోసాలకు పాల్పడేవారు. ఈ గదుల్లో వందలాది కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌లు, వేల సంఖ్యలో సిమ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ పనిచేస్తున్న వారు ఎదురు తిరిగితే శిక్షించేందుకు ప్రత్యేక రక్షణ సిబ్బందిని కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఇలాంటి సైబర్ నేరాల ద్వారా ఏటా సుమారు 12.5 బిలియన్ డాలర్లు కంబోడియాకు చేరుతున్నట్లు అంచనా వేస్తున్నారు. అయితే ఈ అంతర్జాతీయ ముఠాల ప్రభావం భారతీయ పల్లెలకు కూడా పాకి ప్రాణాలు తీస్తోంది. ములుగు జిల్లాకు చెందిన ఒక కూలీ, సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు భయపడి ఆత్మహత్యకు పాల్పడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్, పోలీసుల పేరుతో వచ్చే బెదిరింపుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.


## సంక్షిప్తంగా..

### 3వ తరగతి నుంచే విద్యార్థులకు ఎఐ యాక్సెస్: కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో మాదిరి విద్యారంగంలోను కృత్రిమ మేధ విస్తరిస్తుంది. ఈ కొత్త ఎఐ విధానాన్ని భారత్‌లోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని, 3వ తరగతి నుంచి అధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు ఈ కృత్రిమ మేధ అందుబాటులో ఉంటుందన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఎఐ కాంక్లేవ్ - 2026 సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎఐ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ మేధో సామర్థ్యానికి లోటు లేదని, కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నాయని వెల్లడించారు. భారత్‌లో గణనీయమైన యువశక్తి ఉందన్నారు.

### తొలితరం న్యూస్ యాంకర్ సరళామహేశ్వరి కన్నుమూత



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** భారత టెలివిజన్ రంగంలో సుపరిచితురాలు, దూరదర్శన్ సీనియర్ న్యూస్ యాంకర్ సరళా మహేశ్వరి (71) కన్నుమూశారు. ఆమె మృతి పట్ల దూరదర్శన్ నేషనల్ చానల్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆమె సౌమ్యమైన స్వరం, స్పష్టమైన ఉచ్చారణ, వార్తలను హుందాగా అందించే తీరుతో భారతీయ వార్తా ప్రపంచంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని నివాళి అర్పించింది. దూరదర్శన్ కుటుంబం తరఫున సరళా మహేశ్వ రికి హృదయపూర్వక నివాళులు. ఆమె తన సరళత, హుందాతనంతో వీక్షకులలో చెరగని ముద్ర వేశారు" అని డీడీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. సరళాతో కలిసి పనిచేసిన సీనియర్ యాంకర్ షమ్మీ నారంగ్ కూడా ఆమె మృతిపై విచారం వ్యక్తం చేశారు.

## డికె సిఎం కావాలంటున్న 90 మంది ఎమ్మెల్యేలు!



**బెంగళూరు, ఫిబ్రవరి 12:** డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని 80 నుంచి 90 మంది ఎమ్మెల్యేలు కోరుకుంటు న్నారని కర్ణాటక కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ పునరుద్ఘాటించారు. కర్ణాటకలో గత కొన్ని నెలలుగా ముఖ్యమంత్రి మార్పు అంశంపై చర్చ సాగుతోంది. ఈరోజు ఇక్బాల్ హుస్సేన్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కోసం శివకుమార్ చేసిన కృషికి ఆయన ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవాలని చాలామంది ఎమ్మెల్యేలు ఆశిస్తున్నారని అన్నారు. కర్ణాటకలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శివకుమార్‌కు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు. 140 మంది ఎమ్మెల్యేలు మార్పును ఆశిస్తున్నారని, 80 నుంచి 90 వరకు ఎమ్మెల్యేలు ఈ అంశంపై చర్చించుకుంటున్నారని, తామంతా మద్దతిస్తున్నామని అన్నారు.

## వారసురాలిగా కూతురు కిమ్‌జ్యూయే!



**ప్యాంగ్యాంగ్, ఫిబ్రవరి 12:** ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ వారసురాలిగా ఆయన కూతురు కిమ్ జు యే ను ఎంపిక చేసినట్లు దక్షిణ కొరియా వెల్లడించింది. ఈ విషయాన్ని కిమ్ ఇంకా అధికారికంగా ప్రకటించకపోయినా, కిమ్ తన కుమార్తెనే దేశాధినేతగా నిర్ణయించారని దక్షిణ కొరియాకు చెందిన నిఘా సంస్థ నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్ ప్రకటించింది. ఈ అంశాన్ని దక్షిణ కొరియా తన దేశంలోని చట్టసభల నేతలకు తెలిపింది. ఉత్తర కొరియాలో ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహించే కాంగ్రెస్ సమావేశం ఈ నెల చివరిలో జరగనుంది. ఈ నేపథ్యంలో దేశానికి కొత్త నాయకత్వం ఎవరూ అనే అంశంపై చర్చ జరుగుతుండగా అనేక పేర్లను పరిశీలించిన కిమ్ తన కూతురును భవిష్యత్ నాయకురాలిగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆమెకు ఈ అంశంపై తగిన శిక్షణ, అవగాహన కల్పిస్తున్నట్లు సమాచారం.

# అమెరికా వాణిజ్య ఒప్పందంతో తెలంగాణ రైతాంగానికి తీవ్రనష్టం

## రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** అమెరికాతో తాజా వాణిజ్య ఒప్పందం ద్వారా భారత మార్కెట్లోకి ద్వారాలు తెరిస్తే ఎక్కువ సబ్సిడీలు పొందుతున్న చౌకగా ఉండే ఆ దేశ వ్యవసాయ ఉత్పత్తులు ఇక్కడి మార్కెట్లను ముంచెత్తి, రైతుల జీవనోపాధిని దెబ్బతీసే ప్రమాదం ఉందని తెలంగాణ సీడ్ కార్పోరేషన్ ఛైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే వ్యవసాయరంగం దయనీయ స్థితిలో ఉందని, ప్రకటించిన కనీస మద్దతు ధర కన్నా 30 నుంచి 40 శాతం తక్కువ ధరకు రైతులు తమ పంటలను అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారతదేశ పంట దిగుబడులను అమెరికాకు ఎగుమతి చేస్తే అనేక కారణాలు చెప్పి తిరస్కరించే ప్రమాదం ఉందన్నారు. కానీ అమెరికా మాత్రం ఎలాంటి నియమ నిబంధనలు లేకుండా భారత్‌కు వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతిచేసే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని సమీక్షిం చుకో వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఎస్ రామకృష్ణారావు, జయేషన్‌రంజన్ తదితరులు

# మౌలిక వసతుల బలోపేతానికి చర్యలు

## సైబరాబాద్ కార్పొరేషన్‌లో సిఎస్ సమీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) తొలి స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గురువారం మాదాపూర్ నాక్ బిల్డింగ్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ కార్పొరేషన్ పరిధిలోని పరిశుభ్రత, ఇంజినీరింగ్ తదితర పౌర సేవలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సేవల మెరుగుదలకు, పట్టణ మౌలిక వసతుల బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు. సమావేశంలో సీఎంసీ ప్రత్యేకాధికారి జయేష్ రంజన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన, వాటర్ బోర్డు ఎండి కె. అశోక్ రెడ్డి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

# మేడారంలో విజయవంతంగా మహిళా సంఘాల వ్యాపారం

## 6 కోట్ల పెట్టుబడితో 3 కోట్ల 10 లక్షల లాభం

## ములుగు జిల్లా స్వయంసహాయక సంఘాల మహిళల రికార్డు: మంత్రి సీతక్క హర్షం

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** ఇందిరా మహిళా శక్తి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ప్రోత్సాహంతో మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో మహిళా సంఘాలు విజయవంతంగా పలు వ్యాపార, వాణిజ్య కార్యక్రమాలు నిర్వహించాయని తెలంగాణ గ్రామీణాభివృద్ధిశాఖ ప్రకటించింది. జాతరలో స్వయంసహాయక సంఘాల మహిళలు మొత్తం 565 వ్యాపార కార్య కలాపాలను నిర్వహించారు. మొత్తం రూ.603.30కోట్ల పెట్టుబడి పెట్టారు. ఈ పెట్టుబడితో మొత్తం రూ.9కోట్ల 12లక్షల రూపాయల 68వేల రూపాయల ఆదాయం రాగా అందులో పెట్టుబడిగా పెట్టిన రూ.6కోట్ల 3లక్షల30వేలు పోను మొత్తం రూ.3కోట్ల 9లక్షల 38వేల లాభం సమకూరింది. ములుగు జిల్లాలోని అన్ని మండలాల స్వయం సహాయక సంఘాల మహిళలకు మేడారం జాతరలో ప్రభుత్వ ప్రోత్సాహంతో వ్యాపారం నిర్వహించే అవకాశం కల్పించారు. దీంతో జిలాల్లోని 10 మండలాల ఎస్‌హెచ్‌జీ మహిళలకు వ్యాపార అవకాశాలు జాతరలో లభించాయి. స్వయం సహాయక సంఘాల మహిళలు మేడారం జాతరలో విజయవంతంగా వ్యాపారం చేసి పెద్ద మొత్తంలో లాభం సంపాదించడంపై రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు.

# టిజి సెట్-2026 హాల్‌టికెట్లు విడుదల

## 22న ప్రవేశ పరీక్ష. సెట్ చీఫ్ కన్వీనర్ కృష్ణఆదిత్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలతోపాటు 6 నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేయడానికి నిర్వహించే టిజి కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజి సెట్)-2026 హాల్ టికెట్లను విడుదల చేశారు. టిజి సెట్-2026 హాల్ టికెట్లను గురువారం నుంచే అభ్యర్థులకు అందుబాటులో ఉంచినట్టు టిజి సెట్-2026 చీఫ్ కన్వీనర్, ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి ఎస్ కృష్ణ ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది టిజి సెట్‌కి 1.812,061 దరఖాస్తులు వచ్చాయి.

గతేడాది కంటే ఈ ఏడాది దరఖాస్తులు ఎక్కువ వచ్చాయి. టిజి సెట్-2026 ద్వారా టిజిఎస్‌ఆర్‌డబ్ల్యూఆర్, టిజిటిడబ్ల్యూ ఆర్, ఎంజెపిటిబిసిడబ్ల్యూఆర్, టిఆర్‌ఈఐ సొసైటీల్లో 5వ తరగతితోపాటు ఆయా సొసైటీల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్టికెట్లను ఈ నెల 22 వరకు డౌన్లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు నమోదు చేసుకున్న మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

అభ్యర్థులు హాల్ టికెట్లను ముందుగానే డౌన్‌లోడ్ చేసుకొని, ప్రవేశ పరీక్షకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని కృష్ణ ఆదిత్య సూచించారు. ఈ నెల 22న అన్ని జిల్లాల్లో ఉదయం 5వ తరగతిలో ప్రవేశాలకు .. మధ్యాహ్నం 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిపోయిన సీట్లలో అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు.

# జీవన ప్రమాణాలు పెంచేలా బడ్జెట్ ప్రతిపాదనలకు చర్యలు

## విజన్-2047 లక్ష్యానికి అనుగుణంగా రవాణా శాఖ, ఆర్‌టిసి కార్యాచరణ: మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** జీవన ప్రమాణాలు పెంచేలా బడ్జెట్‌లో బీసీ సంక్షేమ శాఖ ప్రతిపాదనలు ఉండేలా చర్యలు తీసుకోనున్నామని, విజన్-2047 లక్ష్యానికి అనుగుణంగా రవాణా శాఖ, ఆర్‌టిసి కార్యాచరణ ఉంటుందని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2025-26 బడ్జెట్‌లో కేటాయింపులు, విడుదలైన నిధులు, చేసిన ఖర్చులు ఇంకా పెండింగ్‌లో ఉన్న అంశాలపై బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖలపై మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం వేరు వేరుగా సమీక్షా సమావేశం నిర్వహించారు.

బీసీ సంక్షేమ శాఖలో 2025-26లో బడ్జెట్ కేటాయింపులు నిధుల విడుదల విద్యార్థుల స్కాలర్ షిప్‌లు, హాస్టల్ నిర్వహణ, స్టడీ సర్కిల్ల్లో శిక్షణ, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్, కళ్యాణ లక్ష్మి, రజక, నాయి బ్రాహ్మణుల ఉచిత విద్యుత్, కాటమయ్య రక్షణ కవచాలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పథకాలకు నిధుల విడుదలలో ఇబ్బందులు లేవని సక్రమంగా లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు.

2026-27 బడ్జెట్‌లో చేర్చాల్సిన అంశాలు, ప్రతిపాదనలపై అధికారులకు పలు సూచనలు చేశారు. బలహీన వర్గాలకు జీవన ప్రమాణాలు, ఆర్థికవృద్ధి సాధించేలా బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెట్టాలని డిప్యూటీ సీఎం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో జరుగుతున్న బడ్జెట్ సన్నాహక సమావేశంలో ఈ అంశాలపై చర్చించాలని అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. రవాణా శాఖ ఆర్టీసీలో విజన్-2047కి అనుగుణంగా చేర్చిన అంశాలపై కార్యాచరణ ముందుకు తీసుకోవాలని సూచించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో రవాణా శాఖలో స్థలాలు ఉండి కార్యాలయాలు లేని వాటికి సొంత భవనాలు నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

ఆర్టీసీలో పెండింగ్ అంశాలు, కొత్త బస్సుల కొనుగోలు, ఉద్యోగ నియామకాలు అంశాలపై చర్చించారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ శ్రీధర్, ఎంజేపి సెక్రటరీ సైదులు, జెటిసిలు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఆర్‌టిసి అధికారులు పాల్గొన్నారు.

# తండ్రి అడుగు జాడల్లో అనన్య

## మున్సిపల్ చైర్మన్ పీఠం ఎక్కనున్న స్పీకర్ కూతురు

## తండ్రికి తగ్గ తనయ అంటూ ప్రశంసలు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న అనన్య

**వికారాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** మున్సిపల్ చైర్మన్ పీఠం గడ్డం అనన్య అధిరోహించనున్నారు. వాగ్ధాటితో పట్టణ ఓటర్లను అతి తక్కువ కాలంలో ఆక ట్టుకున్నారు. కొత్త వారిని సైతం అప్యాయంగా పలుకరిస్తూ ఎన్నికల్లో తనదైన శైలిలో ఆకట్టుకుని ఓటర్ల మనస్సులను చూరగొన్నారు. ఈ అమ్మాయి ఎవరంటూ పలువురు ఓటర్లు ఆరా తీయగా.. మన ప్రసాదన్న కూతురు గడ్డం అనన్య అని తెలుసుకున్నారు. తండ్రికి తగ్గ తనయా..అంటూ ప్రశంసలు కురిపించారు. వికారాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థిగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూతురు గడ్డం అనన్య బరిలో దిగారు. గడ్డం ప్రసాద్‌కుమార్ మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ప్రస్తుతం అసెంబ్లీ స్పీకర్ పదవిలో కొనసాగుతున్నారు. దీంతో అనన్య రాజకీయం వారసత్వాన్ని తండ్రి నుంచి పునికిపుచ్చు కున్నారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ వికారాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో అరంగేట్రం చేశారు. చైర్మన్ అభ్యర్థిగా 17వ వార్డు నుంచి పోటీలో నిలిచారు. గడ్డం అనన్య తీగల కృష్ణారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యను అభ్యసించారు. ఆమె తల్లి గడ్డం శైలజ ఐదేళ్ల క్రితం కన్ను మూయడంతో అన న్య తీవ్ర మనోవేద నకు గురయ్యారు. అనన్యను తండ్రి గడ్డం ప్రసాద్‌కుమార్ తన వెంట తీసుకువెళ్తూ.. రాజకీయంగా ప్రజలకు పరిచయం చేశారు. ప్రజలకు చేరువ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తండ్రి గడ్డం ప్రసాద్‌కుమార్ గెలుపు కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించి అహర్నిశలు శ్రమించారు. ప్రసాద్‌కుమార్ గెలుపునకు అనన్య తనదైన శైలిలో కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రశంసలు కురిపించారు.

**గెలుపు బాటలో అనన్య..**

వికారాబాద్ మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా, 1వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి, 15వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి ఏకగ్రీవం అయ్యారు. నామినేషన్ ఉప సంహరణ అనంతరం ఏకగ్రీవం అయిన బిఆర్ఎస్ అభ్యర్థి సైతం కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో కాంగ్రెస్‌కు రెండు స్థానాలు దక్కాయి. 17వ వార్డు నుంచి చైర్మన్ అభ్యర్థిగా గడ్డం అనన్య బరిలో దిగారు. బిఆర్ఎస్ అభ్యర్థి సైతం కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో అనన్య గెలుపు ముందుగానే జరిగి పోయిందంటూ కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ ఖాతాలో ఇప్పటికే 3 కౌన్సిలర్ స్థానాలను కైవసం చేసుకుంది. మరో 19 స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకోనున్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మెజార్టీ స్థానాల కంటే ఎక్కువగా కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులు గెలువనుండటంతో, గడ్డం అనన్య వికారాబాద్ మున్సిపల్ చైర్మన్ కుర్చీ ఎక్కనుందని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# త్వరలో మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలు

## ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు

## టేక్‌హోమ్ రేషన్ విధానంలో సరకులు అందచేసేలా ప్రతిపాదనలు

## అర్హులందరికీ పోషకాహారం అందించాలి : మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ పరిధిలో వలస కార్మికులు అధికంగా నివసించే ప్రాంతాలు, బస్తీలు, మురికివాడల ప్రాంతాల్లో అంగన్‌వాడీ సేవలు అందని అర్హుల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. భవనాల కొరత, సాంకేతిక సమస్యలు, అలాగే కొత్త అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షల నేపథ్యంలో మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు దిశగా తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ కసరత్తు ప్రారంభించింది.

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో కలిపి ప్రస్తుతం 2,364 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. అయితే ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో హెచ్ఎండీఏ పరిధిలోని 274 కవర్ కాని బస్తీల్లో 25,310 మంది అర్హులైన చిన్నారులు, గర్భిణీలు, బాలింతలను గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో వీరికి పోషకాహార సేవలు సక్రమంగా అందడం లేదని వెల్లడైంది. అధిక జనసాంద్రత, తరచు వలసలు, నిబంధనల పరిమితులు, బస్తీల్లో భవనాల లభ్యత లేకపోవడం, సాంకేతిక అడ్డంకులు వంటి కారణాల వల్ల కొత్త అంగన్‌వాడీ కేంద్రాల స్థాపనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఏ ఒక్క అర్హుడు కూడా నష్టపోకూడదు, పోషకాహారానికి ఆటంకం కలగకూడదని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాలలో భాగంగా పోషకలోప రహిత తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.

అర్హులందరికీ అంగన్‌వాడీ సేవలు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని మంత్రి ఆదేశించారు. టేక్ హోం రేషన్ విధానంలో అర్హుల నివాసాలకే సరుకులు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో బాలమృతం, పాలు, స్నాక్స్, కోడి గుడ్లు, బియ్యం తదితర పోషకాహార పదార్థాలను పంపిణీ చేయనున్నారు.

ఈ ప్రణాళికలో భాగంగా 274 స్లమ్ ప్రాంతాలను కవర్ చేస్తూ 37 వాహనాలను అద్దెకు తీసుకుని మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించేందుకు అధికా రులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఒక్కో వాహనానికి నెలకు రూ.60,000 అద్దె చెల్లించనున్నారు. జిల్లా వారీగా హైదరాబాద్‌లో 7, మేడ్చల్-మల్కాజిగిరిలో 15, సంగారెడ్డిలో 1, రంగారెడ్డిలో 14 వాహనాలను వినియోగించనున్నారు. ఈ మొబైల్ కేంద్రాలను సమీప అంగన్‌వాడీ కేంద్రాలకు అనుబంధంగా నిర్వహిస్తారు. మొబైల్ అంగన్‌వాడీ వాహనాల ద్వారా ఆయా ప్రాంతాల్లోని అర్హులకు పోషకాహారాన్ని అందచేయనున్నారు.

ఈ కార్యక్రమం అమలుకు సంవత్సరానికి సుమారు రూ.4 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. అందుకనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే మొబైల్ అంగన్‌వాడీ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఈ సందర్భంగా పోషకాహార సేవలు అర్హులందరికి అందాలని, సాంకేతిక సమస్యలతో ఏవరూ నష్టపోకూడదన్న లక్షానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి సీతక్క తెలిపారు.

# ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు చెల్లించాలి

## ఏప్రిల్, మే నెలల్లో సాధారణ బదలీలు పూర్తి చేయాలి

## గెజిటెడ్ అధికారుల సంఘం వినతి

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** ఉద్యోగులకు అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం(టీజీవోసీఏ) రాష్ట్ర సర్కార్‌కు విజ్ఞప్తి చేసింది. డిమాండ్ చేసింది. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సాధారణ బదిలీలను ఏప్రిల్, మే నెలల్లో పూర్తి చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు వీటికి సంబంధించి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుకు వినతి పత్రం అందజేసినట్లు గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, బి.శ్యామ్ తెలిపారు. రెండో వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ నివేదిక గడువు ముగిసి 22 నెలలు దాటిపోయిందని తెలిపారు. అలాగే 42శాతం ఫిట్‌మెంట్, 2024 జనవరి 1 నుంచి 2025 జూలై 1 వరకు బకాయి ఉన్న నాలుగు విడతల డీఏలు విడుదల చేయాలని కోరింది. ఇందుకు గాను 2026-27 బడ్జెట్‌లో పీఆర్సీ అమలుకు నిధులు కేటాయించాలని ఉపముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. గత ఆరేళ్లుగా ఎదురు చూస్తున్న ఉద్యోగుల కోసం బదిలీల ప్రక్రియను ప్రారంభించాలని, ఏప్రిల్, మే నెలల్లో బదిలీలు పూర్తిచేయాలని కోరారు. గతంలో 40 శాతం పరిమితి విధించడం వల్ల చాలా మంది బదిలీలకు దూరమయ్యారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.



శ్రీలక్ష్మీ నరసింహస్వామి అఖండ జ్యోతి రథయాత్ర వివరాలను వెల్లడిస్తున్న యాత్ర కమిటీ ఛైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి, పడాల శ్రీకాంత్ తదితరులు

# 15న లక్ష్మీనరసింహస్వామి అఖండజ్యోతి రథయాత్ర

## యాత్ర కమిటీ ఛైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** శ్రీలక్ష్మీ నరసింహస్వామి 32వ అఖండ జ్యోతి రథయాత్ర ఈ నెల 15న హైదరాబాద్, బర్కత్‌పురలోని యాదాద్రి భవన్ నుంచి ప్రారంభమవుతుందని యాత్ర కమిటీ ఛైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం బర్కత్‌పురలోని యాదాద్రి భవన్‌లో అఖండ జ్యోతి రథయాత్ర కమిటీ సలహాదారులు పడాల శ్రీకాంత్, అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి బొమ్మల సుదీష్‌కుమార్‌తో కలిసి సద్ది వెంకట్‌రెడ్డి యాత్ర ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15న ఆదివారం బర్కత్‌పుర యాదాద్రి భవన్ నుండి రథయాత్ర ప్రారంభమై 18న యాదగిరిగుట్టకు చేరుకుని అఖండజ్యోతిని ఆలయంలో అందించడం జరుగు తుందని తెలిపారు. 15న రథయాత్ర ప్రారంభమై బర్కత్‌పుర, చిక్కడపల్లి, విద్యానగర్, అడిక్‌మెట్, తార్నాక, హబ్సిగూడ, ఉప్పల్ వరకు చేరుకొని అక్కడ విడిది చేస్తుందన్నారు. 16న ఉప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి, నారపల్లి, అన్నోజిగూడ, శివారెడ్డిగూడెం, ఘట్కేసర్ వరకు 17న ఘట్కేసర్, కొండ మడుగు, బీబీనగర్, గూడూరు, పగిడిపల్లి, భువనగిరి వరకు 18న భువనగిరి, రాయగిరి, వడాయిగూడెం మీదుగా యాదగిరి గుట్టకు రథయాత్ర చేరుకుం టుందన్నారు. రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కంభం అనిల్‌కుమార్‌రెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహా మూర్తి, ఆలయ ఇఒ జె.భవానిశంకర్, నగరిగారి ప్రీతమ్‌కుమార్ తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భవన్ మేనేజర్ రామ కోటేష్, యాత్ర రథసారథి ఎ.గణపతి, ఎ.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వాలెంటైన్స్‌డేను అడ్డుకుంటాం

## ప్రకటించిన భజరంగ్‌దళ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** వాలెంటైన్స్ డే పేరుతో కార్పొరేట్ శక్తులు చేసే వ్యాపారాలను అడ్డుకుంటామని భజరంగ్‌దళ్ హెచ్చరించింది. ఈ మేరకు ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాశ్చాత్య సంస్కృతి అయిన వాలెంటైన్స్ డేను దేశ యువత బహిష్కరించాలని పిలుపునిచ్చారు. పుల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన జావన్‌లకు శ్రద్ధాంజలిగా ప్రతిఏటా వీరజవాన్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 13న కోఠిలోని ఆంధ్రాబ్యాంకు చౌరస్తాలో జవాన్లకు నివాళులు అర్పిస్తామన్నారు. యువత సైనికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.



ప్రసంగిస్తున్న తెలంగాణ జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత

## ఉద్యమకారులను పట్టించుకోకపోవడం వల్లే

# కెసిఆర్‌కు ఓటమి

## తెలంగాణ అస్తిత్వం కోసం కచ్చితంగా పార్టీ స్థాపిస్తా

## ఆత్మగౌరవ సభలో కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ (చిక్కడపల్లి) ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనాన్ని సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా తండ్రి, మాజీ సీఎం కేసీఆర్‌పై, బిఆర్ఎస్ పార్టీపై ఆమె నేరుగా విమర్శలు గుప్పించడం చర్చనీయాంశంగా మారింది. రేవంత్ సర్కార్‌పై కూడా విమర్శలు చేసారు. మరోవైపు త్వరలోనే తెలంగాణ అస్తిత్వం, ఉద్యమ ఆకాంక్షల కోసం కచ్చితంగా రాజకీయ పార్టీని స్థాపిస్తానని కవిత స్పష్టం చేశారు. తమ పార్టీ పేరులో 'తెలంగాణ' ఉంటుందని, ఒక ఉద్యమ శక్తిగా పని చేస్తుందని తెలిపారు. గురువారం బాగ్ లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమ కారుల ఆత్మగౌరవ సభ జరిగింది.

ఈ సభలో కల్వకుంట్ల కవిత మాజీ సీఎం, తన తండ్రి కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. ఉద్యమకారులను పట్టించుకోలేదు కాబట్టే ఆ పెద్ద మనిషి అధికారం కోల్పోయారంటూ బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్‌ని పరోక్షంగా విమర్శించారు. గత పాలకులు అహంకారంతో వ్యవహరించడం వల్లే ఓడిపోయారని పరోక్షంగా కేసీఆర్‌ను విమర్శించారు. కేసీఆర్ హయాంలో ధర్నా చౌక్‌ను ఎత్తివేయడం, సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం వంటి చర్యల ద్వారా ప్రజాస్వా మ్యాన్ని కాలరాశారని మండిపడ్డారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సైతం ఉద్యమకారులు బంగ్లా నుంచి బయటకు లాగే రోజు వస్తుందని జోస్యం చెప్పారు. తెలంగాణ సంక్షేమ బోర్డును వెంటనే ప్రకటించాలని, ప్రైవేట్ ఉద్యోగాల్లో ఉద్యమ కారుల బిడ్డలకు 25 శాతం కోటా కల్పించాలని డిమాండ్ చేసారు.

# ఎన్నికల సిబ్బంది రెమ్యునరేషన్ పెంచాలి

## రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు సిపిఎస్ యూనియన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది రెమ్యునరేషన్ పెంచాలని తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, సెక్రెటరీ లింగ్యా నాయక్‌కి తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్ రావు కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. ఈ నెల 11న జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో ప్రిసైడింగ్ ఆఫీసర్(పివో) ఓపివోతోపాటు పోలింగ్ సిబ్బందికి 2023లో జారీచేసిన జి.ఓ ప్రకారం రెమ్యునరేషన్ ఇవ్వడం చాలా తక్కువగా ఉన్నాయని, వాటిని సమీక్ష చేసి,రెండు రోజుల శిక్షణ, రెండు రోజుల పోలింగ్ విధులు చేసిన పివోలకు రూ.4,000 అదేవిధంగా ఓ.పి.ఓ లకు రూ. 2,000 రెమ్యునరేషన్ ఇవ్వాలన్నారు. ఇక ముందు జరిగే ఎన్నికల కేంద్రాల్లో మహిళ ఉద్యోగ, ఉపాధ్యాయిలకు సరైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ అధికారులు స్పందించి దానిపై సంబంధిత శాఖకు సమీక్షకు పంపిస్తామని చెప్పారని స్థితప్రజ్ఞ తెలిపారు.

# విభిన్న కళారంగాల కృషీవలుడు కె.వి.రమణాచారి



డా. కె.వి.రమణాచారిని సత్కరిస్తున్న సుఖేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, శంకర్, వెంకటరెడ్డి తదితరులు

## శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఫిబ్రవరి 12 , ప్రభాతవార్త :** తెలుగు రాష్ట్రాల్లో విభిన్న కళా సాహిత్య సాంస్కృతిక రంగాల కళాసేవకుడు, కృషీవలుడు డా. కె.వి.రమణా చారి అని అని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శ్లాఘించారు. ఒక ఐఎస్ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వాల్లోని వివిధ ముఖ్యమంత్రుల వద్ద సన్నిహితుడుగా ప్రజాసేవలు అందించి విశ్రాంత ఐఎస్ అధికారిగా అందరు కళాకారులు, కళలకే జీవితాన్ని అంకితంచేసి విశేషసేవలందిస్తున్న కళామతల్లి ముద్దుబిడ్డ, కళాకారుల కనిపించే దైవంగా నిత్యస్మరణీ యుడుగా నిలిచారన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షోపన్యాసంలో డా. కె.వి.రమణాచారి అందరు కళాకారుల గుండెల్లో స్థానం పొందినది అనితరసాధ్యమన్నారు. రమణాచారి ఉద్యోగి, సాంస్కృతిక కళాప్రియుడుగానే కాకుండా సాహిత్యవేత్తగా పద్యకవిత్వం వస్తువైవిధ్యం అనే పేరుమీద పరిశోధనచేసి డాక్టరేట్ పొందారని గుర్తుచేశారు. పద్యం వ్రాయడం కూడా సులువేనని తద్వారా చెప్పారని, అతనొక అరుదైన సాహిత్య కళాకారుడు, కళాప్రేమికుడు, ఐఎస్ అధికారని కొనియాడారు. తన జన్మదినాన్ని బుర్రకథ గానంతో బుర్రకథ వింటూ జరుపుకోవడమూ విశేషమేనని అన్నారు. తెలంగాణ బుఱ్ఱకథ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో గురువారం రాత్రి జరిగిన డా. కె.వి.రమణాచారి 75వ జన్మదిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన గుత్తా సుఖేందర్‌రెడ్డి గౌరవ అతిథులు డా. ఏనుగు నరసింహారెడ్డి, ఓయు తెలుగుశాఖ పూర్వాధ్యక్షుడు డా. కసిరెడ్డి వెంకటరెడ్డి, సంఘం అధ్యక్షుడు బండిరాజుల శంకర్, ప్రధాన కార్యదర్శి సాలం కృష్ణయ్య, పోరెడ్డి రంగయ్య తదితరులతో కలిసి డా. కె.వి.రమణాచారి ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కసిరెడ్డి వెంకటరెడ్డి, బండిరాజుల శంకర్ తదితరులు మాట్లాడారు.

## ఉగాదికి సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభం

### 1,000 పడకల సామర్థ్యంతో నిర్మాణం

### పనులపై మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని పేదలకు పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్‌ను ఉగాది పండుగ రోజున ప్రారంభించి ప్రజలకు అంకితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈలోగా సివిల్ పనులు, ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టలేషన్ అన్నీ పూర్తి చేసి, హాస్పిటల్‌లో వైద్య సేవలు అందించేందుకు సిద్ధం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీస్‌లో టిమ్స్ సనత్‌నగర్ పనుల పురోగతి, డాక్టర్లు, సిబ్బంది నియామకంపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి పాల్గొన్నారు. ఓపీ రూమ్‌లు, డయాగ్నస్టిక్స్, ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్లు, వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూలు ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. 1000 బెడ్ల కెపాసిటీతో నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్‌లో మౌలిక వసతుల కల్పన తుది దశకు చేరుకుందని అధికారులు మంత్రికి వివరించారు.

## సింగరేణి సిఎండిగా బాధ్యతలు స్వీకరించిన బుద్ధప్రకాశ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** సింగరేణి సిఎండిగా సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ బాధ్యతలు స్వీకరించారు.



ప్రస్తుతం ఆ సంస్థ అదనపు బాధ్యతల్లో ఉన్న డి.కృష్ణ భాస్కర్ స్థానంలో బుద్ధ ప్రకాశ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. 2002 బ్యాచ్‌కు చెందిన బుద్ధప్రకాశ్ గతంలో ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి, రవాణా శాఖ కమిషనర్‌తో పాటు, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్, భద్రాచలం ఐటిడిఏ పీఓ కూడా బాధ్యతలు నిర్వహించారు. వైద్య విద్యను అభ్యసించిన ఆయన పరిపాలనా రంగంలో తనదైన ముద్ర వేశారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించే తీరిక సిఎంకు లేదా? హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 12:** రాష్ట్రంలో ప్రతిరోజూ ఏదో ఒక పాఠశాలలో భోజనంలో కల్తీ జరిగి అస్వస్థతపాలవుతున్న విద్యార్థులపై విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష చేసే తీరికలేకపోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి, బీఆర్ఎస్‌ఎల్పీ ఉప నేత హరీశ్ రావు ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా నారాయణ్ ఖేడ్ మండలం ఎస్సీ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు కల్తీ ఆహారం మాకొద్దు అంటూ రోడ్డెక్కిన విషయం, హైదరాబాద్ నడిగడ్డపై ఉన్న ఉస్మానియా యూనివర్సిటీలో భోజనం బాగుండటం లేదని విద్యార్థులు నిరసనలకు దిగిన ట్వీట్‌పై ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం గాలి మోటార్లలో చక్కర్లు కొట్టే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, గురుకులాల్లో నెలకొన్న అధ్వాన్న పరిస్థితులపై సమీక్షించే తీరిక లేకపోవడం విచారకరమన్నారు. ఉస్మానియాకు వెళ్లి రిబ్బన్లు కట్ చేయడం కాదు రెండున్నరేండ్లుగా చేసిన అభివృద్ధి ఏముంది? అని ప్రశ్నించారు. మాటలు కోటలు దాటితే ఆచరణ గడప దాటది అనడానికి ముఖ్యమంత్రి పర్ఫెక్ట్ ఉదాహరణ అని ఎద్దేవ చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసమే అంటూ ఇప్పటి వరకు 62 సార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి సాధించిందేమిటో మొన్నటి కేంద్ర బడ్జెట్ తోనే తేటతెల్లమైందని విమర్శించారు.

## రాహుల్‌గాంధీతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 12:** తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో బిజీ బిజీగా ఉన్నారు. గురువారం మొదట పలువు రు కేంద్ర మంత్రు లతో భేటీ అయిన సీఎం రేవం త్‌రెడ్డి అనంతరం ఏఐసిసి పెద్దలను కలిశారు. ఏఐసిసి అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని మర్యాదపూర్వకంగా కలి శారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ ఎంపీ కేసీ వేణుగోపాల్‌ను కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో మున్సిపల్ ఎన్ని కలు, రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులపై కేసీ వేణుగోపాల్, రేవం త్‌రెడ్డి చర్చించారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు తిరుగులేదని, మున్సి పాలి టీల్లో అత్యధిక స్థానాలను గెలుస్తున్నామని వివరించినట్లు సమాచారం.

## నమీబియాను ఉతికి ఆరేసిన టీమిండియా

### 93 పరుగుల తేడాతో భారత్ జట్టు గెలుపు

### ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా హార్దిక్ పాండ్యా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** పొట్టి ప్రపంచకప్‌లో యూఎస్‌ఏపై స్వల్ప తేడాతో నెగ్గిన భారత్ రెండో మ్యాచ్‌లో పంజా విసిరింది. పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు రెడీ అంటూ టాప్ గేర్ ఆటతో నమీబియాను చిత్తు చేసింది. ఓపెనర్ ఇషాన్ కిషన్(61) ఊచకోతకు, హార్దిక్ పాండ్యా(52)లు చెలరేగిపోయారు. ప్రత్యర్థికి 210 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన టీమిండియా 93 పరుగుల తేడాతో గెలుపొందింది. భారీ ఛేదనలో ఓపెనర్లు దూకుడుగా ఆడినా వరుణ్ చక్రవర్తి(37) ఒకే ఓవర్లో రెండు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బకొట్టాడు. చివరి బ్యాటర్ గ్రీన్ షాట్ ఆడబోగా వికెట్లకు తాకడంతో టీమిండియా పొట్టి కప్‌లో వరుసగా పదో విజయం నమోదు చేసింది. టాపార్డర్ ముఖ్యంగా ఓపెనర్ ఇషాన్ కిషన్(61) నమీబియాపై పిడుగల్లే విరుచుకుపడగా హార్దిక్ పాండ్యా(52) విధ్వంసంతో జట్టుకు కొండంత స్కోర్ అందించాడు. అనంతరం బంతితో వరుణ్ చక్రవర్తి(37) మ్యాజిక్ చేయగా ప్రత్యర్థి బ్యాటర్లు క్రీజులో నిలవలేకపోయారు. బ్యాటుతో మెరిసి, రెండు వికెట్లు తీసిన పాండ్యా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. 93 పరుగుల విజయంతో ఆదివారం పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు మేము రెఢీ అని హెచ్చరికలు పంపింది టీమిండియా. టీమిండియా నిర్దేశించిన భారీ ఛేదనను నమీబియా ఓపెనర్లు దూకుడుతో ఆరంభించారు. లోరెన్ స్టీన్‌కాంప్(29), జన్ ఫ్రైలింక్(22)లు భారత పేసర్లను ఒత్తిడిలో పడేస్తూ బౌండరీలతో చెలరేగారు. ఈ జోడీని అర్ష్‌దీప్ సింగ్(136) విడదీసి తొలి బ్రేకిచ్చాడు. వరుణ్ చక్రవర్తి మలుపు తిప్పాడు. 10వ ఓవర్లో రెండు వికెట్లు తీసి నమీబియాను కష్టాల్లోకి నెట్టాడు. తర్వాత ఓవర్లో కెప్టెన్ ఎరాస్మస్ (18) ఔటయ్యాడు. అక్షర్ పటేల్ ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన అతడు ఈసారి మరోషాట్‌కు యత్నించి తిలక్ వర్మ చేతికి చిక్కాడు. 88కే ఐదు వికెట్లు పడ్డాయి. బుమ్రా డైవింగ్ క్యాచ్‌తో మలన్ కుర్గర్(5)ను పెవిలియన్ పంపగా అప్పటికే నమీబియా ఓటమి ఖాయమైంది. రూబెన్ ట్రంపుల్‌మన్(6)ను బుమ్రా బౌల్డ్ చేయగా హార్దిక్ తన చివరి ఓవర్లో వరుసగా ఇద్దరిని ఔట్ చేసి హ్యాట్రిక్‌పై నిలిచాడు. చివరి బ్యాటర్ గ్రీన్ షాట్ ఆడబోగా వికెట్లకు తాకడంతో టీమిండియా పొట్టి కప్‌లో వరుసగా పదో విజయం నమోదు చేసింది. ఈ ఎడిషన్‌లో రెండో విజయంతో సూర్యకుమార్ సేన గ్రూప్ ఏ పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. పొట్టి ప్రపంచకప్ ఆరంభ పోరులో తేలిపోయిన భారత బ్యాటర్లు నమీబియాపై చెలరేగిపోయారు. ఓపెనర్ ఇషాన్ కిషన్(61) తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగి ప్రత్యర్థి బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాడు. అర్ధశతకంతో భారీస్కోర్‌కు పునాది వేసిన ఇషాన్ ఔట్‌కాగానే మిడిలార్డర్ అతడిని అనుసరించారు. చివరిలో హార్దిక్ పాండ్యా(52), శివం దూబే(23)లు తమ స్టయిల్ బ్యాటింగ్‌తో ఫినిషింగ్ టచ్ ఇచ్చారు. ఆఖరి రెండు ఓవర్లలో నాలుగు వికెట్లు పడడంతో 208కే టీమిండియా పరిమితమైంది. కాగా ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా హార్దిక్ పాండ్యా నిలిచాడు.

# 'మూసీ'కి 100 ఎకరాలివ్వండి

### 'గాంధీ సరోవర్' శంకుస్థాపనకు రండి

### రక్షణమంత్రి రాజ్‌నాథ్‌ను కోరిన సీఎం రేవంత్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి12:** మూసీ పునరుజ్జీవం.. రైలు మార్గాల మంజూరు... విమానాశ్రయాల పనులు వేగవంతమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది.. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడులతో గురువారం ముఖ్యమంత్రి వరుసగా భేటీ అయ్యారు. ఆయా ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు, భూ బదలాయింపులు.. నిధుల మంజూరును కోరుతూనే రాష్ట్ర ప్రభుత్వపరంగా ఇవ్వనున్నమద్దతు, భూ కేటాయింపులను కేంద్ర మంత్రులకు సీఎం వివరించారు. ఈసా... మూసీ నదుల సంగమ స్థలిలో ప్రపంచస్థాయి విద్యా సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ కేంద్రంగా నిర్మించనున్నగాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. కేంద్ర మంత్రితో సౌత్ బ్లాక్‌లోని ఆయన కార్యాలయంలో ముఖ్యమంత్రి గురువారం భేటీ అయ్యారు. సుస్థిర పట్టణాభివృద్ధి లక్ష్యాలతో పర్యావరణ హితంగా, స్వచ్ఛమైన నీటితో నది ప్రవహించేలా మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపడుతున్నట్లు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన 100 ఎకరాల రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈసా... మూసీ నదుల సంగమ స్థలిలో 1948లో జాతిపిత మహాత్మా గాంధీ చితభస్మాన్ని నిమజ్జనం చేసిన బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు సీఎం తెలియజేశారు. గాంధీజీ ఆశయాలైన శాంతి, ఐక్యత, సుస్థిరాభివృద్ధి, నిరాడంబర జీవనశైలిని అద్దం పట్టేలా గాంధీ సరోవర్ ప్రాజెక్టును నిర్మించనున్నట్లు కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టును ప్రపంచస్థాయి విద్యా, సాంస్కృతిక, ఆధ్యాత్మక, పర్యావరణ కేంద్రంగా నిలుపుతామని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో శాంతి చిహ్నం, జాతీయ మ్యూజియం, విజ్ఞాన కేంద్రం, చేనేత ప్రోత్సాహక కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ కు ఫిబ్రవరి నెలాఖరులో చేసే శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమానికి హాజరుకావాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీ కృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాసరాజు, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

**కేంద్ర నిధులతో కృష్ణా-వికారాబాద్ రైలు మార్గం నిర్మించండి: రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు విజ్ఞప్తి**

కృష్ణా-వికారాబాద్ రైలు మార్గాన్ని పూర్తిగా కేంద్ర నిధులతో చేపట్టాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ వ్యయాన్ని మొత్తాన్ని తామే భరిస్తామని ఇప్పటికే తెలియజేసిన విషయాన్ని సీఎం కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం భేటీ అయ్యారు. ఈ మార్గంలోని టేకల్‌కోడ్ లో లైమ్ స్టోన్ నిక్షేపాలను గుర్తించామని, సిమెంట్,జౌళి పరిశ్రమల కేంద్రంగా దానిని అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు సీఎం కేంద్ర మంత్రికి తెలియజేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంతో పాటు కర్ణాటకలోని పలు సిమెంట్ పరిశ్రమలకు సమీపంలో కృష్ణా ప్రాంతం ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. కొడంగల్, టేకల్‌కోడ్, దౌల్తాబాద్‌లను పారిశ్రామిక జోన్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం వివరించారు. హైదరాబాద్‌చెన్నై (778 కి.మీ.), హైదరాబాద్‌బెంగళూర్ (586 కి.మీ.), హైదరాబాద్‌పుణే (556 కి.మీ.) హైస్పీడ్ రైలు కారిడార్లకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ సమీపంలో 500 ఎకరాల స్థలం కేటాయిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు తెలియజేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న శంషాబాద్ నుంచే హైస్పీడ్ రైలు మార్గాలని ప్రారంభించాలని సీఎం సూచించారు. హైదరాబాద్‌చెన్నై హైస్పీడ్ కారిడార్ అమరావతి మీదుగా వెళుతుందని, అక్కడి నుంచి బందరు పోర్టుకు రైలు మార్గం మంజూరు చేయాలని కోరారు. దాంతో డ్రైపోర్ట్ నుంచి బందరు పోర్టుకు సరకు రవాణా వేగవంతం అవుతుందని వివరించారు. హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌పుణే హైస్పీడ్ కారిడార్లు శంషాబాద్ నుంచే మొదలు పెడితే అది ట్రై జంక్షన్ అవుతుందని సీఎం రైల్వే మంత్రికి వివరించారు.

ఈ మూడు కారిడార్లకు భూ సేకరణ వెంటనే చేపట్టి పనులు ప్రారంభించాలని రైల్వే శాఖ మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలత వ్యక్తం చేశారు. పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాస రాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, కేంద్ర పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

**అంతర్జాతీయ ప్రమాణాలతో మమూనురు ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించాలి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు విజ్ఞప్తి**

తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ కు సమీపంలో నిర్మించనున్న మామూనూరు ఎయిర్‌పోర్ట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం భేటీ అయ్యారు. మామూనూరు ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణ పూర్తయినందున వెంటనే పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. మామూనూరు ఎయిర్‌పోర్ట్‌లో కార్గో సేవలతో పాటు మెయింటెనెన్స్.. ఓవర్ హాల్ రిపేర్ (ఎంఓఆర్) సదుపాయాలు ఉండేలా చూడాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. జౌళి, ఇతర పరిశ్రమలతో వరంగల్ నగరం పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని, వరంగల్‌కు దగ్గరలో రెండేళ్లకోకసారి ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్కసారలమ్మ జాతర మేడారంలో జరుగుతుందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ ఉమ్మడి వరంగల్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు కేంద్రంగా ఉంటుందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు.

మామూనూరు నుంచి సాధ్యమైనంత త్వరగా విమాన రాకపోకలు సాగేలా పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. మామూనూరు ఎయిర్‌పోర్ట్ పనుల ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను అక్కడకు పంపిస్తానని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హామీ ఇచ్చారు.

# వివిధ రాష్ట్రాల స్టాళ్ల నిర్వాహకులకు అవార్డులు

### జాతీయస్థాయిలో ఎగ్జిబిషన్ సొసైటీకి ఎంతో పేరుంది: మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్ (గోషామహాల్), ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనలో భాగంగా నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వ హిస్తున్న 85వ ఎగ్జిబిషన్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులను ప్రదర్శించిన స్టాళ్ల నిర్వాహకులకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అవార్డులను అందచేశారు. గురువారం గాంధీ సెంటనరీ హాల్ నిర్వహించిన అవార్డుల ప్రదానం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగ్జిబిషన్ సొసైటి ద్వారా నుమాయిష్ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ నేడు భారత దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఉన్న ఉత్పత్తులను అమ్మకాలు చేయడం ద్వారా సొసైటీకి, హైదరాబాద్ నగరానికే గర్వకారణ మన్నారు. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు ఎంతోమంది వ్యాపారులు ఇక్కడి వస్తారన్నారు. భవిష్యత్తు తరాలకు అందమైన నగరాన్ని ఏర్పాటు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళిక రూపొందించార న్నారు. 30వేల మంది విద్యార్థినులకు ఈ సొసైటీ ద్వారా విద్యను అందించడం జరుగుతుందన్నారు. నుమా యిష్‌తో వచ్చే ఆదాయంతో పాఠశాల, కళాశాల విద్యసంస్థలను నడువడం గొప్ప విషయమన్నారు. 10 వేల మంది సొసైటీ ద్వారా ఉపాధి పొందు తున్నట్లు వివరించారు. ప్రతియేటా జనవరిలో జరిగే ఎగ్జిబిషన్ ద్వారా అన్ని కులాలు, మతాలకు చెందిన బడా వ్యాపారులను, చిరువ్యాపారుల వరకు ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. 46 రోజుల పాటు ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఎగ్జిబిషన్‌లో రకం కాల వస్తువులు అందుబాటులో ఉంటా యన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాసంస్థల విద్యార్థి నులకు విద్యా భోధనలను అందిస్తూ సమాజంలో గుర్తింపు వచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు.కాగా గోల్డ్ మెడల్స్‌తోపాటు ప్రశంసాపత్రాలను అందచేశారు. నుమాయిస్‌లో సంద ర్శకులకు ఉత్తమ సేవలు అందించిన స్టాల్స్ నిర్వాహకులు, పోలీ సు, ట్రాఫిక్, విద్యుత్, ఆర్అండ్‌బి, ఇతర శాఖల అధికారులు, సిబ్బందికి బహు మతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటి కార్య దర్శి బి.ఎన్.రాజేశ్వర్, ఉపాధ్యక్షులు ఆర్.సుఖేష్‌రెడ్డి, చంద్రశేఖర్, ఎన్. సంజీవకుమార్, సొసైటీ సభ్యులు బి.హన్‌మంత్‌రావు పి.హరి నాథ్‌రెడ్డి, కన్వీనర్ బి.అనురాధ, బి.ప్రభాశంకర్, ఎన్.వినయ్‌కుమార్, సురేం దర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవార్డులను అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, హాస్టల్ సౌకర్యాల్లో రాజీ పడొద్దు

### ముందస్తు బడ్జెట్ కేటాయింపులపై అధికారులతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) గిరిజన(ఎస్టీ) గురు కులాలు, వసతి గృహాలలని విద్యార్థులకు కల్పించే సౌకర్యాలపై ఎట్టిపరిస్థితిల్లోనూ రాజీ పడొద్దని అధికారులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆదేశించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, గిరిజన సంక్షేమం శాఖల ఉన్నతాధికారులతో బడ్జెట్ ప్రతిపాదనలపై షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్‌ల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న వసతి గృహాలలో వసతులు, మరమ్మతులు, రవాణా సౌకర్యం తదితర సదుపాయాలకు సంబంధించిన ప్రతిపాదనలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నిధుల కొరత లేదని వసతుల కోసం ఎంత బడ్జెట్ నైనా కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులను అత్యున్నత స్థాయికి తీసుకురావాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృఢ సంకల్ప మన్నా రు. అందుకు అవసర మైన సదుపాయాలను అధికారులు ఎప్పటి కప్పుడు పర్య వేక్షించాలని మం త్రి ఆదేశించారు. హాస్టల్ విద్యార్థుల సంక్షే మం కోసం గత బడ్జెట్‌లో హాస్టల్ విద్యార్థుల పథకా ల అమలుకు ప్రభుత్వం కేటాయించిన నిధుల అమలు తీరుపై ఒక నివేదికను రూపొందించి సమర్పించాలని ఉన్నతా ధికారులను మంత్రి ఆదేశించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫ్రీ మెట్రిక్ ఉపకార వేతనాలను పెంచామని, విద్యాబోధనలో అసమానతలను తొలగించేందుకు ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని మంత్రి గుర్తు చేశారు.



## 44 వేలకుపైగా జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు

### ప్రక్రియ మరింత పారదర్శకంగా అర్హులందరికీ న్యాయం:మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి12:** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్.ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్‌వో జి. మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ.252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు.అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు.

గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు. 2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న 24 పత్రికలకు 17,784 కార్డులు, 25,001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390,అదేవిధంగా 15,001 నుంచి 25,000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661, 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు.

అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు.ఇందులో రాష్ట్ర, జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ, మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

## హైదరాబాద్‌లో ఎగిరేది గులాబీ జెండానే

### బిఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు, ఆహ్వానించిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి12:** హైదరాబాద్ మహానగరంలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఒకటి కాదు, ఎన్ని కార్పొరేషన్లు చేసినా ఎగిరేది మాత్రం ఖచ్చితంగా గులాబీ జెండానేనని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్‌కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం తెలంగాణ భవన్‌లో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కార్య కర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యేలు పోయినా పార్టీ వెన్నెముక కార్యకర్తలే అని, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా, కార్యకర్తలు మాత్రం చెక్కుచెదరకుండా కెసిఆర్ నాయ కత్వంలోనే ఉన్నారని కెటిఆర్ ప్రశంసించారు. మొత్తం హైదరాబాద్‌లోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచిందని తెలిపారు. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వెళ్లినా, బంగారం వంటి కొత్త నాయ కులు వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని, శేరిలింగంపల్లిలోని 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా బిఆర్ఎస్‌కు ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతిలో వైకుంఠం చూపి అధికారం దక్కించుకుందని కెటిఆర్ విమర్శించారు.

## ఎటిఎంలో డబ్బు నింపే వాహనంతో డ్రైవర్ పరార్

### రూ.57లక్షలతో ఉడాయించాడు

### ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టిన పోలీసులు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** ఎటిఎంలో డబ్బు నింపేందుకు వాహనంతో పాటు వచ్చిన డ్రైవర్ తెలివిగా సిబ్బందికి మస్కా కొట్టి వాహనం, వాహనంలో ఉన్న డబ్బుతో ఉడాయించాడు. యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలో డబ్బు నింపేందుకు వచ్చిన సిబ్బంది ఏటీఎం లోపల ఉండగా, సెక్యూరిటీ గార్డు కళ్లుగప్పి వాహనంలో ఉన్న 57 లక్షల రూపాయల డబ్బుతో వ్యాన్ డ్రైవర్ పరారయ్యాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపన్ పల్లిలో సంఘటన చోటుచేసుకోగా, వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు గోపన్‌పల్లికి కొద్ది దూరంలో వ్యాన్‌ను గుర్తించారు. కాగా అందులో ఉన్న నగదును తీసుకొని, డ్రైవర్ పరారు కాగా, నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. తిరుమల గిరిలోని సిఖ్‌రోడ్డుకు చెందిన బడిగే అజిత్‌కుమార్ అలియాస్ శివ గత 6 నెలలుగా సంఘం సెక్యూరిటీ సొల్యూషన్స్‌లో పనిచేస్తూ యాక్సిస్ బ్యాంకులో డబ్బు నింపే సీఎంఎస్ వ్యాన్‌కు డ్రైవర్‌గా కొనసాగుతున్నాడు. కాగా శుక్రవారం సికింద్రాబాద్ బ్రాంచ్ నుంచి టిఎస్10యూడి 0393 వ్యాన్‌లో డ్రైవర్ అజిత్‌కుమార్ వాహనం నడుపుతుండగా, కస్టోడియన్లు ఎస్.రామక్రిష్ణ, ఎండి.మాలిక్, సెక్యూరిటీ గార్డు పెరుమాళ్లలు బయలుదేరారు. వీరు మొత్తం 9 ఏటీఎంలలో డబ్బు నింపాల్సి ఉండగా, సాయంత్రం వరకు 8 ఏటీఎంలలో డబ్బు నింపారు. చివరిదైన గోపన్‌పల్లి ఏటీఎంలో డబ్బు నింపేందుకు సాయంత్రం 5 గంటల ప్రాంతంలో గోపన్‌పల్లికి వచ్చారు. కాగా కస్టోడియన్లు రామక్రిష్ణ, మాలిక్‌లు వ్యాన్ దిగి ఏటీఎం లోపలికి వెళ్లగా, సెక్యూరిటీ గార్డు పెరుమాళ్లు వాష్ రూమ్ కోసం వ్యాన్ నుంచి బయటకు వచ్చాడు. ఇదే సమయంలో వ్యాన్‌లో ఒంటరిగా ఉన్న డ్రైవర్ అజిత్‌కుమార్ వ్యాన్‌తో సహా అక్కడి నుంచి ఉడాయించాడు. వ్యాన్ లోపల ఏటీఎంలో నింపాల్సిన దాదాపు 57 లక్షల నగదు ఉంది. గోపన్‌పల్లి నుంచి సీఎంఎస్ వ్యాన్‌తో సహా పారిపోయిన అజిత్‌కుమార్ పక్కనే ఉన్న తెల్లాపూర్ వరకు వెళ్లి అక్కడ వ్యాన్ వదిలిపెట్టి, అందులో ఉన్న 57 లక్షల నగదుతో పారిపోయాడు. డ్రైవర్ పారిపోయిన విషయం తెలుసుకున్న కస్టోడియన్లు వెంటనే గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేయగా, పోలీసులు అప్రమత్తమై గాలింపు చేపట్టారు. వ్యాన్‌ను తెల్లాపూర్ వద్ద పోలీసులు కనుగొన్నారు. అందులో ఉండాల్సిన డబ్బుతో డ్రైవర్ పారిపోయాడు. దీంతో పోలీసులు ప్రత్యేక బృందాలతో డ్రైవర్ కోసం గాలింపు చేపట్టారు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



నిందితుడు అజిత్‌కుమార్

## సార్వత్రిక సమ్మెతో

# తిరుపతిలో కదం తొక్కిన కార్మికులు



**తిరుపతి,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా తిరుపతిలో కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మె విజయవంతమైంది. ఈ సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన వేలాదిమంది కార్మికులు గురువారం ఉదయం అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడనుండి రైల్వే స్టేషన్ ,కర్నాలవీధి, బేరి వీధి, గాంధీ రోడ్డు, తిలక్ రోడ్డు మీదుగా పాత మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మిక చట్టాలను రక్షించాలని.. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని.. మోడీ నిరంకుశ విధానాలపై కార్మికులు నినదించారు. బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రకాష్ బాబు మాట్లాడుతూ స్వాతంత్రానికి ముందు బ్రిటిష్ పాలకులు ఆమోదించిన కార్మిక చట్టాలను నరేంద్ర మోడీ కాలరాస్తున్నారని విమర్శించారు. 29 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చడం దారుణం అన్నారు. మోడీ అనుసరి స్తు న్న కార్మిక వ్యతిరేక విధానాలపై నేడు సార్వత్రిక సమ్మెలో దేశవ్యాప్తంగా కోట్లాదిమంది కార్మికులు రోడ్లపైకి వచ్చి ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే దేశంలో మొట్టమొదటిసారిగా పాండిచ్చేరిలో కార్మిక నాయకుడు సుబ్బయ్య నేతృత్వంలో ఎనిమిది గంటల పని విధానానికి పోరాడి సాధించారని అన్నారు.

నేడు రైతాంగం దివాలా తీస్తోందని రైతులు కార్మికులను కేంద్రం కట్టు బానిసలుగా చూస్తోందని విమర్శించారు. రాజ్యాంగం గాన్ని అంచలంచలుగా తగ్గించి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరులో గాంధీని తొలగించారని, స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు కనబడకుండా చేసి ఘాడ్సే లాంటి వారిని తెర ముందుకు తీసుకువస్తున్నారని విమర్శించారు. డేరా బాబా లాంటివారు అరెస్టు అయితే వెంటనే బెయిల్ మంజూరు అవుతుందని..

వరవరరావు లాంటివారు అరెస్టు అయితే బెయిల్ రావడం ఎద్దేవ చేశారు. సిటి యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరికృష్ణ ,,ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి కె రాధాకృష్ణ , మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ,ఏఐటియూసి నాయకులు ఎన్ డి. రవి, శివ, సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, సిఐటియు నాయకులు జయచంద్ర, వేణుగోపాల్, ఐఎఫ్టియు నాయకులు వెంకటరత్నం, ఐ ఎన్ టి యు సి నాయకులు రత్నకుమార్, వైయస్సార్సీపి టి యు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల పేరిట బెదిరింపు లేఖలపై కేసు నమోదు

**గుంటూరు ఫిబ్రవరి 12 ప్రభాత వార్త ప్రతినిధి:** ఏపీలో నలుగురు మంత్రులకు మావోయిస్టుల పేరిట బెదిరింపు లేఖలు రావడం తీవ్ర కలకలం రేపింది. మంత్రులు కందుల దుర్గేశ్, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్‌కు ఈ లేఖలు వచ్చాయి.మీ జీవితం ప్రమాదంలో వుందని, మీతోపాటు మీ కుటుంబ సభ్యుల పైన త్వరలోనే దాడి జరుగుతుందని, 7981777325 ఫోన్ నంబర్ ఈ లేఖల్లో ఉంది. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం చిరునామాతో లేఖలు పంపారు. ఈ అంశంపై ఏపీ అసెంబ్లీ లాబీ వద్ద బుధవారం మంత్రి కందుల దుర్గేష్ మీడియాతో మాట్లాడుతూ.. తనతోపాటు ముగ్గురు మంత్రులకు పోస్టు ద్వారా లేఖలు వచ్చినట్టు చెప్పారు. మావోయిస్టుల పేరిట వచ్చిన లేఖలు చూసి కుటుంబసభ్యులు ఆందోళన చెందినట్టు వెల్లడించారు. వ్యక్తిగతంగా, శాఖపరంగా తాము ఎలాంటి తప్పులు చేయలేదని పేర్కొన్నారు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే ఈ లేఖలు రాసి ఉంటారని అనుమానం వ్యక్తంచేశారు. అయితే ఈ బెదిరింపు లేఖపై తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో మంత్రి దుర్గేష్ కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదు పై తుళ్ళూరు పోలీసులు 37/2026 గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో మంత్రులకు బెదిరింపు లేఖలు రావడం చర్చనీయాంశమైంది.

# శ్రీశైల మల్లన్న చెంత భక్త జనసందోహం

# నల్లమల్ల నడకదారులన్నీ శివ నామస్మరణం



నడక దారుల్లో వస్తున్న భక్తులు

**శ్రీశైలంప్రాజెక్టు,ఫిబ్రవరి12,ప్రభాతవార్త** శివ నామస్మరణం నల్లమల్ల నడక మార్గం అంతా మారుమ్రోగుతుంది. ఓం నమ:శివయా, ఓం నమ:శివయా అంటూ జనసంద్రం శ్రీశైలం మల్లన్న చెంతకు తండోపా తండాలుగా భక్త జనసందోహం తరలివస్తున్నారు. భక్తి పారవశ్యంతో అలరారుతోంది. శ్రీస్వామిఅమ్మవార్ల ఉభయ దేవాలయాలను కనువిందు చేసే విధంగా పుష్పాలతో ముస్తాబు చేసారు. చికటి పడితే మల్లన్న క్షేత్రం విధ్యుత్ కాంతులతో మిరుమిట్లు గోలుపుతుంది. నల్లమల్ల నడకదారులన్ని శివ నామస్మరణంతో ప్రజ్వరిల్లు తున్నాయి. ఇల కైలాసమైన శ్రీగిరి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలు వైభవంగా కొనసాగుతున్నాయి. హార హార మహదేవా శంభో శంకరా అన్న నినాదంతో పరుగుపరుగున క్షేత్రంకు చేరుకుంటున్నారు. నడక దారి మార్గలన్ని భక్తుల కోలహాలంతో కనువిందు చేస్తున్నాయి. ఈ నడక దారులన్ని దాతలచే అన్నప్రసాద వితరణ జరుగుతుంటే, దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన వైద్యశిబిరాలు, ఉచిత మంచీనీరు, తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసింది. మండుటేండను సైతం లెక్కచేయకుండా వెంకటాపురం నుండి నట్టడవి మొట్ల మార్గన మల్లన్నను మనస్సులో స్మరించుకుంటూ కైలాసద్వారం వద్దకు చేరుకుంటున్నారు. అక్కడికి చేరుకున్న భక్తులకు సేద తీరేందుకు చలువ పందిళ్లు, అన్నప్రసాద వితరణ, మంచినీటి సౌకర్యం, వైద్య శిబిరాలు, అత్యవసర సమయాలకు అంబులేన్స్ లు తదితర వంటివి ఏర్పాట్లు గావించారు. ఈ నడక దారులన్ని చిన్న, పెద్ద, ముసలి, ముతక అనే తేడా లేకుండా మల్లన్న నీ దర్శన భాగ్యం కోరకు తరలివస్తున్నామని నీ చెంతకు చేరుకోగానే మమ్మల్ని పిల్లపాపాలతో చల్లగా దీవించుస్వామి అంటూ వేడుకుంటున్నారు. మల్లన్న వద్దకు చేరుకున్న భక్తాదులకు సలక సౌకర్యాలను ఏర్పాటు చేసి అనువైన దర్శన బాగ్యం కల్పించడం దేవస్థానం తీసుకోంది. శ్రీశైలక్షేత్రం నలుచేరుగుల భక్తులతో కిక్కిరిసిపోతున్నాయి. శివ మాలలో వచ్చిన స్వాములు శివదీక్ష శిబిరాలకు చేరుకోని ఇరుముడిని సమర్పిస్తున్నారు. శివస్వాములకు తగిన సమయంలో దర్శనం కల్పిస్తుండడంతో వారు పునితులౌవుతున్నారు. ఈక్రమంలోనే మరికొందరు భక్తులు పాతళగంగకు చేరుకోని పుణ్యస్నానాలు అచరించి తమ మ్రొక్కులను తీర్చుకుంటున్నారు. దర్శనం క్యూలై న్లన్ని భక్త సంద్రంతో కిటకిటాలాడు తున్నాయి.



# దేవుడిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయొద్దు: సిపిఐ నారాయణ

**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీజరిగిన మాట వాస్తవమేనని, ఆ దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఐ జాతీయనేత డాక్టర్ కె.నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ పాపంలో తప్పుచేసిన అధికారులను, పాత ఇఒను వదిలేయకూడదని చెప్పారు. రాజకీయ లబ్ధికోసమే అధికార, ప్రతిపక్షపార్టీలు లడ్డూ విషయంపై రాద్ధాంతం చేస్తున్నాయని, దేవుడిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. రాజకీయ లబ్ధికోసం కోట్లాదిమంది భక్తులను మనోవేదనకు గురి చేయొద్దని ఆయన కోరారు. ఇందుకు సంబంధించి ఈ కేసులో సుప్రీంకోర్టు విచారణ చేస్తోందని, ఈ సమయంలో రాజకీయ నేతలు లడ్డూపై మాట్లాడటం ఆపేయాలని సూచించారు. ఎవరిరాజకీయాల కోసం వాళ్ళు కావాలంటే కొట్టుకోండని, అయితే దేవుడిని మాత్రం లాగొద్దని ,లడ్డూ వివాదంపై అనవసర చర్చ ఆపి భక్తుల మనోభావాలను కాపాడండి అని నారాయణ ఘాటుగా స్పందించారు. కల్తీ ప్రసాదంతో సిఎం చంద్రబాబునాయుడు స్వామి ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. గత ఐదేళ్ళలో రసాయనాలతో తయారైన కల్తీ నెయ్యితో లడ్డూల తయారుచేయించారని ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రసవత్తరంగా సాగిన ప్రశ్నోత్తరాలు

## పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటి ప్రతిపాదన లేదన్న మంత్రి లోకేష్

**విజయవాడ.ఫిబ్రవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గురువారం రెండో రోజు ప్రారంభమయ్యాయి. సభలో పలు ఆసక్తికర అంశాలు చోటు చేసుకున్నాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ కార్యక్రమం రసవత్తరంగా సాగింది. పుట్టపర్తిలో ఐఐఐటీ ఏర్పాటుపై ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రశ్న లేవనెత్తారు. ఒంగోలు ఐఐఐటీ తాత్కాలిక క్యాంపస్ వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇడుపులపాయ, ఒంగోలు మధ్య విద్యార్థులు తిరగాల్సి వస్తోందని, ఇది తీవ్ర ఇబ్బందికరంగా ఉందని ఎమ్మెల్యే వివరించారు. ఎమ్మెల్యే సింధూర రెడ్డి ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానం ఇచ్చారు. పుట్టపర్తిలో ఐఐఐటీ ఏర్పాటు ప్రతిపాదన లేదని మంత్రి స్పష్టం చేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో అక్రమాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సభలో ప్రస్తావించారు. సరైన అనుమతులు లేకుండానే కొందరు కాలేజీలు పెడుతున్నారని ఎమ్మెల్యే బత్తుల ఆరోపించారు. దీనిపై మంత్రి లోకేశ్ సమాధామిస్తూ.. అక్రమాలపై వివరాలు తెలియజేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏయే కాలేజీలకు అనుమతులు ఇచ్చారనే దానిపై తన దృష్టికి తీసుకురావాలని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. పుత్తూరు పురపాలక సంస్థ ఛైర్మన్‌పై తప్పుడు కుల ధ్రువీకరణ ఆరోపణలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. పుత్తూరు పురపాలక సంస్థ ఛైర్మన్‌ను ఇప్పటికే తొలగించినట్లు మంత్రి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే భాను ప్రకాశ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో స్థానిక ఎన్నికలు ఎలా జరిగాయో అదరికీ తెలుసని.. తప్పుడు సర్టిఫికెట్లతో పదవులు పొందారని తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక వ్యవస్థలను కూడా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. రిజర్వ్ స్థానాలను కూడా గత ప్రభుత్వం కాజేసిందని ఆరోపిస్తూ.. దీనిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారా అని ఎమ్మెల్యే భాను ప్రకాశ్ ప్రశ్నించారు. దీనిపై మంత్రి నారాయణ సమాధానం ఇస్తూ.. జీవో 135లో అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినట్లు తెలిపారు. సభ్యులు అడిగినట్లు అదనపు చర్యలు ఏమి తీసుకోవచ్చో పరిశీలిస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. విజయవాడలోని సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని పాయకాపురం ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ ఇంటర్మీడియట్ కాలేజీని డిగ్రీ కాలేజీ వరకు అప్ గ్రేడ్ చేయాలి. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇక్కడే మొదటిసారి ప్రవేశ పెట్టడం జరిగింది. సుమారు రూ.15కోట్ల వ్యయంతో అదనపు బిల్డింగ్ నిర్మాణం ఖర్చు చేయడం ద్వారా డిగ్రీ కాలేజి పూర్తి అవుతుంది. ఎందుకంటే అనేకమంది పేదలు, ఆటో కార్మికులు, తాపీ కూలీలు ఈ నియోజవర్గంలో ఉన్నారు. ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేదు. ఆడపిల్లలు డిగ్రీ కాలేజీలో చదువుకోసం నగరంలోని వేరొక ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తున్నది. చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఇంటర్మీడియట్ కాలేజీ విద్యార్థులు ఆదుకోవడానికి, కాలేజీ చుట్టూతా ప్రహరీ గోడ, మిగిలిన వాటి నిమిత్తం మంత్రి లోకేష్ 20లక్షలు కేటాయించగా, సంవత్సరం పొడువునా ఆ గోడ నిర్మాణం జరిగి ఇటీవల పూర్తి చేశారు. ప్రక్కన బీసీ సంక్షేమ హాస్టల్ ఉంది. హాస్టల్కు కూడా నిధులు కేటాయించాలి. జగ్గయ్యపేట నియోజకవర్గంలో తీవ్రంగా నెలకొన్న సాగునీటి సమస్యపై ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ శాసనసభలో జీరో అవర్ సందర్భంగా గళం విప్పారు. బోనకల్లు బ్రాంచ్ కాల్వ పరిధిలోని వత్సవాయి, వీర్లపాడు, నందిగామ మండలాలకు చెందిన వేలాది ఎకరాల భూములు పూర్తిగా ఈ కాల్వపైనే ఆధారపడి ఉన్నాయని, అయితే అవసరమైన స్థాయిలో నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. బోనకల్లు బ్రాంచ్ కాల్వ సామర్థం 1350 క్యూసెక్కులు కాగా,

ప్రస్తుతం కేవలం 900 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో బోనకల్లు మం డలం దాటిన తర్వాత కాల్వలో నీరు ముందుకు వెళ్లడం లేదని, వత్సవాయి మండలానికి 30 క్యూసెక్కులకు మించి నీరు రావడం లేదని తెలిపారు.

# టిడిపి ఎమ్మెల్యే కొలకపూడికి పల్లా శ్రీనివాస్ తీవ్ర హెచ్చరికలు

**విజయవాడ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్‌తో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సమావేశమయ్యారు. అసెంబ్లీ లాబీలో కొలికపూడితో ఆయన మాట్లాడారు. కొలికపూడి వ్యవహార శైలిపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాలుగా ఆయనకు పల్లా తీవ్ర హెచ్చరికలు చేశారు. పార్టీ లేకపోతే వ్యక్తిగతంగా జీరో అనే విషయాన్ని గుర్తించి ప్రవర్తించాలని హితవు పలికారు. పార్టీ క్రమశిక్షణ దాటి ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకునేందుకు సీఎం సిద్దంగా లేరన్నారు. ఎన్నిసార్లు మందలించినా పద్ధతి మార్చుకోకుండా తప్పుల మీద తప్పులు చేస్తే పార్టీ ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తుందని పల్లా శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వంచే పట్టువస్త్రాల సమర్పణ



**శ్రీశైలం ప్రాజెక్టు ఫిబ్రవరి 12, ప్రభాత వార్త.** మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం నాడు సాయంకాలం రాష్ట్ర ప్రభుత్వం తరుపున రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, స్థానిక శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డితో కలిసి శ్రీస్వామిఅమ్మ వార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సమర్పణ కార్యక్రమంలో దేవదాయ కమిషనరు, కె. రామచంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎస్.ఎస్. చంద్రశేఖర ఆజాద్ , ధర్మకర్తల అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు వారు పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమములో ముందుగా ఆలయ రాజగోపురం వద్ద వస్త్ర సమర్పణ సంకల్పం, వస్త్రాలకు పూజాదికాలు మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మంత్రి మరియు స్థానిక శాసనసభ్యుల మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేసి ప్రదక్షిణ పూర్వకంగా స్వామిఅమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. కాగా ఎంతో చారిత్రక ప్రసిద్ధి పొందిన శ్రీశైలక్షేత్రంలో ఎందరో చక్రవర్తులు, రాజులు, రాజకుటుంబీకులు మొదలైన వారు ఆయా ఉత్సవ సందర్భాలలో శ్రీ స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించేవారని ప్రతీతి. ఈ సంప్రదాయాన్ని అనుసరించే రాష్ట్ర ప్రభుత్వం ఏటా మహాశివరాత్రి మరియు దసరా మహోత్సవాలలోనూ శ్రీ స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను అనవాయితీగా సమర్పిస్తోంది.

# ఎమ్మెల్యేలతో మంత్రి లోకేష్ డిన్నర్ మీటింగ్‌లు

**విజయవాడ,ఫిబ్రవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** పార్టీ బలోపేతం విషయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ వినూత్న పంథా ఎంచుకున్నారు. పార్టీని గ్రౌండ్ లెవల్ నుంచి బలోపేతం చేసేందుకు సరికొత్త వ్యూహాలకు పదును పెడుతున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ..ఎమ్మెల్యేలు, క్యాడర్‌కు మరింత దగ్గరయ్యేలా డిన్నర్ మీటింగ్స్ కు శ్రీకారం చుట్టారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా..ఆత్మీయ వాతావరణంలో ప్రతి రోజూ ఏడుగురు ఎమ్మెల్యేలతో భోజనం చేస్తూ..వారి మనోగతాలు తెలుసుకుంటున్నారు. ఈ నిర్ణయం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సహాన్ని నింపుతోంది. ఈ సమావేశాల్లో ప్రధానంగా నియోజకవర్గాల అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఎమ్మెల్యేలను ఆరా తీస్తున్నారు నారా లోకేష్. జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తూ, వారి వ్యక్తిగత యోగక్షేమాలతో పాటు స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. సమస్య ఏదైనా ఉంటే వెంటనే పరిష్కరించేలా అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. కేవలం ఆఫీసు గోడల మధ్య కాకుండా, డైనింగ్ టేబుల్‌పై సాగే చర్చల వల్ల ఎమ్మెల్యేలతో ఎమోషనల్ బాండింగ్ ఏర్పడుతుందని లోకేష్ భావిస్తున్నారు. మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిపై లోకేష్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. అనుభవం లేక కొంతమంది చేస్తున్న చిన్నపాటి పొరపాట్లను సరిదిద్దేందుకు ఈ వేదికను వాడుకుంటున్నారు. వార్నింగ్, గదమాయింపులు కాకుండా.. ఓ ఫ్రెండ్‌లా, ఓ మెంటార్‌లా పాలనపై అవగాహన కల్పిస్తున్నారు. హైకమాండ్‌కు, యువ ఎమ్మెల్యేలకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, వారిలో ఆత్మవిశ్వాసం పెంచడం ద్వారా పార్టీకి క్రమశిక్షణ కలిగిన నాయకత్వాన్ని అందించడమే ఈ సమావేశాల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. టెక్నాలజీని వాడుకుంటూ డాష్ బోర్డుల ద్వారా డెవలప్‌మెంట్‌ను పర్యవేక్షి ంచడమే కాదు.. క్షేత్రస్థాయిలో మనుషులతో మమేకమవ్వడం తన శైలి అని లోకేష్ నిరూపిస్తున్నారు. సీనియర్లకు సముచిత గౌరవం ఇస్తూనే, యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్న తీరు పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని కలిగిస్తోంది. ఈ డిన్నర్ మీటింగ్స్ ద్వారా ఆయన వేస్తున్న అడుగులు అటు పార్టీ ఐక్యతను, ఇటు ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# తిరుమల సమాచారం

## తిరుమలనుండి శ్రీనివాసమంగాపురానికి లక్ష్మీకాసులహారం



**తిరుమల, ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామిబ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి గరుడ సేవలో స్వామివారికి అలంకరించేందుకు లక్ష్మీకాసుల హారం ఊరేగింపు జరిగింది. గురువారం మధ్యాహ్నం శ్రీవారి లక్ష్మీకాసులహారం శోభాయాత్ర టిటిడి పరిపాలన భవనం వద్ద నుండి వైభవంగా ప్రారంభమైంది. టిటిడి అదనపు ఇఒ తల పై కాసులహారం పెట్టుకుని తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, టిటిడి జెఇఒలు వి. వీరబ్రహ్మం, డాక్టర్ ఎ. శరత్, సివిఎస్ఒ కె. వి. మురళీకృష్ణ పాల్గొన్నారు. టిటిడి స్థానిక ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న క్రమంలో తిరుమల శ్రీవారి ఆలయం నుంచి గరుడసేవకుకల్యాణ వేంకటేశ్వరస్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన లక్ష్మీకాసుల హారాన్ని అలంకరించేందుకు ఊరేగింపుగా తీసుకెళుతున్నట్లు తెలిపారు. టిటిడి నుండి దాదాపు 6.40 కోట్లు రూపాయలు విలువగల నాలుగుకిలోల డైమండ్ మోపుగల ఆరు పేటల బంగారు యజ్ఞోపవీతము స్వామి వారికి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు జి.భానుప్రకాశ్ రెడ్డి, పనబాక లక్ష్మీ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఇఒవరలక్ష్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అధికార నందివాహనంపై సోమస్కందుడు



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి అధికార నందివాహనంపై కపిలేశ్వరుడు భక్తులకు అభయమిచ్చాడు. ఆద్యంత రహితుడైన శివదేవుడు ఐశ్వర్యసూచికమైన నందిని అధిష్ఠించినపుడు దర్శనం చేసుకోవడం భక్తులకు పుణ్యం. ఆలయ మాఢ పురవీధుల్లో భక్తుల భజనలు, కోలాటలు ముందు వాహనసేవ జరిగింది. గురువారం ఉదయం బ్రహ్మోత్సవాల్లో సోమస్కంధమూర్తి బంగారుతిరుచ్చిపై కామాక్షి అమ్మవారితో కలసి ఊరేగారు.

## ఎస్వీగోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న ట్రస్ట్‌ల్లో ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు దాత 10లక్షలు రూపాయలు విరాళం అందించారు. తిరుపతికి చెందిన బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ కుమారుడు కుప్పాల నీలేశ్ కుమార్ 10,00,116 రూపాయలు డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.

## శ్రీవారి ఆశీస్సులకు ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డి



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవారి దర్శనార్థం రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సొల్ల బొజ్జిరెడ్డి గురువారం రాత్రి తిరుమలకు వచ్చారు. ఆయనకు వసతికల్పన విభాగం ఒఎస్‌డి సత్రానాయక్ స్వాగతం పలికారు. నేటి ఉదయం దేవుని దర్శనం చేసుకోనున్నారు.

## తిరుమలలో తెలంగాణ డిసిఎం భట్టి

### - నేటి ఉదయం శ్రీవారి దర్శనం



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం సాయంత్రం తిరుమలకు వచ్చారు. పద్మావతి అతిథిగృహం వద్ద వసతికల్పన విభాగం ఒఎస్‌డి సత్రానాయక్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. రాత్రికి తిరుమలలోనే బసచేస్తున్న భట్టి నేటి ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. తెలంగాణాలో ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించాలని, తెలంగాణ ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేసే శక్తిని కాంగ్రెస్ ప్రభుత్వానికి కలగజేయాలని వేడుకోనున్నారు.

## శ్రీవారి ఆశీస్సులు కోరిన తమిళనాడు మాజీ సిఎం పళనిస్వామి



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తమిళనాట త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకునేందుకు గురువారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలోని వకుళమాత విశ్రాంతి భవనం వద్ద పద్మావతి వసతికల్పన విభాగం అధికారులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. రాత్రికి ఇక్కడే బసచేసి నేటి ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

## స్వామి ఆశీస్సులందుకున్న సినీదర్శకుడు రాఘవేంద్రరావు



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంక టేశ్వరస్వామి ఆశీస్సులు అందు కున్నట్లు సినీదర్శకుడు రాఘవేంద్రరావు తెలిపారు. ఇష్టదైవం దర్శనం చేసుకోవడం మనసు ఆనందంగా ఉందన్నారు. గురువారం ఉదయం ఆయన అనుచరులతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం అందజేసి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కాలంచెల్లిన భవనాలపై నిర్లక్ష్యమేనా! - టెండర్ స్థాయికి చేరినా జాప్యమే



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో పాతబడిన,కాలంచెల్లిచన వసతి గృహాల భవనాలపై టిటిడి నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎందుకనే విమర్శలు భక్తుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే తిరుమలలో పురాతన కాటేజీలను గుర్తించిన టిటిడి అధికారులు వాటి స్థానంలో కొత్తవి అధునాతనంగా నిర్మించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. అయితే అప్పట్లో టిటిడి బోర్డు లేకపోవడంతో అధికారులు దాతల సహకారంతో వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని భావించారు. మళ్ళీ ఆ ప్రతిపాదనలు ఆచరణకు రాలేదు. వసతికల్పన విభాగం అధికారులు కూడా తిరుమలలో భక్తులకు ప్రయోజనం లేని కాటేజీలను గుర్తించారు. భక్తుల నుండి వచ్చిన ఫిర్యాదులతో సుదర్శన్ ,గోవర్ధన్, కల్యాణి, సిటైప్ క్వార్టర్స్, పద్మావతిప్రాంతంలోని కొన్ని విశ్రాంతి గృహాల స్థానంలో అధునాతనంగా నిర్మించాలని నిర్ణయించారు.

# పిల్లల ఊబకాయంలో తల్లి పాత్రే ప్రధానం



పిల్లల్లో ఊబకాయానికి, తల్లిదండ్రుల జన్యువులూ ఒక కారణమేనన్నది తెలిసిన విషయమే. కానీ పిల్లల బరువులో ముఖ్యంగా ఊబకాయంలో తల్లి పాత్ర ప్రధానంగా ఉంటోందని అంటోంది యూనివర్సిటీ కాలేజీ లండన్ చేసిన ఓ అధ్యయనం. తల్లిదండ్రుల జన్యువులూ, బరువూ, వారి ఆహారపు అలవాట్లూ, పిల్లల బరువునీ, ఆహారపు అలవాట్లనీ ఎలా ప్రభావితం చేస్తాయో తెలుసుకునేందుకు మూడువేల కుటుంబాలపైన ఒక పరిశోధన చేశారు. తల్లిదండ్రుల జన్యు వివరాలనీ, పిల్లలు పుట్టినప్పట్నుంచీ పదిహేడేళ్లు వచ్చేంతవరకూ వారి బరువునీ వివిధ దశల్లో విశ్లేషించారు. ఈ క్రమంలో తండ్రి బరువు కన్నా, తల్లి గర్భిణిగా ఉన్నప్పటి బరువూ, గర్భం దాల్చడానికి ముందు ఉన్న బరువూ, అలాగే ఆమె ఆహారపు అలవాట్లూ, పిల్లలకు మూడేళ్లు వచ్చేంతవరకూ ఇంట్లో పాటించే ఆహార నియమాలే పిల్లల బరువుని నిర్ధారిస్తాయని ఈ పరిశోధనలో తేలింది. అంతేకాదు చదువుకున్న తల్లులకు పుట్టిన పిల్లల్లో కన్నా పెద్దగా చదువుకోని తల్లులకు పుట్టిన పిల్లలు బరువు ఎక్కువగా ఉండటాన్ని కూడా గమనించారు అంటే జన్యువులతో పాటు తల్లులు పాటించే చక్కని ఆహారపు అలవాట్లే పిల్లల భవిష్యత్ బరువుని నిర్ధారిస్తాయన్న మాట.

# ఐడ్రాప్స్‌తో కంటిచూపు మెరుగు



కళ్లు మన శరీరంలో అత్యంత ముఖ్యమైన ఇంద్రియాంగాలలో ఒకటి. ఇవి వెలుతురును గ్రహించి, మెదడుకు సంకేతాలు పంపి మనకు చూడగల శక్తిని ఇస్తాయి. నలభైఐదేళ్లు దాటితే కంటి చూపులో మార్పులు రావడం మొదలవుతాయి. చిన్న అక్షరాలు స్పష్టంగా కనిపించవు. పట్టిపట్టి చదివితే తలనొప్పి మొదలవుతుంది. మరికొన్నిసార్లు అక్షరాలు అలికినట్టుగా ఉంటాయి. దీన్నే ఛత్వారం అనీ, ప్రెస్‌బయోపియా అనీ అంటారు. ప్రపంచవ్యాప్తంగా 180 కోట్ల మంది ఈ సమస్యతో బాధ పడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. వయసుతోపాటు వచ్చే ఈ సమస్యకు పరిష్కారంగా వైద్యులు ఇంతవరకూ రీడింగ్ గ్లాసెస్‌నే సూచిస్తున్నారు. అయితే ఇకపైన వాటిని వాడాల్సిన అవసరం లేకుండా లెన్జ్ థెరాప్యుటిక్స్ అనే సంస్థ అసెక్లైడిన్ అఫ్తాల్మలాజిక్ సొల్యూషన్‌ని ఉపయోగించి విజ్ పేరుతో ఐడ్రాప్స్‌ని తీసుకొచ్చింది. వీటిని రోజులో ఒక్కసారి వాడితే చాలట. డ్రాప్స్ వేసుకున్న అరగంట తర్వాత నుంచి ఎటువంటి కళ్లద్దాల అవసరం లేకుండానే పదిగంటల పాటు కళ్లు స్పష్టంగా కనిపిస్తాయట. ప్రత్యేకమైన ఈ ఔషధం కంటి పాపలోని కండరాలపైన ఒత్తిడి తీసుకొచ్చి వాటి పరిమాణం లో మార్పు తీసుకొస్తుందట. దాంతో కళ్ల దగ్గర వస్తువులని స్పష్టంగా చూడ గలుగుతాయట. అంటే ఇక వెళ్లిన ప్రతిచోటకీ కళ్లద్దాలను తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా ఐడ్రాప్స్ వేసుకొని వెళ్తే సరిపోతుందన్న మాట.

కానీ ఇలాంటి సూచనలు పాటించే ముందు ఒకసారి డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది. అలాగే చిన్న చిన్న చిట్కాలను పాటిస్తూ ఉండాలి. ప్రతిరోజూ పచ్చి కూరగాయలు, క్యారెట్, పాలకూర వంటి ఆహారం తీసుకోవాలి. ఎక్కువ సేపు మొబైల్, కంప్యూటర్ చూడకూడదు.

ప్రతి 20 నిమిషాలకు ఒకసారి 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్లు చూడాలి. కంటి పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలి. కళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి.

# ఓర్పుతోనే సాధ్యం

మనిషి జీవితంలో ఎదగాలంటే ఎంతో చాకచక్యంగా ప్రవర్తించాల్సి ఉంటుంది. ఈ లోకంలో ఎందరో ఎన్నో విధాలుగా నడుచుకుంటూ వుంటారు. అన్నీ మనకు నచ్చక పోవచ్చు. ఒక్కోసారి వారి మీద మనకు కోపం వస్తుంది కూడాను. మనసులో పుట్టిన కోపాన్ని పాముకుబుసంలా వదలిపెట్టాలి. ఆ స్థితి రావాలంటే అంత సులువు కాదు. అయితే ప్రయత్నిస్తే అసాధ్యం కాదు. మనభారత, రామాయణాల్లో ఎన్నో పాత్రలు మనకు సహనాన్ని, సంయమనాన్ని ఎలా అలవర్చుకోవాలో నేర్పాయి. ధర్మరాజు ఏ విధంగా కష్ట సమయాల్లో సంయమనం పాటించాడో మనకు అర్థం అవుతుంది. ముఖ్యంగా హనుమంతుడు సీతాన్వేషణలో సముద్రాన్ని దాటే సమయంలో సురస అనే అతిభయంకర రాక్షసి అడ్డగించి నపుడే సంయమాన్ని పాటించి, ప్రవర్తించిన తీరు, ఆయన సహనానికి నిదర్శనం గా నిలిచింది. ఇక సీతమ్మను రాక్షస స్త్రీలు ఎంతగా వేధించినా, ఎన్ని మాటలు అన్నా వారిని ఓర్పుతో భరించి, రాముడి కోసం ఎదురు చూసింది. మానవులు ఎన్నో రకాల ఆభరణాలు ధరిస్తారు. అలంకారంగా వాటిని కోరుకుంటారు. సామాన్యులైనవారు భూషణాలుగా అంగీకరించి ఆనందిస్తారు. కానీ ఉత్తములైనవారు మాత్రం ఓర్పును భూషణంగా ధరిస్తారు. ఈ విషయాన్ని విదురుడు మహాభారతంలో చెప్పుకొచ్చారు. ప్రపంచంలోని దేశాలు ఓర్పుతో నిగ్రహంతో వేచివుండి సమస్యలకు పరిష్కారం ఆలోచిస్తే ఎన్నో యుద్ధాలను అరికట్టవచ్చు.

– డా॥ పులివర్తి కృష్ణమూర్తి

# ఉద్యోగం వచ్చిందని తొందరపడొద్దు..





ప్రస్తుతం అమ్మాయిలు ఉన్నత చదువులు చదువుతున్నారు. చదువుతో పాటే మంచి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నారు. కష్టపడితే ఫలితం ఉంటుందన్నట్లు కెరీర్ కోసం ముందుగానే ఒక ప్రణాళికతో అడుగు వేస్తే విజయంతో పాటు ఫలితమూ దక్కుతుంది. అయితే అందుకు ఎంతో కృషి కూడా అవసరమే. చదువు పూర్తవగానే ఉద్యోగం వస్తే ఆ సంతోషం ఎంతో గొప్పగా ఉంటుంది. ఎందుకంటే అప్పటికి అంతగా బాధ్యతలు ఉండవు. వయసు కూడా తక్కువే ఉంటుంది కాబట్టి, ఉత్సాహంగా ఉంటుంది. గొప్ప విజయం సాధించినంత ఆనందంగా ఉంటుంది. ఇప్పుడే కాస్త జాగ్రత్తగా ఉండాలి. ఎక్కువ కష్టపడకుండానే ఉద్యోగం వచ్చిందని, అతి అంకితభావం ప్రదర్శిస్తూ అన్ని పనులు తామే పూర్తిచేస్తామన్న అత్యుత్సాహాన్ని ప్రదర్శించవద్దు. ఉద్యోగం వచ్చిందన్న సంబరంలో పార్టీలంటూ సమయాన్ని వృధా చేయవద్దు. అలా కాకుండా ఉద్యోగంలో చేరిన కొంతకాలం తరువాత కెరీర్‌ను అభివృద్ధి చేసుకునే అవకాశాలను వెతుక్కోవాలి. చేస్తున్న ఉద్యోగంలో ఉన్నత స్థాయి చేరుకునేందుకు ప్రయత్నించాలి. అప్పగించిన పనులు సకాలంలో పూర్తి చేయడం, కొత్త అవకాశాల్ని అందిపుచ్చుకోవడం రెండూ బ్యాలెన్స్ చేసుకుంటూ వ్యక్తిగత జీవితాన్ని ఆస్వాదించాలి. చిన్న వయసులో ఉద్యోగంలో చేరితే రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తూ పై వారి ప్రశంసలు పొందగలుతారు. పోటీతత్వంతో పైకెదగవచ్చు. అతి ముఖ్యమైన విషయమేమిటంటే తొందరగా ఉద్యోగం వచ్చిన చాలా మందికి ఒక రకమైన సంతోషం, సంతృప్తి ఉంటాయి. ఇందుకుకారణం ఆర్థి స్వేచ్ఛ. తాము సంపాదిస్తున్నామన్న ధీమా. అలా అని ఖర్చు పెట్టుకుంటూ పోతే భవిష్యత్తులో ప్రమాదాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. బాధ్యతలు ఎక్కువగా లేనప్పుడు పొదుపు పెద్ద మొత్తంలో చేసే వీలుంటుంది. పొదుపు, మదుపు చేసుకునే వీలుంటుంది. పైగా ముందు నుంచే సేవింగ్స్ లాంటివి చేయడం, అత్యవసర నిధి సమకూర్చుకోవడం వంటి చేస్తూ ఉంటే భవిష్యత్తుపై భరోసా ఉంటుంది. ఇలా డబ్బు నిర్వహణ బాధ్యతలు పెరిగితే కెరీర్ అభివృద్ధిపైనా దృష్టి సారించవచ్చు.

# రోజూ ఉదయం సోంపు నీళ్లు..




సోంపు జీర్ణక్రియకు చాలా మంచిది. సోంపును నీటిలో నానబెట్టి లేదా మరిగించి తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. సోంపు నీళ్లు తాగడం వల్ల గ్యాస్, అజీర్ణం, పొట్టఉబ్బరం తగ్గిస్తుంది. భోజనం తర్వాత తాగితే ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. మెటబాలిజం మెరుగుపరుస్తుంది. ఆకలి నియంత్రణలో సహాయం చేస్తుంది. శరీరంలో ఉన్న విషపదార్థాలను బయటకు పంపించడంలో సహాయపడుతుంది. హార్మోన్ల సమతుల్యతకు తోడ్పడుతుంది. సోంపులో ఉన్న విటమిన్ 'ఎ' కంటి ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మొటిమలు తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే చర్మం కాంతివంతగా మారతుంది. దగ్గు, జలుబు సమయంలో సోంపు ఉపశమనం ఇస్తుంది. రోజుకు ఒకటి, లేదా రెండు గ్లాసుల సోంపు నీళ్లు మాత్రమే తాగాలి. అధికంగా తీసుకుంటే పొట్ట సమస్యలు రావొచ్చు. ఉదయం ఖాళీ కడుపుతో తాగితే మంచిది. లేదా భోజనం తర్వాత కూడా తాగవచ్చు.

# అల్లం చారుతో అద్భుత ప్రయోజనాలు



**కావలసినవి:** కందిపప్పు– మూడు చెంచాలు, కరివేపాకు రెబ్బలు – రెండు, పసుపు– పావు చెంచా టొమాటో : ఒకటి, మిరియాలు: చెంచా, అల్లం: అంగుళమంత ముక్క, వెల్లుల్లి రెబ్బలు : ఆరు జీలక్రర: చెంచా, దనియాలు: అరచెంచా, కొత్తిమీర తరుగు: రెండు చెంచాలు, నిమ్మరసం: మూడు చెంచాలు, ఉప్పు: తగినంత. **తాలింపుకోసం:** నూనె చెంచా, ఆవాలు అరచెంచా, మెంతులు పావుచెంచా, ఎండుమిర్చి రెండు, ఇంగువ చిటికెడు, కరివేపాకు రెండు రెబ్బలు. **తయారీ విధానం:** కందిపప్పుని అరగంట ముందే నానబెట్టి ఉంచుకోవాలి. కుక్కర్‌లో కందిపప్పు, పసుపు, కరివేపాకు రెబ్బలు, టొమాటో వేసి తగినన్ని నీళ్లుపోసి నాలు గైదు విజిల్స్ రానిచ్చి మెత్తగా ఉడికించు కోవాలి. ఆ పప్పుకి అరలీటర్ నీళ్లను కలిపి వడకట్టి పలుచటి పప్పు నీళ్లని మాత్రమే తీసుకోవాలి. మిరియాలు, జీలక్రర, వెల్లుల్లి, అల్లం, దనియాల్ని కచ్చాపచ్చాగా మిక్సీ పట్టుకోవాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి పప్పు నీళ్లను సన్నమంటపైన ఉంచి, అందులో తగినంత ఉప్పు, మిక్సీ పట్టుకున్న మిరియాలు– అల్లం మిశ్రమాన్ని వేసుకొని ఒక పొంగురానివ్వాలి. స్టవ్ కట్టేసి నిమ్మరసం, కొత్తిమీర తరుగు వేసుకోవాలి. చివరగా తాలింపు వేసుకుని ఆ తాలింపు గింజలని ఈరసంలో కలుపుకుంటే అల్లం –నిమ్మకాయ చారు సిద్ధం.

# రాగి బంతులతో ఆరోగ్యం



రాగి పాత్రలోని నీరు ఆరోగ్యానికి ఎంతో మంచిది. రాగిలో సూక్ష్మ క్రిములను నశింప చేసే లక్షణాలు ఉంటాయి. రాగి పాత్రలో నీళ్ల తాగడం జీర్ణ క్రియకు సహాయపడుతుంది. రాగిలోని ఖనిజాలు ఇమ్యూనిటీని పెంచుతాయి. రాగి నీళ్ల శరీరాన్ని డిటాక్స్ చేయడంలో సహాయపడతాయని చెబుతారు. కొంత మందికి రాగి పాత్రలో ఉంచిన నీళ్లను తాగే అలవాటు ఉంటుంది. ఆ నీళ్ల బ్యాక్టీరియాని దూరం చేసి, అదనంగా మినరల్‌ని అందిస్తాయని నమ్ముతారు. ఇందుకోసం రాగి బిందెలో, కాపర్ బాటిల్స్‌లో నింపిన నీళ్ల తాగుతుంటారు. అయితే వాటిని ఎక్కడికైనా వెంట పెట్టుకొని వెళ్లడం ఇబ్బంది. అలాంటప్పుడు ఉపయోగపడేవే ఈ కాపర్ ఫ్లోటింగ్ బాల్స్. వీటిని ప్లాస్టిక్ గాజు, ఇలా మనం వాడే ఏ వాటర్ బాటిల్‌లో వేసినా చాలు, రాగిపాత్రలు అందించే ప్రయోజనాలన్నీ ఇవీ అందిస్తాయి. ఎక్కడికైనా తేలిగ్గా తీసుకెళ్లొచ్చు. శుభ్రం చేయడమూ తేలిక.

తెర

# మీ ఆశలు నిరాశ కావు



విశ్వక్ సేన్, కె.వి. అనుదీప్ కలయికలో వస్తున్న చిత్రం ఫంకీ. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. కయాదు లోహార్ కథానాయిక. ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో అని నిర్మాత సూర్య దేవర నాగ వంశీ మాట్లాడుతూ సినీ నేపథ్యంలో దర్శకుడికి, నిర్మాత కూతురికి మధ్య జరిగే క్యూట్ కామెడీ సినిమా ఇది. ప్రతి సన్నివేశం హాయిగా నవ్వుకునేలా ఉంటుంది. సినిమా చూస్తున్నంత సేపు నవ్వుతూనే ఉంటారు. ఇది అనుదీప్ సినిమా..స్కేల్ తో కొలవద్దు. నవ్వుకోవడానికి సినిమాకి రండి. అసలు నిరాశ చెందరు. థియేటర్ నుండి నవ్వుతూ బయటకు వెళ్తారు అని అన్నారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ భీమ్స్ అద్భుతమైన సంగీతం అందించారు. మామూలుగా నా సినిమాల్లో పాటలు బాగుంటాయి అంటారు. అయితే నా గత రెండు చిత్రాలలో పాటలు ఆశించిన స్థాయిలో మెప్పించలేదు. ఫంకీ సినిమాకి భీమ్స్ మంచి పాటలు ఇచ్చారు. సినిమా విడుదల తర్వాత పాటలకు ఆదరణ ఇంకా పెరుగుతుందనే నమ్మకం ఉంది. కయాదు లోహార్ మాట్లాడుతూ ట్రైలర్ ఫంకీ ఎలా ఉండబోతుందో ఇప్పటికే మీ అందరికీ అర్థమైపోయింది. సినిమాని విడుదల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాము. నేను పని చేసిన దర్శకులలో విభిన్న శైలి ఉన్న దర్శకుడు అనుదీప్. ఆయనతో వర్కింగ్ ఎక్స్పీరియన్స్ బావుంది. నా కెరీర్‌లో మొదటి కామెడీ సినిమా ఇది అని అన్నారు. దర్శకుడు అనుదీప్ కె.వి మాట్లాడుతూ కయాదు లోహార్‌కి తెలుగు రాకపోయినా.. తెలుగు డైలాగులు నేర్చుకొని చెప్పింది. కెమెరా వర్క్, భీమ్స్ సంగీతం, నవీన్ నూలి ఎడిటింగ్ సినిమాకు ఎస్సెట్. ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్. అందరిని అలరిస్తుంది అన్నారు.



# మార్చి 6న సతీ లీలావతి

లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ జంటగా నటించిన సినిమా సతీ లీలావతి. తాతినేని సత్య దర్శకత్వంలో ఈ సినిమాను నాగ మోహన్ నిర్మించారు. మార్చి 6న ఈ మూవీని విడుదల చేయబోతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ, సతీ లీలావతి మూవీని ప్రారంభించినప్పుడు నేను గర్భవతిని. కేవలం మూడు నెలల్లోనే షూటింగ్ పూర్తి చేశాను. దర్శక, నిర్మాతల సపోర్ట్ వల్లే నేను నటించగలిగాను. సప్తగిరిగారితో పని చేయడం ఆనందంగా ఉంది. దేవ్ మోహన్ నటన ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. ఇది పూర్తిగా వినోదాత్మక చిత్రం. ఈ సినిమాను చూసి పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నాను అని అన్నారు. తాతినేని సత్య మాట్లాడుతూ, కమల్ హాసన్ చేసిన సతీ లీలావతితో మాత్రం నా సినిమాని పోల్చను. అయితే అందరికీ కనెక్ట్ అయ్యేలా ఈ సినిమాను తీశాను అని చెప్పారు. పాత సతీ లీలావతి ఎంత పెద్ద హిట్ అయ్యిందో ఈ సినిమా కూడా అంత హిట్ కావాలని కోరుకుంటున్నా అని నటుడు సప్తగిరి అన్నారు.

# మేం అలాంటి బెట్స్ వేయలేం



సామిత్ పోలాడి హీరోగా నటిస్తూ సాయి కె వెన్నంతో కలిసి దర్శకత్వం వహించిన చిత్రం నిలవే. ఈ సినిమాతో శ్రేయాసి సేన్ హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. హర్ష చెముడు, సుప్రియా ఐసోలా మరో జంటగా నటిస్తున్నారు. రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సాయి కె వెన్నం ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా మాదాపూర్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. చిత్ర దర్శకుడు సాయి కె వెన్నం మాట్లాడుతూ, ముప్పై లక్షల రూపాయలలో మంచి సినిమా తీయొచ్చు. కానీ జనాల్లోకి దానిని తీసుకెళ్ళాలంటే కోట్లు ఖర్చుపెట్టాలని ఆ మధ్య ఓ దర్శకుడు అన్నారు. అలానే హీరో నాని ... కోర్ట్ సినిమా చూడండి, నచ్చకపోతే నా నెక్స్ట్ మూవీ చూడకండి అంటూ బెట్ వేశారు. కానీ మేం అలాంటి బెట్స్ వేయలేం. మా దగ్గర మంచి సినిమా వుంది. అందరి సహకారంతో దీన్ని రిలీజ్ చేస్తున్నాం. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా గారిని ఆ మధ్య కలిసినప్పుడు ఇక్కడ ఎవరూ క్రిస్టోఫర్ నోలన్ లేరు.. మన సినిమాను మనమే నమ్మాలి. నాకది వర్కవుట్ అయ్యింది. నువ్వు కూడా అదే నమ్ము అని చెప్పిన మాట నాలో స్ఫూర్తిని నింపింది అని అన్నారు. ఈ కార్యక్రమానికి గాయని సునీత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఈ మధ్య చాలా తక్కువ సినిమాల్లో చక్కటి భావోద్వే గాలను చూస్తున్నాం. అలాంటి అన్ని ఎమోషన్స్‌తో రూపు దిద్దుకున్న చిత్రమే ఇది. కాలం మారినా ఇంటెన్స్ మ్యూ జిక్ అలానే వుంటుంది. నేను ఇక్కడ వుండడానికి కారణం కూడా అదే! ఈ మూవీ నేను చూశాను. అర్థ వంతమైన సినిమా ఇది. ఈ మ్యూజికల్ లవ్ స్టోరీని థియేటర్‌లో ఆడేలా ప్రేక్షకులు తీర్పు ఇస్తారని ఆశిస్తున్నాను. క్లాసికల్ మూవీస్ సఖి, ఏ మాయే చేశావే తరహాలో ఇదీ ఆదరణ పొందుతుందని భావిస్తున్నాను. ఇందులోని పాటలు బాగున్నాయని ఒకసారి వినమని కీర వాణి గారిని కోరాను. ఆయన విని, తన వంతుగా సపోర్ట్ చేశారు అని అన్నారు. హీరోయిన్ శ్రేయాసి సేన్ మాట్లాడుతూ, తెలుగు సినిమాలో నాయికగా నటించినందుకు ఆనందంగా వుంది. ఈ మూవీ నేను అంగీకరించడానికి సంగీతమే ప్రధాన కారణం. జన్ జీ సినిమా ఇది. ఈ సినిమా చూశాక ప్రేమ మీద మంచి అభిప్రాయానికి వస్తారని నమ్ముతున్నాను అని తెలిపారు. హీరో సామిత్ పోలాడి మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి నటుడు కావాలనే కోరిక వుండేది. అందుకు మెగాస్టార్ చిరంజీవి గారే నాకు స్ఫూర్తి. యాక్షన్ మూవీస్‌లో కె.జి.ఎఫ్. ఎలాంటిదో, లవ్ స్టోరీస్‌లో నిలవే అలాంటిది అని చెప్పారు.

# 21న ఫిల్మ్ ఫేర్ ఫెస్టివల్



ప్రేక్షకులతో పాటు, సినీతారలు సైతం ఆసక్తిగా ఎదురుచూసే అవార్డుల వేడుక ఫిల్మ్ ఫేర్. 2025 సంవత్స రానికి గాను ప్రతిష్ఠాత్మక 70వ ఫిలింఫేర్ అవార్డుల సంబరానికి రంగం సిద్ధమైంది. ఈనెల 21న కరళ వేదికగా ఈ అవార్డుల ప్రదానోత్సవం గ్రాండ్‌గా జరుగనుంది. ఈ క్రమంలో ఈ ఏడాది అవార్డుల కోసం పోటీపడుతున్న తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ చిత్రాల జాబితా విడుదలైంది. 2024లో విడుదలైన సినిమాల్లో ఎంపికైన వాటికి అవార్డులు అందించనున్నారు. అవార్డుల కోసం నామినేట్ అయిన ఉత్తమ చిత్రాలు, ఉత్తమ నటులు, ఇతర టెక్నీషియన్ల వివరాలను ఫిలింఫేర్ అధికారికంగా ప్రకటించింది. తెలుగు నుంచి అత్యధికంగా పుష్ప 2, కల్కి, 35 చిన్న కథ కాదు, హనుమాన్, లక్కీ భాస్కర్ సినిమాలు అత్యధిక విభాగాల్లో పోటీ పడుతున్నాయి. ఉత్తమ దర్శకులుగా నాగ్ అశ్విన్ (కల్కి), నంద కిశోర్ (35 చిన్న కథ కాదు), ప్రశాంత్ వర్మ (హనుమాన్), సుకుమార్ (పుష్ప: ది రూరల్), వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్), యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు) ఎంపికయ్యారు. ఉత్తమ నటులుగా అల్లు అర్జున్ (పుష్ప: ది రూరల్), దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్), ఎన్టీఆర్ (దేవర), నాని (సరిపోదా శనివారం), సిద్ధూ జొన్నలగడ్డ (టిల్లు స్క్వేర్), తేజ సజ్జ (హనుమాన్) అవార్డులు అందుకోనున్నారు.





# శ్రీకాంత్ విస్సాకు ఛాన్స్

నందమూరి హీరో కళ్యాణ్ రామ్ తాజాగా ఇప్పుడు మళ్లీ రేస్‌లోకి రావడానికి సిద్ధమవుతున్నారు. ఈ సారి కూడా మరో కొత్త దర్శకుడికి ఆయన ఛాన్స్ ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే.. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ తెరకెక్కించిన పుష్ప, పుష్ప 2 చిత్రాలతో పాటు ఈ మధ్య కాలంలో చాలా చిత్రాలకు రచయితగా పనిచేసిన శ్రీకాంత్ విస్సాను కళ్యాణ్ రామ్ దర్శకుడిగా పరిచయం చేయబోతున్నట్టు తెలుస్తోంది. శ్రీకాంత్ విస్సా దర్శకత్వం వహించే సినిమా ప్రీప్రొడక్షన్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయట. అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి మూవీ నిర్మాణ భాగస్వామి ముప్పా అశోక్ వర్ధన్ ఈ సినిమాకూ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించ బోతున్నాడట.

శ్రీకాంత్ విస్సా చెప్పిన కథ కళ్యాణ్ రామ్‌కి బాగా నచ్చడంతో గత ఏడాది చివరిలోనే ప్రాజెక్ట్‌ను లాక్ చేశారని, కొద్ది రోజుల్లో అధికారిక సమాచారం వస్తుందని, ఆ వెంటనే షూటింగ్ మొదలవుతుందని తెలుస్తోంది. కళ్యాణ్ రామ్‌కు న్యూ టాలెంట్‌ను ప్రోత్సహించడం అలవాటు. నిర్మాతగా మారినప్పటి నుంచి ఆయన కొత్త దర్శకులకు అవకాశాలు ఇస్తూ వచ్చారు. అలా ఆయన ఖాతాలో కొన్ని సూపర్ హిట్ సినిమాలు చేరాయి, కొన్ని భారీ పరాజయాలు వచ్చాయి. కళ్యాణ్ రామ్ పరిచయం చేసిన డైరెక్టర్లలో చాలామంది అగ్రస్థానానికి చేరుకున్నారు. పటాస్ దర్శకుడిగా పరిచయమైన అనిల్ రావిపూడి లాంటి వాళ్లు ఏకంగా హిట్ మెషిన్‌గా మారారు. అలానే బింబిసారతో దర్శకుడిగా పరిచయమైన వశిష్ఠ ఇప్పుడు చిరంజీవితో విశ్వంభర మూవీ తెరకెక్కిస్తున్నారు. అయితే అమిగోస్, ది డెవిల్, అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి వంటి ప్రయోగాలు పెద్దగా ఫలించలేదు. దీంతో తీవ్ర నిరాశకు గురైన కళ్యాణ్ రామ్ కొంతకాలం బ్రేక్ తీసుకున్నారు.

# నేరుగా థియేటర్లలోనే



శివాజీ, లయ జంటగా నటించిన సాంప్రదాయని సుప్పిని సుద్దపూసని సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్ కావడం లేదు. నేరుగా థియేటర్లలోనే విడుదల కాబోతోందని తెలుస్తోంది. ఈ సినిమాను ఫిబ్రవరి 12న ఇది ఈటీవీ విన్‌లో డైరెక్ట్‌గా స్ట్రీమింగ్ అవుతుందని ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. కానీ అలా జరగలేదు. శివాజీ ఈ సినిమాకు నిర్మాత కూడా కావడంతో చివరి నిమిషంలో ఆయన మనసు మార్చుకున్నట్టు సమాచారం. కాస్తంత సమయం తీసుకుని, మళ్ళీ భారీగా ప్రచారం చేసి, సినిమాను మార్చి మొదటివారంలో థియేటర్లలోనే రిలీజ్ చేయాలని నిర్ణయించుకున్నారని సమాచారం. శివాజీ, లయ జంటగా నటించిన ఈ సినిమాలో రోహన్, ప్రిన్స్, అలీ, ధన్‌రాజ్, ఇమ్మాన్యూయేల్ ఇతర పాత్రలను పోషించారు. సుధీర్ శ్రీరామ్ దీనికి దర్శకత్వం వహించగా, రంజిన్ రాజ్ సంగీతం అందించారు.

# అడివి శేష్ దర్శకత్వంలో గ్రాండ్ ఎంట్రీ?



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తనయుడు అకీరా నందన్ సినీ అరంగేట్రంపై మళ్లీ చర్చ జోరందుకుంది. అకీరా ఎంట్రీ ఎప్పుడు? ఎవరి దర్శకత్వంలో? అనే ప్రశ్నలు గత కొంత కాలంగా ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇప్పుడు ఈ చర్చలో టాలెంటెడ్ హీరో/డైరెక్టర్ అడివి శేష్ పేరు వినిపించడం ఆసక్తిని మరింత పెంచుతోంది. ఇంతకుముందు అకీరాను శేఖర్ కమ్ముల పరిచయం చేయబోతున్నారనే వార్తలు వినిపించాయి. కానీ తాజాగా అడివి శేష్ అకీరా డెబ్యూ బాధ్యతలు తీసుకుంటారన్న ప్రచారం ఊపందుకుంది. అకీరాతో శేష్‌కు ఉన్న సాన్నిహిత్యం ఈ వార్తలకు బలం ఇస్తోంది. ముఖ్యంగా రైటర్స్ బ్లాక్ షార్ట్ ఫిల్మ్‌కు అకీరా సంగీతం అందించినప్పుడు శేష్ మద్దతుగా నిలిచారు. ఆ అనుబంధం ఇప్పటికీ కొనసాగుతోంది. క్షణం, గూఢచారి, మేజర్ వంటి చిత్రాలతో తనదైన ముద్ర వేసిన అడివి శేష్... అకీరా కోసం ప్రత్యేకమైన, వైవిధ్యమైన కథ సిద్ధం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. వారసుడి డెబ్యూ కాబట్టి సాధారణ కమర్షియల్ ఎంట్రీ కాకుండా, కంటెంట్ బేస్డ్ మూవీతో లాంచ్ చేయాలని పవన్ కళ్యాణ్ కూడా భావిస్తున్నారట. అయితే ఈ ప్రాజెక్ట్‌లో శేష్ దర్శకత్వం వహిస్తారా? లేక కేవలం కథ అందిస్తారా? అనే దానిపై క్లారిటీ రావాల్సి ఉంది.





# టి20 వరల్డ్ కప్‌లో శ్రీలంక జోరు

## ఒమెన్‌పై 105 రన్స్ తేడాతో సూపర్ విక్టరీ

**న్యూఢిల్లీ:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో శ్రీలంక జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. గ్రూప్ బీ లో భాగంగా పల్లెకెలె వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 105 పరుగుల తేడాతో ఒమన్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో శ్రీలంక పూర్తి ఆధిపత్యం చెలాయించగా, ఒమన్ తేలిపోయి కనీస పోటీనివ్వలేకపోయింది. ఈ విజయంతో గ్రూప్ బీ నుంచి సూపర్ 8 అవకాశాలను మెరుగుపర్చుకోగా, ఒమన్ ఇంటిబాట పట్టేందుకు సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 225 పరుగులు చేసింది. కుశాల్ మెండీస్(45 బంతుల్లో 7 ఫోర్లతో 61), పవన్ రత్నాయక(28 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 60), దసన్ షనక(20 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 50) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఒమన్ బౌలర్లలో జితెన్ రమణంది(2/41) రెండు వికెట్లు తీయగా, జయ్ ఒడెద్రా, సుఫ్యాన్ మెహమూద్ చెరో వికెట్ తీసారు. అనంతరం ఒమన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 120 పరుగులు చేయగలిగింది. మహమ్మద్ నదీమ్(56 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 53 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శ్రీలంక బౌలర్లలో దుష్మంత్ చమీరా(2/19), మహీష్ తీక్షణ(2/11) రెండేసి వికెట్లు తీయగా, దునిత్ వెల్లలేగే, దుషన్ హేమంత, కామిందు మెండీస్ తలో వికెట్ తీసారు. ఈ గెలుపుతో శ్రీలంక గ్రూప్‌బీలో టాపర్‌గా కొనసాగుతోంది.





# వరల్డ్‌కప్ అరంగేట్రంలో సంచలనం..

## అనామక ఇటలీ చేతిలో చిత్తైన నేపాల్

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ 2026లో పసికూన ఇటలీ సంచలనం సృష్టించింది. ముంబయి వేదికగా గురువారం నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చిన్న జట్టు ఇటలీ అరంగేట్రంలోనే మాతో జాగ్రత్త అనే హెచ్చరికలు పంపుతూ బోణీ కొట్టింది. గత మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను వణికించిన నేపాల్‌ను గడగడ వణికిస్తూ జయభేరి మోగించింది. ఓపెనర్ల విధ్వంసంతో 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఉఫ్‌మని ఊదేసి. మేము చెలరేగితే ఇలా ఉంటది అని చాటింది. ఊహించని ఓటమితో నేపాల్ షాక్‌లో కూరుకుపోయింది. నేపాల్ నిర్దేశించిన 124 పరుగుల లక్ష్యాన్ని ఇటలీ 12.4 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా ఛేదించింది. ఓపెనర్లు జస్టిన్ మోస్కా (60 పరుగులు), ఆంథని మోస్కా (62 పరుగులు) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. దీంతో 44 బంతులు మిగిలుండగానే ఇటలీ విజయం సాధించింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన నేపాల్ 19.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆరిఫ్ షేక్ (27 పరుగులు), రోహిత్ పౌడెల్ (23 పరుగులు), ఆసిఫ్ షేక్ (20 పరుగులు) ఫర్వాలేదనిపించారు. ఇటలీ బౌలర్లలో క్రిషన్ 3, బెన్ 2, అలీ హసన్, జస్ప్రీత్ సింగ్, సమ్సతలో 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఇదే టోర్నీలో రీసెంట్‌గా తొలి మ్యాచ్‌లో పటిష్ఠమైన ఇంగ్లాండ్‌ను ఓడించినంతపని చేసిన నేపాల్ ఈ మ్యాచ్‌లో కనీసం పోటీ ఇవ్వకపోవడం గమనార్హం. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన ఇటలీ రెండో మ్యాచ్‌తో టోర్నీలో బోణీ కొట్టింది.

### షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..

# ఐశ్వరీ ప్రపంచ రికార్డు




**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ 2026లో భారత్‌కు చెందిన షూటర్ ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ ప్రపంచ రికార్డు సాధించింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పి ఈవెంట్‌లో స్వర్ణం గెలుచుకున్నాడు. గురువారం ఢిల్లీలో జరిగిన షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్‌లో ఐశ్వర్య అద్భుత ప్రదర్శన కనపరిచాడు. రెండుసార్లు ఒలింపియన్ అయిన తోమర్, నీరజ్ కుమార్‌ను కేవలం 0.2 పాయింట్ల తేడాతో ఓడించి ఆసియా ఛాంపియన్‌గా నిలిచాడు. పోటీలో చివరి షాట్ కంటే 0.2 పాయింట్లు వెనుకబడి, తోమర్ అద్భుతమైన 10.7 పాయింట్లు సాధించి తన మొత్తం 362 పాయింట్లను ప్రపంచ రికార్డుగా నమోదు చేశాడు. నీరజ్ తన చివరి షాట్‌లో 10.3 పాయింట్లు మాత్రమే సాధించి రజతంతో సరిపెట్టుకున్నాడు. అనుభవజ్ఞుడైన అఖిల్ షెరాన్ కాంస్య పతకం కోసం మూడవ స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో అతను 343.5 స్కోరుతో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. అంతకుముందు నీరాజ్ 593 స్కోరుతో క్వాలిఫికేషన్ రౌండ్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత స్వాప్నిల్ కుసాలే ఈ ఖండాంతర పోటీలో పాల్గొనలేదు.

### ఆసియా ఫుట్‌బాల్ కప్‌లో

# భారత్ మహిళల, పురుషుల జట్లు డ్రా

**న్యూఢిల్లీ:** ఎఎఫ్‌సి అండర్17 ఆసియాకప్-2026లో భారత ఫుట్‌బాల్ జట్లు కఠినమైన పోటీలో మ్యాచ్‌లను డ్రా గా ముగించాయి. కౌలాలంపూర్‌లో గురువారం జరిగిన ఫైనల్ డ్రాలో ఎఎఫ్‌సి అండర్ 17 మహిళల ఆసియా కప్ గ్రూప్ బి లో జపాన్, ఆస్ట్రేలియా, లెబనాన్‌లతో కలిసి భారత్ జట్టు డ్రాగా ముగించింది. ఇదే సమయంలో ఎఫ్‌సి అండర్ 17 పురుషుల ఆసియా కప్ గ్రూప్ డి లో ఉజ్బెకిస్తాన్, ఆస్ట్రేలియా మరియు డిపిఆర్ కొరియాతో కలిసి ఉంది. క్వాలిఫయర్స్‌లో ఇరాన్, లెబనాన్, పాలస్తీనా, చైనీస్ తైపీలను అధిగమించి భారత్ చరిత్రలో 10వ సారి ఎఎఫ్‌సి అండర్17 ఆసియా కప్‌కు అర్హత సాధించింది. బ్లూ కోల్ట్స్ జట్టు ఆస్ట్రేలియాతో తమ ప్రచారాన్ని ప్రారంభించి, ఆ తర్వాత ఉజ్బెకిస్తాన్ మరియు డిపిఆర్ కొరియాతో తలపడుతుంది. ఉజ్బెకిస్తాన్ డిఫెండింగ్ ఛాంపియన్ కావడంతో ఈ టోర్నమెంట్‌కు స్వయంచాలకంగా అర్హత సాధించింది. గత 2025 ఎడిషన్‌లో ఆస్ట్రేలియా గ్రూప్ దశలోనే ఓడిపోయింది మరియు జోర్డాన్, భూటాన్, ఫిలిప్పీన్స్‌పై విజయాల తర్వాత 2026 టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. రెండుసార్లు మాజీ ఛాంపియన్లు అయిన డిపిఆర్ కొరియా 2025లో సెమీఫైనలిస్టులుగా నిలిచింది. తద్వారా ప్రస్తుత ఎడిషన్‌కు ఇప్పటికే అర్హత సాధించింది. గ్రూప్ ఎ లో ఆతిథ్య సౌదీ అరేబియా తజికిస్తాన్, థాయిలాండ్, మయన్మార్‌లతో డ్రా చేసుకుంది.

### టి20 వరల్డ్ కప్‌లో..

# గ్రూప్ ఆఫ్ డెత్‌లో అఫ్ఘానిస్థాన్

## సూపర్ 8 నుండి ఒమెన్, ఐర్లాండ్ ఔట్



**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచ కప్-2026లో ఆఫ్ఘనిస్తాన్ వరుసగా రెండు పరాజయాలను చవిచూసింది. దీంతో వారు సూపర్ 8 దశకు అర్హత సాధించే విషయం కష్టక్లిష్టంగా మారింది. ఇక రెండు మ్యాచ్‌లకు రెండు ఓడిన ఐర్లాండ్, ఒమన్ సూపర్ 8 రేసు నుంచి తప్పుకున్నాయి. కాగా దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో సూపర్ ఓవర్‌లో ఉత్కంఠభరితమైన ఓటమి తర్వాత ఆఫ్ఘనిస్తాన్ ప్రపంచ కప్‌కు వెళ్లే మార్గం మరింత కష్టతరంగా మారింది. కానీ సూపర్ 8 రౌండ్‌కు చేరుకోవాలనే వారి ఆశలు ఇంకా పూర్తిగా ముగియలేదు. దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోయిన తర్వాత ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడవలసి ఉంటుంది. ఆఫ్ఘన్ ఇప్పుడు వారి నికర రన్ రేట్‌ను మెరుగుపరచుకోవడానికి యుఎఇ, కెనడాతో జరిగే మిగిలిన రెండు గ్రూప్ మ్యాచ్‌లను పెద్ద తేడాతో గెలవాల్సిన పరిస్థితి తప్పనిసరి అయింది. ఆఫ్ఘనిస్తాన్ జట్టు సూపర్ 8 కి అర్హత సాధించడానికి రెండు కీలక పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మొదటి సందర్భంలో, న్యూజిలాండ్ దక్షిణాఫ్రికాను ఓడిస్తే, యుఎఇ దక్షిణాఫ్రికాను ఓడించి, కెనడా యుఎఇని ఓడిస్తే ఆఫ్ఘనిస్తాన్‌కు ఒకింత సూపర్ 8కి అవకాశాలు ఉంటాయి. ఈ సందర్భంలో న్యూజిలాండ్ గ్రూప్ డిలో అగ్రస్థానంలో ఉంటుంది. అయితే ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా 4 పాయింట్లతో సమానంగా ఉంటాయి. ఇక్కడ నిర్ణయం నికర రన్ రేట్ ఆధారంగా ఉంటుంది. దీంతో పెద్ద తేడాతో గెలిస్తే ఆఫ్ఘనిస్తాన్ తదుపరి రౌండ్‌కు టికెట్ పొందవచ్చు. రెండవ సమీకరణం న్యూజిలాండ్‌ను ఓడిస్తే, దక్షిణాఫ్రికా 8 పాయింట్లతో గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉంటుంది. ఈ సందర్భంలో, కెనడా న్యూజిలాండ్‌ను ఓడించి, ఆపై యుఎఇ కెనడాపై గెలిస్తే ఆఫ్ఘనిస్తాన్ మరియు న్యూజిలాండ్ రెండూ చెరో 4 పాయింట్లు కలిగి ఉంటాయి.

మరోసారి, సూపర్ 8కి చేరుకున్న రెండవ జట్టు నికర రన్ రేట్ ద్వారా నిర్ణయించబడుతుంది. దీనిలో ఆఫ్ఘనిస్తాన్ న్యూజిలాండ్ కంటే మెరుగైన స్థితిలో ఉండాలి. ఇక ఈ టోర్నమెంట్‌లో మూడు బలమైన జట్లను కలపడంతో దీన్ని గ్రూప్ ఆఫ్ డెత్ గా పరిగణించారు. ఈ గ్రూప్‌లో బలమైన ఆఫ్ఘనిస్తాన్, న్యూజిలాండ్ మరియు దక్షిణాఫ్రికా ఒకదానిపై ఒకటి పోటీపడుతున్నాయి. గత టీ20 ప్రపంచ కప్‌లో సెమీ ఫైనలిస్ట్ అయిన ఆఫ్ఘనిస్తాన్ ప్రస్తుతం కీలకమైన క్లిష్టపరిస్థితిని ఎదుర్కొంటోంది. రషీద్ ఖాన్, అతని బృందం తదుపరి ఈ నె 16న యుఎఇతో మరియు ఫిబ్రవరి 19న కెనడాతో తలపడనుంది.




### పురుషుల ప్రో లీగ్..

# భారత్ ఓటమి

## 3-1తో బెల్జియం విక్టరీ

**న్యూఢిల్లీ:** పురుషుల ప్రో లీగ్ 2025-26లో బెల్జియం చేతిలో భారత్ ఓటమిపాలయింది. పురుషుల ప్రో లీగ్ రూర్కెలా లెగ్‌లో బెల్జియం భారత్‌ను 3-1 తేడాతో చిత్తు చేసింది. బెల్జియం తరపున నెల్సన్ ఓనానా (23వ నిముషం), థామస్ క్రోల్స్ (53), ఆర్నో వాన్ డెస్సెల్ (57) గోల్స్ సాధించగా, భారత్ తరపున శిలానంద్ లక్రా (29) గోల్స్ చేశాడు. బెల్జియంకు 4వ నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ లభించింది, అయితే, అలెగ్జాండర్ హెండ్రిక్స్ డ్రాగ్‌ఫ్లిక్‌ను భారత తొలి రషర్ వివేక్ సాగర్ ప్రసాద్ ఆపాడు. బెల్జియం (14) మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. కానీ ఈసారి టామ్ బూన్ అడ్డుకోవడంతో లక్ష్యం నుండి తృటిలో దూరమైంది. రెండవ క్వార్టర్‌లో (21) బెల్జియంకు పెనాల్టీ కార్నర్ లభించినా భారత గోల్ కీపర్ పవన్ అలెగ్జాండర్ హెండ్రిక్స్ గోల్ చేయకుండా నిరోధించాడు. బెల్జియంకు చెందిన థామస్ క్రోల్స్ గోల్ సాధించాడు. కానీ పవన్ తన గోల్‌ను కాపాడుకోవడానికి మరో కీలకమైన సేవ్ చేశాడు. ఈ సమయంలో థామస్ బంతిని నెల్సన్ ఓనానా (23)కి పాస్ చేయడంతో అతను గోల్ చేశాడు. ఆతిథ్య జట్టు (29) మరో అద్భుతమైన దాడి చేసి పెనాల్టీ కార్నర్‌ను గెలుచు కుంది. మూడవ క్వార్టర్‌లో (38) బెల్జియం మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. జర్మన్‌ప్రీత్ సింగ్ గోల్ లైన్‌లో సేవ్ చేసి స్కోర్‌లను సమంగా ఉంచాడు. నీలకంఠ శర్మ (53) కార్తీ సెల్వమ్‌కు అద్భుతమైన పాస్ అందించినా ఫార్వర్డ్ గోల్‌పై షాట్ తీసుకోలేకపోయాడు. లూకాస్ బాల్తాజార్ బేస్‌లైన్ నుండి సర్కిల్‌లోకి సరైన పాస్‌ను ఆడాగా, థామస్ క్రోల్స్ (53) ఆధిక్యాన్ని అందించాడు. థామస్ మళ్లీ (57) బంతిని సెట్ చేసి బెల్జియంకు విజయాన్ని అందించాడు.

# నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

## నిఫ్టీ, ఐటి సూచీల్లోనే 1.62 లక్షలకోట్లు ఆవిరి





**ముంబయి, ఫిబ్రవరి 12:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. ప్రధానంగా ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగింది. కొన్ని బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్లు కనిపించినా, టెక్నాలజీ రంగంలో బలహీన సెంటిమెంట్‌ను అధిగమించలేకపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్‌ఈ సెన్సెక్స్ 558.72 పాయింట్లు నష్టపోయి 83,674.92 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 146.65 పాయింట్లు క్షీణించి 25,807.2 వద్ద ముగిసింది. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 5.51 శాతం కుప్పకూలింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురై నష్టాలు చవిచూసిన కంపెనీలుగా నిలిచాయి. ఆటో దిగ్గజం మహీంద్రా మహీంద్రా కూడా నష్టాల్లోనే ముగిసింది. మరోవైపు, మార్కెట్ బలహీనంగా ఉన్నప్పటికీ బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్), ట్రెంట్ వంటివి లాభపడి సూచీలకు కొంత మద్దతు ఇచ్చాయి. నిఫ్టీ 25,840-25,900 స్థాయిని దాటనంత వరకు స్వల్పకాలికంగా మార్కెట్ బలహీనంగానే కొనసాగిందని అంచనావేసారు. ఐటీతో పాటు రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల షేర్లు కూడా ఒత్తిడికి గురయ్యాయి. బ్రాడర్ మార్కెట్లలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాలతోనే ముగిశాయి. ప్రత్యేకించి నిఫ్టీలో ఐటి సూచీ 5.51శాతం దిగజారింది. నిఫ్టీ ఐటి కంపెనీ మొ్తం మార్కెట్ విలువలు రూ.27,32,579 కోట్లకు చేరింది. సూరుగా 1.6 లక్షలకోట్లు కంపెనీల షేర్లరూపంలో నష్టం వచ్చినట్లు తెలుస్తోంది. టిసిఎస్ 5.48శాతం 52 వారాల కనిష్టం రూ.2750కి చేరింది. ఇన్ఫోసిస్ 5.48, టెక్‌మహీంద్ర 6.40శాతం, హెచ్‌సిఎల్ టెక్, ఎంఫసిస్, విప్రో కంపెనీలు 4.5 నుంచి ఐదుశాతం చొప్పున దిగజారాయి. మొత్తం ఐటి సూచీని డేంజర్‌జోన్‌లోకి గురువారం నెట్టివేసినట్లయింది. ఒక బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.46శాతం క్షీణించింది. స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.86శాతంమేర దిగజారింది. బిఎస్‌ఇలో 1676 కంపెనీలు పెరిగితే 2530 కంపెనీలుక్షీణించాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 96.82గా కొనసాగి రూపాయి క్షీణతను కొనసాగించారు. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడిచమురు ఏప్రిల్ సెటిల్‌మెంట్లకుగాను 39 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 69.01 డాలర్లుగా మారాయి.

# జనవరి రిటైల్ ద్రవ్యోల్బణం 2.75%



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** వినియోగదారుల ధరలసూచీ ఆధారంగా నిర్ధారించే ద్రవ్యోల్బణాన్ని జనవరి నెలకుగాను 2.75శాతంగా ఉందని కేంద్ర అర్థగణాంకశాఖ పథక అమలుశాఖ వెల్లడించింది. అఖిలభారత వినియోగదారుల ఆహార ధరల సూచీ ఆధారంగా జనవరిలో 2.13శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ఉత్పత్తులధరలు 1.96శాతంపెరిగాయి. పట్టణప్రాంతాల్లో 2.44శాతంగా ఉన్నట్లు మోస్పీ వెల్లడించింది. ఏటికేడాది హౌసింగ్ ద్రవ్యోల్బణం రేటు జనవరిలో 2.05శాతంగా ఉంది. హౌసింగ్ దరలు కూడా 2.39శాతం గ్రామీణప్రాంతాల్లోను 1.92శాతం పట్టణప్రాంతాల్లోను పెరుగుదలనమోదుచేసాయి. జనవరి సిపిఐ ద్రవ్యోల్బణ డేటాను 2024 బేస్ ఇయర్‌గా చేసుకుని నిర్ధారించారు. గడచిన 12 ఏళ్లగా వ్యయం తీరు ఎలా మార్పులు చెందిందీ కూడా ఈ బేస్ ఇయర్ మార్పువల్ల తెలుస్తుందని మోస్పీ వెల్లడించింది. కొత్త వ్యవస్థలో సేవలరంగానికి కొంత ఒత్తిడిపెరుగుతుంది. ఆహార ఉత్పత్తుల వాటా మాత్రం కొంతమేర తగ్గుతుంది. ఇక గ్రామీణ హౌసింగ్, ఆన్‌లైన్ మీడియా సర్వీస్ ప్రొవైడర్లు లేదా స్ట్రీమింగ్ సేవలసంస్థలు, విలువలు జోడింపు ఉన్న డైయిరీ ఉత్పత్తులు, బార్లే, ఇతర ఉప ఉత్పత్తులు, పెన్‌డ్రైవ్ బాహ్య హార్డ్ డిస్క్, అటెండెంట్, బేబి సిట్టర్, కసరత్తుల సామనరగి వంటి వాటిని కూడా ఈసారి ద్రవ్యోల్బణంలో మదింపుకోసం ఎంచుకున్నారు. విసిఆర్, డివిడి ప్లేయర్లు, రేడియో టేప్‌రికార్డరు, సెకండ్‌హ్యాండ్ దుస్తులు, పీచు లేదా పీచుతో రూపొందించిన తాడు వంటిఉత్పత్తులను మాత్రం మదింపునుంచి మినహాయించారు. 2012 వరకూ వచ్చిన బేస్ ఇయర్‌సాయంతో రిటైల్‌ద్రవ్యోల్బణాన్ని గణించారు. ఈసూచీలో ఆహారం, శీతలపానీయాలకు ఎక్కువ వాటా ఉంది. ఆ తర్వాత హౌసింగ్, ఇంధనం, సేవలరంగం అంటే రవాణా, ఆరోగ్యం, విద్యారంగాలు కూడా నిలిచాయి. ప్రతి కేటగిరికి ఇచ్చిన ప్రాధాన్యం కుటుంబీకుల వ్యయ సర్వేల ఆధారంగా ఉంటుందని సగటు వ్యయం ఆధారంగా మదింపుచేసి నిర్ధారించడం జరుగుతుందని మోస్పీ వెల్లడించింది.



# వేతన పెంపును ప్రకటించిన 'విప్రో'

**బెంగళూరు, ఫిబ్రవరి 12:** సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీ విప్రో తన ఉద్యోగులకు మార్చి ఒకటవ తేదీనుంచి జీతాలను పెంచుతున్నట్లుప్రకటిం చడంతో ఉద్యోగులకు కొండంత ఊరట లభించింది. వేతన పెంపు ఎంతమేర ఉంటుం దన్నది ఇప్పటివరకూ స్పష్టత ఇవ్వలేదు. భారతీయ ఐటి సేవల కంపెనీలు వేతనాల పెంపుపై ఫోకస్ పెంచాయి. అలాగే వేరియబ్ వేతనాలపెంపును కూడా పరిశీలిస్తున్నాయి. అనిశ్చిత వాణిజ్య పరిస్థితుల్లో వేరియబుల్ పే మంచిదన్న భావనతో ఉన్నారు. సుంకాల యుద్ధం, భౌగోళిక ఉద్రిక్తతలు ఇందుకు కీలకంగా భావించాలి. టిసిఎస్ ఏప్రిల్‌ఋంచి పెంచాలని చూసినా గత సెప్టెంబరునుంచే పెంచుతున్నట్లు ప్రకటించింది.

# హిందాల్కో నికరలాభం రూ.2049 కోట్లు

**ముంబయి, ఫిబ్రవరి 12:** హిందాల్కో ఇం డస్ట్రీస్ నికరలాభం మూడో త్రైమాసికంలో రూ.2049 కోట్లు ఆర్జించినట్లు ప్రకటిం చింది. అయితే గత ఏడాది ఇదే కాలంలో 4741 కోట్లు ఆర్జించిన సంస్థ 56.8శాతం నికరలాభాలు క్షీణించినట్లు ప్రక టించింది. రాబడులపరంగా 0.7 శాతం పెరిగాయి. రూ. 66,521గా నమోదయింది. గతత్రైమాసి కంలో 66,058 కోట్లనుంచి స్వల్పంగా పెరిగింది. ఎబిడిటా కూడా 10.8శాతం క్షీణించి రూ.7994 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ. 8996 కోట్లుగా ఉంది.ఎబిడిటా మార్జిన్ 13.6శాతంనుంచి 12శాతానికి తగ్గింది. కంపెనీ న్యూయార్క్ లోని ఒస్వేగో ప్లాం ట్‌లో అగ్నిప్రమాదం కారణంగా రూ. 2610 కోట్లు భారం పడింది. ఇదే త్రైమా సిక ఫలితాలపై ప్రభావంచూపించిందని కంపెనీ చెపుతోంది. ఇక అల్యూమినియం విభాగం త్రైమాసిక ఎబిడిటా రూ.4832 కోట్లుగా ఉంది. 14శాతంపెరిగింది. ఆదిత్య ఎఫ్ఆర్‌పి, బ్యాటరీ ఫాయిల్, ఎసి ఫిన్ కోటింగ్; కాపర్ ట్యూబ్స్ వంటివాటిలో మంచి బిజినెస్ చేసుకోగలిగామని హిం దాల్కో ఎండి సతీష్‌పాయ్ అన్నారు. త్రైమా సిక ఫలితాలప్రకటనకు ముందు హిం దాల్కో షేర్లు 0.65శాతం దిగువన అంటే రూ.964.40వద్ద ఎన్ఎస్ఇలో కొనసా గాయి. బెంచ్‌మార్క్ నిఫ్టీ 0.57శాతం పత నం అయితే షేహిందాల్కో షేర్లు మరింత క్షీణించాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.